www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
PRAJAPAKSHAM

సంపుటి 08, సంచిక: 23 | గురువారం | 19-12-2024 | కరీంనగర్ Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00



ప్రజాపక్షం
గురువారం, డిసెంబరు 19

## అట్టుడుకుతున్న అరుణాచల్

డబుల్ ఇంజిన్ ప్రభుత్వం మంచుకొండలపై వివాదాల నిప్పు రాజేస్తున్నది. కేంద్రంతో పాటు, రాష్ట్రంలోనూ ఒకే ప్రభుత్వం ఉంటే అభివృద్ధి పథంలో పరుగులు తథ్యమనుకొని బిజెపికి పట్టంకట్టిన హిమాచల్ ప్రదేశ్ ప్రజలు ఇప్పుడు ఆందోళన బాట పట్టారు. సియాంగ్ ఎగువ ప్రాంతంలో బహుళార్ధసాధక ప్రాజెక్టుకు వ్యతిరేకంగా నిరసనలు చేపట్టారు. అబద్ధాలు చెప్పడంలో... అభూత కల్పనలను వ్యాప్తి చేయడంలో ఘనత వహించిన బిజెపిది హిమాచల్‌లోనూ అదే బాట. ప్రభావిత ప్రాంతాల ప్రజల్లో 60 శాతం మంది ప్రాజెక్టుకు సానుకూల మంటూ పెమా ఖండు ప్రభుత్వం ప్రచారం చేస్తున్నది. అదే నిజమైతే, వేలాదిమంది ప్రాజెక్టును ఎందుకు వ్యతిరేకిస్తారు? ఆందోళన బాటపడతారు? సుమారు 12 గిగావాట్ల జలవిద్యుత్ డ్యామ్‌ను అడ్డుకోవడానికి ప్రాణాలైనా ఇస్తామని అంటారు? చైనా మీదుగా ప్రవహించే సియాంగ్ నదిపై, అరుణాచల్ ఉత్తర భాగంలో ఎగువ సియాంగ్ జిల్లాలో ప్రాజెక్టు నిర్మించే ప్రయత్నాలు జోరందుకున్నాయి. స్థానికులు వద్దని వారిస్తున్న నేపథ్యంలో, అక్కడ సాయుధ బలగాలను మోహరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా శాంతియుత పోరాటం మొదలైంది. అటవీ హక్కుల చట్టం 2006 వంటి అనేక చట్టాలు, అందులో పొందుపరచిన హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్న ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టుకు జైకొట్టాల్సిందిగా సియాంగ్, ఎగువ సియాంగ్, తూర్పు సియాంగ్ జిల్లాల్లోని గ్రామస్తులను బలవంతంగా ఒప్పించే ప్రయత్నాలు ఫలించలేదు. న్యాయమైన డిమాండ్ల సాధనలో స్థానికులు వెనుకంజ వేయలేదు. ప్రజాభిప్రాయాన్ని గౌరవించే అలవాటులేని బిజెపి, బలప్రయోగానికి సిద్ధమైంది. రక్తపాతం సృష్టించడం, ప్రశ్నించే గొంతులు నొక్కడం ఆ పార్టీకి అలవాటే. బలగాల మోహరింపు అందులో భాగమే. ఈ ప్రాజెక్టు వల్ల తలెత్తే పర్యావరణ సమస్యలు కేంద్రానికి పట్టవు. అత్యధిక శాతం మంది సానుకూలంగా ఉన్నారని రాష్ట్ర ప్రభుత్వంతో చెప్పించి, ప్రాజెకులను శరవేగంగా అమలు చేస్తున్నది. కాగా, గత మూడు రోజులుగా నిరసన ప్రదర్శనలు కొనసాగు తున్నాయి. ప్రజలు పెద్దఎత్తున తరలి వస్తున్నప్పటికీ, ఎక్కువ మంది ఈ నిర్మాణాన్ని ఆమోదిస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, సహకారం, రవాణా శాఖ మంత్రి ఓజింగ్ టాసింగ్ అనడం సత్యదూరం. ప్రాజెక్టుపై పారదర్శకత లేదు. స్థానికుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోలేదు. నైతికతపై ప్రజలు అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం లేనేలేదు. రాజ్యాంగంపై గౌరవంలేని పార్టీకి, ఉల్లంఘనలు, చట్టాల అతిక్రమణలు కొత్తకాదు. ఐక్యరాజ్య సమితి డిక్లరేషన్లు... అంతర్జాతీయ ఒప్పందాలు పట్టనే పట్టవు. ఇలాంటి ప్రభుత్వం నుంచి ప్రజాక్షేమాన్ని ఆకాంక్షించడం అత్యాశే. చలనంలేని ప్రభుత్వాలకు ప్రజలే బుద్ధి చెప్పాలి. స్థానికుల మద్దతు ఉందని చెప్తున్న హిమాచల్ ప్రభుత్వాన్ని ప్రజాభిప్రాయ సేకరణకు డిమాండ్ చేయాలి. అక్రమ మార్గంలో తీసుకొచ్చిన మూడు సాగు నీటి చట్టాలకు వ్యతిరేకంగా రైతులు పోరాడి సాధించిన విజయం స్ఫూర్తిగా నిరసనలు విస్తృతం కావాలి. ప్రజా సంక్షేమాన్ని మరచిన ప్రభుత్వాలు ఎక్కువకాలం కొనసాగలేదని చరిత్ర చెప్తున్నది. కేంద్రం, హిమాచల్ ప్రభుత్వాలకూ ఇది వర్తిస్తుంది. దీనిని వినాశకరమైన పథకంగా పర్యావరణ శాస్త్రవేత్తలు, ప్రకృతి పరిరక్షకులు అభివర్ణిస్తున్నప్పటికీ మొండిగా ముందుకు వెళితే భారీ మూల్యాన్ని చెల్లించుకోక తప్పదు. రాత్రికిరాత్రి సర్వేలు చేయడం.. కొంత మందిని మంచి చేసుకొని లేదా ప్రలోభపెట్టి లేదా భయపెట్టి ఈ ప్రాజెక్టు అద్భుతమని ప్రకటనలు చేయించడం నీతిబాహ్య చర్యలు. నదుల అనుసంధాన ప్రణాళికలపై తాజా పరిశోధనలు, ఎన్నో ప్రశ్నలు సంధిస్తున్నప్పటికీ నిర్లక్ష్యం చేయడం ప్రమాదాలను కొనితెచ్చుకోవడమే. ఇకనైనా కేంద్రం, హిమాచల్ ప్రభుత్వం మొండిపట్టు వీడి, సమస్య మరింత తీవ్రం కాకుండా జాగ్రత్తపడడం అవసరం. అత్యంత సున్నితమైన ఈశాన్య రాష్ట్రా ల్లో అశాంతి దేశానికి మంచిది కాదు. ఇప్పటికే మణిపూర్‌లో నిరసన జ్వాలలు ఎగసిపడుతున్నాయి. హిమాచల్ కూడా మరో మణిపూర్‌లా మారకముందే జాగ్రత్త పడాలి. సియాంగ్‌లో మోహరిస్తున్న మిలటరీ, పారామిలటరీ బలగాలను తక్షణమే ఉపసంహరించుకోవాలి. ఈ ప్రాజెక్టు దేశ రక్షణకు కూడా ఉపయోగపడుతుందనే వితండవాదాన్ని మోదీ, ఖండు ప్రభుత్వాలు కట్టిపెట్టాలి. అదే నిజమైతే, ప్రాజెక్టు వివరాలను పారదర్శకంగా ఉంచాలి. ప్రజావ్యతిరేక విధానాలకు 'దేశ రక్షణ' లేదా 'దేశ భద్రత' ముసుగు తొడిగి, అమలుచేసే దుష్ట సంప్రదాయాన్ని వీడాలి. ప్రజాభిప్రాయాన్ని గౌరవించాలి. ప్రజాస్వామ్య విలువలు నిలబెట్టాలి.

# నూరేళ్ల చరిత్ర గమనంలో సిపిఐ



జెవి. సత్యనారాయణ మూర్తి
సిపిఐ ఎ.పి రాష్ట్ర సహాయ కార్యదర్శి

బ్రిటీష్ పాలనలో మగ్గుతున్న భారతదేశాన్ని వలస పాలన చెర నుంచి విముక్తం చేసి, ప్రజాస్వామ్య భారతంగా రూపొందించి సమసమాజాన్ని నిర్మించే లక్ష్యంతో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) 1925లో కాన్పూర్ నగరంలో డిసెంబరు 26న ఏర్పాటైంది. రానున్న 2025 డిసెంబరు నాటికి శత వసంతాలను పూర్తి చేసుకోబోతున్నది. ఈ నేపథ్యంలో భారత కమ్యూనిస్టు పార్టీ అవతరణ నుంచి ఇప్పటి వరకూ వందేళ్ల కాల వ్యవధిలో జరిపిన వీరోచిత పోరాట ఘట్టాలను, సాధించిన విజయాలను మరోసారి సింహావలోకనం చేసుకోవడం ద్వారా భవిష్యత్తు కర్తవ్యాలను నిర్దేశించుకోవలసిన అవసరం, బాధ్యత భారత కమ్యూనిస్టు పార్టీ శ్రేణులపై ఉన్నది.

దేశానికి కావలసింది స్వాతంత్ర్యం కాదు సంపూర్ణ స్వాతంత్ర్యం అనే నినాదాన్ని కాంగ్రెస్ మహాసభలో తొలిగా ప్రతిపాదించింది కమ్యూనిస్టులే. దాన్ని విస్తృతంగా జన బాహుళ్యంలోకి తెచ్చి ఆ నినాదాన్ని అన్ని పార్టీలకు శిరోధార్యమైన రాజకీయ అజెండాగా మలచిన పార్టీ సిపిఐ. ఆ దిశగా కలసి వచ్చే శక్తులను కలుపుకుని భారత స్వాతంత్ర్య ఉద్యమంలో అజరామరమైన, చారిత్రాత్మకమైన పాత్రను పోషించింది. పార్టీ ఏర్పాటు మొదలు అనేక నిర్బంధాలను, వివిధ కుట్ర కేసులను ఎదుర్కొంటూ స్వతంత్ర భారతంకోసం అనేక మంది ఉద్యమకారుల ప్రాణ త్యాగాలతో భారత కమ్యూనిస్టు పార్టీ జండా మరింత ఎరుపెక్కింది. ప్రధానంగా 1929–33ల మధ్య భారత కమ్యూనిస్టు పార్టీ నేతలు రాజ్యానికి లక్ష్యంగా మారారు. అనేక మంది నేతలు జైలు పాలయ్యారు. ప్రభుత్వం కమ్యూనిస్టు పార్టీని, కీలక నేతలనే టార్గెట్ చేసుకుని మీరట్ కుట్ర కేసును బనాయించింది. అత్యంత క్లిష్టమైన ఈ పరిస్థితిని కూడా నాటి భారత కమ్యూనిస్టు పార్టీ నేతలు సద్వినియోగం చేసుకున్నారు. కోర్టులో కేసు నేపథ్యంలో జరగిన వాదోపవాదాల తరుణాన్ని మార్క్సిజం, లెనినిజం ప్రచారానికి వినియోగించుకున్నారు. మీరట్ కుట్ర కేసులోని 33 మంది ముద్దాయిల్లో 27 మందికి శిక్షలు పడ్డాయి.

కమ్యూనిస్టు పార్టీ అంతకంతకూ విస్తరించడాన్ని పాలకులు సహించలేకపోయారు. మీరట్ కుట్ర కేసు తీర్పు అనంతరం దేశంలో భారత కమ్యూనిస్టు పార్టీని, పార్టీ అనుబంధ సంస్థలను నిషేధించింది. భారత కమ్యూనిస్టు పార్టీలో సభ్యత్వమూ నేరమని ప్రకటించింది. పార్టీ సభ్యులు రహస్యంగానే కార్యకలాపాలను సాగిస్తూ పార్టీ విస్తరణ జరిపారు. ఇందుకు ఉదాహరణ 1934 నుంచి పార్టీపై రెండు సార్లు నిషేధం విధించినా, నిర్బంధాలు, ఇతర కుట్ర కేసులు పెట్టినా 1947 నాటికి పార్టీ సభ్యత్వం 50 మంది నుంచి 90 వేలకు పెరిగిందంటే పార్టీ ప్రజల్లో సాధించిన విజయాలకు ఇది నిదర్శనం. స్వాతంత్ర్య ఉద్యమంలోకి రైతులు, కార్మికులు, విద్యార్థులు ఇలా వివిధ వర్గాలను ఆకర్షిస్తూ ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేయడంలో కమ్యూనిస్టు పార్టీ గణనీయమైన చొరవ చూపింది. విద్యార్థి సంఘం ఎఐఎస్ఎఫ్, ఇఫ్టా, అఖిల భారత కిసాన్ సభ, అభ్యుదయ రచయితల సంఘం వంటి వివిధ ప్రజాసంఘాలను నిర్మాణం చేసింది.

రెండవ ప్రపంచం యుద్ధం తరువాత భారతదేశంలో వెల్లువెత్తిన ప్రజా పోరాటాల్లో సిపిఐ ప్రత్యక్ష కార్యాచరణకు దిగింది. దేశ వ్యాప్తంగా జరిగిన చాలా ఉద్యమాలకు ముందుండి నాయకత్వం వహించింది. కార్మికులకు అండగా సాగించిన వర్గ పోరాటాలు యావత్ భారతదేశాన్ని వెల్లువలా ముంచెత్తాయి. వీటిలో 1946లో జరిగిన పోస్టాఫీసు, టెలిగ్రాఫ్, రైల్వే కార్మికుల సమ్మెలు చారిత్రాత్మకమైనవి. ఈ సమ్మెలకు పూర్తిగా సిపిఐ అండగా నిలిచింది. యావత్ పార్టీ శ్రేణులను ఆ సమ్మెలకు మద్దతుగా నిలిపింది. కార్మికవర్గంలోనూ బలమైన పార్టీ శాఖల నిర్మాణం ఉండడంతో ఆ సమ్మెల తాలూకా డిమాండ్లను కార్మికవర్గం సాధించుకుంది.

ఇక మరో కీలకమైన పోరాటం ఇండియన్ రాయల్ నేవీ (ఆర్ఐఎన్)పోరాటం. ఆర్ఐఎన్‌లో రేటింగ్స్ (జూనియర్ అధికారుల) తమ ఉన్నతాధికారులపై తిరుగుబాటు చేశారు. 1946లో జరిగిన ఈ సమ్మెలో సిపిఐ అగ్ర భాగాన నిలిచి నడిపింది. సమ్మెలోకి జాతీయోద్యమంలో ఉన్న ఇతర పార్టీలు భాగస్వామ్యం అయ్యాయి. కాంగ్రెస్, ముస్లిం లీగ్ పతాకాలతోపాటు ఎర్రజండా కూడా ఎగురవేశారు. 1946 ఫిబ్రవరి 22న దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెకు పిలుపు నిచ్చింది. దేశవ్యాపితంగా లక్షలాదిమంది కార్మికులు ఈ సమ్మెలో పాల్గొన్నారు. ప్రజా ఆగ్రహం పెల్లుబికింది. ఇది కమ్యూనిస్టుల నాయకత్వంలో జరిగిన గొప్ప పోరాటం.

బెంగాల్‌లో 1943లో ఏర్పడిన క్షామం తరుణంలో భారత కమ్యూనిస్టు పార్టీ నిర్వహించిన పాత్ర అనన్యసామాన్యమైంది. బెంగాల్‌లో ఏర్పడిన తీవ్రమైన కరువు దాదాపు 35 లక్షల మందిని ఆకలి చావులకు గురిచేసింది. 15 శాతంమంది రైతులు తమ భూముల్ని అమ్ముకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జనం ఆహారంకోసం కలకత్తాకు చేరుకోవడంతో నగరంలో ఆకలిచావులు తీవ్రమయ్యాయి. నగరం శవాల దిబ్బగా మారింది. ఈ తరుణంలో 'బెంగాల్ మరణిస్తే భారతదేశం జీవించలేదు' భారతీయుల క్షేమం అంటే బెంగాల్‌లో ఆకలి మరణాలు ఉండరాదని, మనం మన దేశాన్ని ప్రేమిస్తూ బెంగాల్‌ను కాపాడుకోవాలని పిలుపునిస్తూ సిపిఐ చేసిన సహాయ కార్యక్రమాలు ప్రపంచం దృష్టిని ఆకర్షించాయి. ఆకలి బాధిత బెంగాల్ ఉద్యమం యావత్ జాతిని కదిలించింది. రాష్ట్రంలో పార్టీ తిరుగులేని శక్తిగా ఎదిగింది. ఈ పోరాటాల అనుభవాలు అన్నీ అనంతర కాలంలో ఆహార భద్రతా చట్టం రూపొందించేందుకు ఉపయోగించుకుని యుపిఎ–1 ప్రభుత్వంలో ప్రత్యేకంగా దేశ ప్రజలందరికీ ఆహార




భద్రత అందేలా చూడడంలో సిపిఐ పాత్ర చాలా కీలకమైంది. ఇప్పటికీ ఈ చట్టం ఆధారంగానే కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాల ప్రజలకు ఉచితంగా రేషన్ సరఫరా చేస్తున్నదంటే సిపిఐ నిర్వహించిన పోరాటాల వల్లనే అనేది గుర్తించాల్సిన సత్యం.

1943–50ల మధ్య భారతదేశంలోని అనేక ప్రాంతాల్లో కమ్యూనిస్టుల నాయకత్వంలో రైతాంగం ఉద్యమాలు నడిచాయి. భూస్వాములకు జమీందారులకు వ్యతిరేకంగా దేశంలోని భూమిలేని వారు, చిన్న రైతులు కౌలుదారులు సిపిఐ నాయకత్వంలో సమీకరించబడ్డారు. ఈ సమీకరణలు కమ్యూనిస్టుల నేతృత్వంలో సాయుధ తిరుగుబాట్లుగానూ మారాయి. విజయం సాధించాయి. ఇందులో అత్యంత కీలమైనవి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, కేరళలో పొడచూపిన పున్నప్ర, వాయిలార్ పోరాటం, బెంగాల్‌లో నడచిన తెబాగా పోరాటాలు వందేళ్ల భారత కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో మైలురాళ్లు. వీటితో పాటు మహారాష్ట్ర, అసోం, త్రిపుర, కాశ్మీర్ ప్రాంతాల్లోనూ రైతాంగ ఉద్యమాలకు సిపిఐ నేతృత్వం వహించింది. దున్నే వాడి పక్షాన నిలిచి భారతదేశానికి సోషలిజం ద్వారానే అసలైన విముక్తి అని చాటింది.

### తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం

సాయుధ రైతాంగ పోరాటాల చరిత్రలో ప్రపంచం దృష్టిని ఆకర్షించిన ఉద్యమం తెలంగాణ సాయుధ పోరాటం. భారత కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో జరిగిన మహోద్యమాల్లో అత్యంత కీలకమైంది. దున్నే వాడికే భూమి అనే నినాదంతో తెలంగాణాలోని రైతాంగాన్ని సమీకరించిన సిపిఐ సాయుధ పోరాటం నడిపింది. 1946 నుంచి 51వరకు ఐదేళ్లపాటు సుదీర్ఘంగా సాగిన ఈ ఉద్యమం భూస్వాములకు, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగింది. అన్యాయంగా అమలు చేసున్న పన్నులను రద్దు చేయాలని, వెట్టి చాకిరీని నిర్మూలన చేయాలనీ, పంటలు పండించే రైతులకే భూములు దక్కాలని సిపిఐ చేపట్టిన పోరాటంపై అక్కసుతో నిజాం సేనలు, రాజాకార్లు చేసిన అణచివేత చర్యలకు ప్రతిఘటన ఉద్యమం రైతాంగ సాయుధ పోరాటంగా మారింది. నాలుగువేలమంది భారత కమ్యూనిస్టు పార్టీ వీరుల ప్రాణ త్యాగాలతో ఈ మహోద్యమం విస్తరించి మూడు వేల గ్రామాలను విముక్తం చేసింది. పది లక్షల ఎకరాలు భూమి రైతులకు పంపిణి జరిగింది. వెట్టి చాకిరీ రద్దు అయింది. నియంతృత్వ నిజాం సేనలు మట్టి కరిచాయి. తెలంగాణకు విముక్తి కలిగింది. ఆ సంస్థానం భారతదేశంలో విలీనం అయింది.

గోవా విముక్తి ఉద్యమంలో సిపిఐది ఘనమైన చరిత్ర. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా పోర్చుగీసు వారి కబంధ హస్తాల్లో ఉన్న గోవా విముక్తికోసం సిపిఐ నేత వి డి చితాలే నేతృత్వంలో సాయుధ పోరాటానికి కూడా సిద్ధమైంది. ఫ్రెంచివారి నుంచి పాండిచ్చేరిని విముక్తం చేయడంలో సిపిఐదే కీలక పాత్ర. ఈ ఉద్యమాల్లోనూ సిపిఐ నేతలు వి.సుబ్బయ్య, కాళీచరణ్ ఘోష్‌ల నాయకత్వంలో ఈ ఉద్యమాలు జరిగాయి. ఆయా రాష్ట్రాలు పరాయిపాలన నుంచి విముక్తం అయ్యాయి.

అనంతరకాలంలో దేశంలోని వ్యవసాయ కార్మికుల కోసం బికెఎంయు(1968) పేరుతో సిపిఐ ఒక ప్రజాసంఘం నిర్మించింది.

ఎన్నికల వ్యవస్థలోనూ సిపిఐ తన బలాన్ని నిరూపించుకుంది. కొన్ని రాష్ట్రాల్లో ఎన్నికల ద్వారా కమ్యూనిస్టు ప్రభుత్వాలను ఏర్పరచే స్థాయికి చేరుకుంది. 1955 ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో అధికారంలోకి వచ్చే పరిస్థితి సిపిఐకి వచ్చింది. వివిధ కారణాలతో అది జరుగలేదు. అయితే రెండేళ్ల అనంతరం 1957లో కేరళలో ఎన్నికల్లో సిపిఐ సొంతంగా పోటీచేసి అధికారాన్ని చేజిక్కించుకుంది. ఇది ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమాల చరిత్రలోనే చారిత్రాత్మక ఘటన. బ్యాలెట్ ద్వారా కమ్యూనిస్టులు అధికారంలోకి రావటం ప్రపంచ చరిత్రలో అదే ప్రథమం. ఎన్నికల్లో విజయం సాధించిన సిపిఐ తరపున తొలి సిఎంగా ఇఎంఎస్ నంబూద్రిపాద్ 1957 ఏప్రిల్ 5న ప్రమాణ స్వీకారం చేశారు. సిపిఐలో చీలిక అనంతరం 1977లో బెంగాల్ కమ్యూనిస్టు పార్టీల పాలనకిందకు వచ్చింది. 34ఏళ్లు పాలించింది. ఇదే ఊపుతో 1978లో త్రిపురలోనూ కమ్యూనిస్టు శక్తులు అధికారాన్ని పొందాయి.

పంజాబ్‌లో జరిగిన ఖలిస్థాన్, అసోంలో ప్రత్యేక బోడో ల్యాండ్ లాంటి వేర్పాటు ఉద్యమాలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ నిలబడింది. మతోన్మాద శక్తుల ప్రమాదం గూర్చి దేశాన్ని ముందుగా హెచ్చరించింది, వాటికి వ్యతిరేకంగా నడుంకట్టింది సిపిఐ.

ఇక పార్లమెంటరీ వ్యవస్థలోనూ సిపిఐ నేతలు నిర్వహించిన పాత్ర చాలా ఉత్తేజకరమైంది. పార్లమెంటుకు ఎక్కువమంది ఉత్తమ పార్లమెంటేరియన్లను ఇచ్చిన చరిత్ర సిపిఐకి ఉన్నది. యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వంలో సిపిఐ కీలకమైన రెండు పదవుల్ని నిర్వహించింది. భారత హోంమంత్రిగా ఇంద్రజిత్ గుప్తా, వ్యవసాయశాఖ మంత్రిగా చతురానన్ మిశ్రా లు పాలనలో సిపిఐ ముద్రను వేయగలిగారు. పార్లమెంటులో సిపిఐ ఎంపిలుగా ఇంద్రజిత్ గుప్తా, భూపేశ్ గుప్తా తదితరులు మాట్లాడుతుంటే ప్రధానులు సహా మంత్రముగ్ధులైన సందర్భాలున్నాయి. వీరితో పాటు ఎ కె గోపాలన్, అచ్యుత మీనన్, పి కె వాసుదేవ నాయర్, రేణు చక్రవర్తి, గీతాముఖర్జీ, గురుదాస్ దాస్ గుప్తా వంటి నేతలు పార్లమెంటులో సిపిఐ పార్టీ ప్రతిష్టను ఇనుమడింపచేశారు. అనంత కాలంలో యుపిఎ–1 ప్రభుత్వం ఏర్పాటు వెనుక సిపిఐ కీలకంగా వ్యవహరించింది. ఇప్పుడు ఇండియా కూటమి ఏర్పాటులోనూ సిపిఐ భాగస్వామి.

ప్రపంచవ్యాప్తంగా చోటు చేసుకున్న వివిధ పరిణామాల నేపథ్యంలో అనంతర కాలంలో కమ్యూనిస్టు పార్టీ వివిధ ఇబ్బందులను ఎదుర్కొంటున్నా తమ మూలాలను మరువకుండా సమసమాజ నిర్మాణ లక్ష్యంకోసమే పనిచేస్తున్నది. తొలిదశలో బ్యాంకుల జాతీయాకరణ, రాజభరణాల రద్దు, భూ సంస్కరణల్ని ప్రభుత్వాలపై ఒత్తిడి చేసి సాధించింది. తరువాత కాలంలో గ్రామీణ ఉపాధి హామీ చట్టం, సమాచార హక్కు చట్టం, ఆహార భద్రతా చట్టం, అటవీ హక్కుల చట్టం లాంటి ఎన్నో సంస్కరణాత్మక చట్టాల రూపకల్పన కోసం పనిచేసి విజయం సాధించింది.

ఎన్నికల క్షేత్రంలో వెనుకబడ్డా అధికారంలో ఉన్న మతవాద శక్తులను ప్రతిఘటిస్తూ దేశ సంక్షేమం కోసం నిత్యం జనం మధ్యనే ఉంటూ బలమైన ఉద్యమ శక్తిగానే భారత కమ్యూనిస్టు పార్టీ నడుస్తున్నది.

# ఏడాదిలో మారిపోయిన పొలిటికల్ ట్రెండ్!

తెలంగాణలో కొత్త ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తి అయింది. ఈ సంవత్సరకాలంలో ప్రస్తుతం అధికార కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ఏంటి.. రేవంత్ పాలనపై ప్రజల్లో ఉన్న అభిప్రాయం ఎలా ఉంది.. అధికారం కోల్పోయి ప్రస్తుతం ప్రతిపక్షపార్టీగా ఉన్న బిఆర్ఎస్ పరిస్థితి, గులాబీ బాస్ కెసిఆర్ పరిస్థితి ఏంటి? మరో విపక్ష పార్టీ బిజెపి పరిస్థితి ఎలా ఉంది? పరిశీలిద్దాం.

గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనపై నిజానికి సామాన్యుల్లో పెద్దగా వ్యతిరేకం లేనప్పటికీ విద్యావంతుల్లో తీవ్రమైన వ్యతిరేకత ఉండేది. అది సోషల్ మీడియా ద్వారా విస్తృతం అయి.. ప్రత్యామ్నాయ శక్తికోసం ఎదురుచూసింది. సరిగ్గా అదే సమయంలో రేవంత్ బిఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగారు. ఆ పరిస్థితులే స్వల్ప తేడాతో రేవంత్ రెడ్డిని సిఎంని చేశాయి. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చాయి.

ఇక అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ పరిస్థితి.. సిఎంగా రేవంత్ రెడ్డి పాలన తీరు ఎలా ఉంది? రేవంత్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలలో ప్రధానమైనవి ఆరు గ్యారెంటీలు.. ఇవికాక వందల కొద్ది హామీలు సైతం ఇచ్చారు. అయినప్పటికీ ప్రజల దృష్టి కేవలం ఈ ఆరు గ్యారంటీలపైనే ఉంది. అయితే అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే 6 గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పిన రేవంత్.. అధికారంలోకి వచ్చి సంవత్సరం అవుతున్నప్పటికీ మహిళలకు ఉచిత బస్సు పథకం, రైతులకు రుణమాఫీ మినహా మిగతా గ్యారెంటీలేవి పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోయారు.. ఇక చెరువుల ప్రక్షాళనకు రేవంత్ రెడ్డి పూనుకున్న విధా నం..హైడ్రా కూల్చివేతలతో దూసుకుపోతున్న విధానం.. అందరూ ఆమోదించాల్సిందే అయినప్పటికీ.. ఆ చర్య ల్లో బడా బాబులకు సంబంధించిన కూల్చివేతల్లో ఒక్క అక్కినేని నాగార్జున ఎన్ కన్వెన్షన్ మినహా పెద్దగా ఏదీ కనిపించకపోవడం గమనార్హం. హైడ్రా కూల్చివేతల మూలంగా పేద, మధ్య తరగతి ప్రజలు ఉన్నఫలంగా రోడ్డుపాలయ్యారు. ఈ క్రమంలో సిఎం రేవంత్ రెడ్డిపై సామాన్యులు ఆగ్రహంతో ఉన్నారు.

హైడ్రా సంకల్పం మంచిదే అయినప్పటికీ ఆ చర్యలు పేద, మధ్యతరగతి ప్రజల జీవితాలని అగాధంలోకి నెట్టే విధంగా ఉండటం తో ఆ చర్యలను ఎవరూ ఆమోదించలేని పరిస్థితి నెలకొంది. ఇక హైదరాబాద్‌లో హైయెస్ట్ రెవెన్యూ రియల్ ఎస్టేట్, రిజిస్ట్రేషన్ స్టాంప్ డ్యూటీ కిందవస్తుంది. అలాంటి రియల్ ఎస్టేట్, రిజిస్ట్రేషన్ స్టాంప్ డ్యూటీ ఈ సంవత్సర కాలంలో హైడ్రా చర్యల మూలంగా పూర్తిగా బలహీన పడిందనే విమర్శలు ఉన్నాయి. ఎందరో రియల్టర్లు ఉపాధి కోల్పోయారని వాదనలు వినిపిస్తున్నాయి.

రేవంత్ రెడ్డి సిఎం కావడానికి, కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి అతి ముఖ్యమైన బలం, పునాదిగా నిలిచిన శక్తి సోషల్ మీడియా. అయితే, రేవంత్ సిఎం కావడానికి ఏదైతే పునాదిగా నిలిచిందో.. రేవంత్ సిఎం అయ్యాక ఆ పునాదినే పెకిలించేలా సోషల్ మీడియాని టార్గెట్ చేస్తూ ఉపన్యాసాలు ఇస్తున్నారు. సోషల్ మీడియాపై కత్తి దూస్తూ చర్యలకు పూనుకోవడంతో సోషల్ మీడియా మాధ్యమం రేవంత్ కు నెగెటివ్‌గా.. అది బిఆర్ఎస్ కు సానుకూలంగా మారుతోందని చెప్పవచ్చు. దీన్ని సీఎం రేవంత్ గమనించారా? గమనించలేదా? లేదా సలహాదారులు ఎవరైనా ఇలాంటి విషయాలను సిఎం దృష్టికి తీసుకెళ్లారా? అనేది ప్రస్తుతానికి మిలియన్ డాలర్ ప్రశ్న. అంతేకాదు ప్రభుత్వంలోని మహిళా మంత్రి కొండ సురేఖ టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌కు సినీ నటుడు నాగార్జున ఫ్యామిలీకి లింకు కలుపుతూ మాట్లాడిన అసభ్య పదజాలం.. రేవంత్ ప్రభుత్వ తీరును తెలంగాణ ప్రజలకు తెలిపింది.

ఇక కాంగ్రెస్ అంటేనే దశాబ్దాల సీనియారిటీ ఉన్న రాజకీయ భీష్ములకు పెట్టింది పేరు. యంగ్ లీడర్ లను తొక్కిపడేసే చరిత్ర ఉన్న కాంగ్రెస్‌లో రేవంత్ రెడ్డి అతి చిన్న వయసులోనే ముఖ్యమంత్రి స్థానానికి ఎదిగి కాంగ్రెస్ లోని సీనియర్ నేతలను సమన్వయ పరుస్తున్న తీరు అభినందించదగ్గరి. ఇది ప్రభుత్వాన్ని సుస్థిరపరిచేందుకు ఎంతగానో ఉపయోగపడే లక్షణంగా చెప్పుకోవచ్చు. ఇక రేవంత్ సంవత్సర కాలంలో సానుకూల అంశాలను పరిశీలిస్తే.. ముఖ్యంగా అవినీతి రహిత పాలనగా, పైరవీలకు తావివ్వని సీఎంగా భావించవచ్చు. ఉద్యోగ నియామకాలు, యువత భవిష్యత్తుపట్ల సీఎం చూపుతున్న చొరవ, స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు, ఇంటర్నేషనల్ ఇంటిగ్రేటేడ్ మోడల్ స్కూల్స్ ఏర్పాటుకు చర్యలు, ఎసిబి దాడులతో అవినీతి అధికారులపై చర్యలు, ఫుడ్ సేఫ్టీ, డ్రగ్స్ నియంత్ర ణ ఇలాంటి చర్యలు సిఎం రేవంత్ రెడ్డి పాలనకు అసెట్స్‌గా చెప్పుకోవచ్చు.

మరో వైపు ఈ సంవత్సర కాలంలో బిజెపి బాగానే పుంజుకుంది. దీనికి బిజెపి, బిఆర్ఎస్ మధ్య రహస్య ఒప్పందమే కారణమనే విమర్శలు సైతం ఉన్నాయి. గతంలో నాలుగు ఎంపీ స్థానాలకే పరిమితమైన బిజెపి తెలంగాణలో 8 ఎంపి స్థానాలకు ఎరిగింది. బిఆర్ఎస్,కాంగ్రెస్ మధ్య పోరును బిజెపి క్యాష్ చేసుకొని తెలంగాణలో బలపడిందని చెప్పవచ్చు. ఇది ఏడాదిలో తెలంగాణలో మారిన రాజకీ య పరిస్థితులు. మూడు ప్రధాన పార్టీల బలాబలాలు.



శ్రీనివాస్ గుండోజు
9985188429

# అహంలో ప్రథమం – గుణంలో అధమం


ధనం మనిషిని నడిపించే ఇంధనంలా మారిన నేపథ్యంలో మానవ జీవితాలు కడు దుర్భరంగా మారుతున్నాయి. ఆప్యాయతలకు అర్థాలు మారుతున్నాయి. బంధాలకు నిర్వచనాలు రూపాంతరం చెందుతున్నాయి. మానవ సంబంధాలు విశ్వసనీయత కోల్పోయి, ఆర్థిక బంధాలుగా పరివర్తన చెందుతున్నాయి. చేసిన త్యాగాలు, అనుభవించిన కష్టాలు అక్కరకు రాకుండా పోతున్నాయి. కృతజ్ఞత కానరావడం లేదు. మేలుచేసిన వారికి కీడు ఎదురవుతున్నది. మనుషుల మధ్య మాటలు కూడా కరువైపోతున్నాయి. పలకరిస్తే దండగనే భావనతో ఆత్మీయులు సైతం దూరమైపోతున్నారు. అవకాశవాదంతో రంగులు మారుస్తున్నారు. స్వార్థంకోసం అనునిత్యం జరిగే అన్వేషణా క్రమంలో మానవ హృదయానికి స్వాంతన సమకూరడం లేదు. మానవ వాంఛలు పెరిగాయి...కోట్లకోసం కుస్తీలు ...ఆస్తుల కోసం ఆరాటాలు...అలవికాని కోరికల కోసం మనిషి నిరంతరం వేటాడే మనస్తత్వం సంతరించుకుంటున్నాడు. స్వార్థం పతాక స్థాయికి చేరింది. హితవచనాలు కంటకప్రాయంగా పరిణమించాయి. కుటిలత్వం, క్రూరత్వం మేళవించిన క్రొంగొత్త నీచత్వం మనుషుల మనస్సుల్లో తిష్టవేసింది. సకల అవలక్షణాలతో మానవ సమాజం అత్యంత ఘోరంగా తయారైనది. స్వార్థ చింతనలో మునిగితేలుతూ నిజమైన ఆనందాన్ని కోల్పోతున్న నేపథ్యంలో కృత్రిమ ఆనందంకోసం 'మనిషి' వక్ర మార్గాలు వెతుక్కోవడం విడ్డూరం. సక్రమ జీవన విధానమే నిజమైన ఆనందానికి సోపానం. మనిషిలోని స్వార్థం...వంచన...మృగత్వాన్ని తలపిం చే కీచకత్వం... అనునిత్యం పరులను హింసించి, ద్వేషించే మనస్తత్వాలు మానవ జాతి మానసిక పతనానికి అగ్నికి ఆజ్యంలా తోడయ్యాయి. మానసిక దారిద్ర్యంలో బ్రతుకుతున్న మనిషికి నిజమై న ఆనందం ఏనాటికీ లభించదు. సకల సద్గుణ సంపదలను కోల్పోయి సకలపాపాలను మూటగట్టుకుని జీవించడంలో నిజమైన మానసిక సంతృప్తి లభించదు. లేని గుణాలను అన్వయించుకుని జీవించడంలోని కపటత్వం పదుగురిలో పరిహాస ప్రాయమౌతున్నది. మనసులో లేని మంచితనం భౌతికంగా ప్రదర్శించ డం వలన నిజమైన ఆనందం సంప్రాప్తించదు. కృత్రిమ లక్షణాలు స్వీయ మానసిక విధ్వంసానికి సూచకాలు. సిరిసంపదలకంటే గుణసంపద మనిషిని మహోన్నతుని చేస్తుంది. సంస్కారగుణం తరగని యశస్సుకు సోపానం. విలువలే మనిషికి నిజమైన ఆభరణాలు. పెద్దలమాట 'చద్దన్నం మూట' అనే నానుడి అక్షరసత్యం. నాటి పెద్దలు తమ అనుభవ సారాంశంతో పలికిన హితోక్తులు సదా వాంఛనీయం..అనుసరణీయం. నీతి కథలతో సద్గుణాలు అలవడేవిధంగా సంస్కార వంతమైన పెంపకాలతో సాగిన నాటితరం ఆలోచనలు నేటి తరానికి పనికిరావడం లేవు. కృతకమైన, ఆకర్షణీయమైన జీవనానికి అలవాటుపడిన యువతకు విలువల ప్రాశస్త్యం గురించి వివరించినా ప్రయోజనం శూన్యం. నడుస్తున్న (అ)నాగరిక చరిత్ర భవిష్య మానవాళి మనుగడకు విఘాతంలా మారింది. సుఖసౌఖ్యాలు, భోగభాగ్యాలు అనుభవించడానికి మానవ మేధస్సు అత్యద్భుతంగా వినియోగపడింది. ఎంతగా మానవ విజ్ఞానం పెరిగినా బుద్ధిమాత్రం పాతాళానికి దిగజారింది. స్వచ్ఛమైన మనసులో కల్మషం మొదలైనది. మానవ వాంఛలు ఆకాశమే హద్దుగా చెలరేగిపోతున్నాయి. సృష్టిలో మానవుడంటే ప్రథముడు కాదు అధముడు అనే భావన క్రమేపీ పెరిగిపోతున్నది. విజ్ఞానం, సంస్కారం, వినయం, వివేకం వంటి అమూల్యమైన గుణాలతో వికసించవలసిన మానవ మేధస్సు కృత్రిమమైన సంపదలకోసం వెంపర్లాడుతున్నది. సహజమైన గుణాలను త్యజించి, కొరగాని కోరికలకోసం కలలుకంటూ వంచనతో కూడిన జీవన విధానానికి అలవాటుపడిన నేపథ్యంలో మనిషిలో మానవ లక్షణాలు మిథ్యగా మారిపోయాయి. సద్గుణాలను వదలిపెట్టి, ఆధునికత్వం పేరుతో కృత్రిమంగా జీవించే మనిషి జీవితం లో కరిమబ్బులు కమ్ముకుంటున్నాయి. సకల సద్గుణ సంపదతో విరాజిల్లే నాటి రోజులు నేటి కాలంలో ఎంత వెదకినా కానరావడం లేదు. నిండైన గుణాలు మెండుగా ఉంటే వ్యక్తిత్వం వికసిస్తుంది. గాలికి వంగే చెట్టు తుఫానును సైతం తట్టుకుని నిలబడుతుంది. పొడవైన చెట్టు అననుకూలమైన పరిస్థితుల్లో నిటారుగా నిలబడితే, గాలివాటానికి వంగకపోతే నేలపై ఒరగక తప్పదు. మనిషి కూడా ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగి ఉండడమే నిజమైన సంస్కారగుణం.



సుంకవల్లి సత్తిరాజు,
9704903463

# దినకూలీ బతుకుల్లో వెలుగురేఖ.. సమగ్ర కూలీ చట్టం

జీవన స్థితి గతుల్లో మార్పులేక కూలీలు బ్రతుకు బండిలాగుతున్నారు. శ్రమను నమ్ముకొని చమట చుక్కలు ధారపోసి కూలీలు జీవనం సాగిస్తున్నారు. కూలీల కూలీరేట్లు పెరగడం లేదు. కాని ప్రజా ప్రతినిధుల వేతనాలు పెచ్చు పెరుగుతున్నాయి. అత్యంత దయనీయ జీవితాలు కూలీలు వెళ్ళదీస్తుంటే... ప్రజా ప్రతినిధులు విలాసవంతమైన జీవితాలు గడుపుతున్నారు. పూరిగుడిసెల్లో , పెంకుటిళ్లలో ఉంటూ రోజు కూలీ చేస్తేనే గడవని పరిస్థితి నెలకొంది. చెమట చుక్కలు నమ్ముకొన్న కూలీలు రూ.300 నుండి 400 వరకు రోజుకు గిట్టుబాటు అవుతోంది. వచ్చే దినకూలీతో జీవనం సాగిస్తుంటే ప్రజాప్రతినిధులు లక్ష 50వేల నుంచి 2 లక్షల 50 వేల వేతనాలు పొందుతూ దర్జాగా జీవితం సాగిస్తున్నారు. గ్రామ సర్పంచ్ నుంచి రాష్ట్రపతి దాకా నెల నెలా వేతనాలు పొందుతున్నారు. కూలీలు మాత్రమే ఏ రోజుపనిచేస్తే ఆ రోజు పూట గడుస్తోంది. ఒక్క రాష్ట్రంలో ఒక్కొక్క విధంగా కూలీ రేట్లు ఇస్తున్నారు. కనీస రోజుకూలీ కేరళ రాష్ట్రంలో రూ.670 కాగా అతి తక్కువగా కూలీ వస్తున్న రాష్ట్రం మహారాష్ట్రలో 240 రూపాయలు మాత్రమే. త్రిపురలో రోజుకూలీ రూ.250 ఇస్తున్నారు . ప్రజా ప్రతినిధులు అత్యధికంగా వేతనాలు పొందుతున్న రాష్ట్రం తెలంగాణ కావడం విశేషం. నెలవారీగా ప్రజా ప్రతినిధులు 2.50 లక్షలు వేతనం పొందుతున్నారు. కర్నాటక ప్రజా ప్రతినిధులకు నెలవారీగా 2లక్షల 5వేల వేతనం పొందుతున్నారు. ప్రజా ప్రతినిధుల వేతనాలు ఎప్పటికప్పుడు పెరుగుతాయి. కాని కూలీ రేట్లు పెరగక కూలీలు శ్రమ దోపిడీకి గురవుతున్నారు. కేరళలో ప్రజా ప్రతినిధులకు 45 వేల 750 రూపాయలు, త్రిపురలో 48వేల 420 రూపాయలు, సిక్కింలో 52వేలు, మిజోరామ్‌లో 65వేలు, మధ్యప్రదేశ్‌లో 1 లక్షా 25 వేలు, మహారాష్ట్రలో లక్ష 60 వేలు, జమ్ము కాశ్మీర్‌లో లక్ష 60 వేలు, బీహార్‌లో లక్ష 65వేలు, హిమాచల్ ప్రదేశ్‌లో లక్షా 85 వేలు, ఉత్తరప్రదేశ్‌లో లక్షా 87 వేలు, కర్నాటకలో 2 లక్షల 5 వేల రూపాయలు వేతనాలు పొందుతున్నారు. గ్రామ సర్పంచ్‌కి నెలకు 6వేల 500 రూపాయలు, ఎంపిటిసికి 6,500/–రూ.లు, జెడ్‌పిటిసికి13 వేలు, ఎంపిపిపికి 13వేలు, జెడ్‌పి చైర్మన్‌కు లక్ష నెల వేతనాలు పొందుతున్నారు. కాని కూలీలకు కూలీ పెరగక బ్రతుకులు ఛిద్రం అవుతున్నాయి. లోకసభ సభ్యులకు 1లక్షా 30వేలు, రాజ్యసభ సభ్యులకు లక్షా 30వేలు రూ.లు, అలవెన్సులు కాక నెలనెలా వేతనాలు పొందుతున్నారు. శాసన మండలి సభ్యులకు నెలనెల రెండు లక్షల 50 వేలు రూపాయలు తీసుకుంటున్నారు. రాష్ట్రపతికి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి, గవర్నర్లకు 2లక్షల 50 వేలు రూపాయల పైగా వేతనాలు పొందుతున్నారు. కూలీ రేట్లు పెరగక కూలీల బతుకులు చితికి పోతున్నాయి. కేరళలో రోజు కూలీ 670రూ.లు, త్రిపురలో 250 రూ॥లు, మధ్యప్రదేశ్‌లో 290 రూ.లు మహారాష్ట్రలో 240రూ.లు, జమ్ముకాశ్మీర్‌లో 453 రూ.లు, భీహార్‌లో 267 రూ.లు హిమాచల్ ప్రదేశ్‌లో 343 రూ.లు, ఉత్తరప్రదేశ్‌లో 271 రూ.లు, కర్నాటకలో 264రూ.లు, తెలంగాణలో 415 రూ. కూలీలు కూలి పొందుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 300 నుంచి400 రూ. కూలీలు పొందుతున్నారు. ఆయా రాష్ట్రలతో పాటు తెలంగాణ ఎ.పి. లో సగటు కూలీ రేట్లలో తగ్గుదల ఉంటుంది. దిన కూలీలు, అడ్డ కూలీలు, వ్యవసాయ కూలీలు ఇలా అసంఘటితరంగంలో పనిచేసే కూలీలకు దిన కూలీ గిట్టుబాటుకాక ఆర్థికంగా చితికి పోతున్నారు. దిన కూలీలకు రోజువారు కూలీ చట్టబద్ధంగా ఉండేలా పాలకులు అవసరమైన చర్యలకు ఉపక్రమించాలని కూలీలు కోరుతున్నారు. గరిష్ట రోజువారీ కూలీ గిట్టుబాటు అయ్యేలా సమగ్ర కూలీ చట్టం పాలకులు తీసుకువచ్చి జీవితంలో వెలుగు నింపాలని కూలీలు మొరపెట్టుకుంటున్నారు.



మరవరాని మన చరిత్ర
రూ॥40/-
పేజీలు:40
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapakasham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★



రాష్ట్రంలో కొత్తగా 30వేల ఐటి ఉద్యోగాలు

ఆర్టిజన్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా : కూనంనేని

రాష్ట్రంలో దారుణంగా పడిపోతున్న ఉష్ణోగ్రతలు...

లోపలి పేజీల్లో



సంపుటి 08, సంచిక: 23 | గురువారం | 19-12-2024 | కరీంనగర్ Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00


## జమిలిపై జెపిసి

31 మంది ఎంపిల పేర్లతో జాబితా


కాంగ్రెస్ నుంచి ప్రియాంకాగాంధీ

చైర్మన్‌గా పిపి చౌదరి, అనురాగ్ ఠాగూర్ పేర్ల పరిశీలన



**న్యూఢిల్లీ :** జమిలి ఎన్నికల బిల్లలను జెపిసికి పంపేందుకు కేంద్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఈ బిల్లుల పరిశీలనకు సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జెపిసి) ఏర్పాటు చేసింది. పలు పార్టీలకు చెందిన మొత్తం 31 మంది ఎంపిలతో జెపిసి ఏర్పాటుకు జాబితా తయారు చేసింది. ఇందులో 21 మంది లోక్‌సభ ఎంపిలు, 10 మంది రాజ్యసభ సభ్యులు ఉన్నారు. లోక్‌సభ సభ్యుల్లో బిజెపికి చెందిన కేంద్ర తరువాయి 12లో

## జనవరి 2 నుంచి టెట్



**హైదరాబాద్ :** తెలంగాణలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) షెడ్యూల్‌ను పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విడుదల చేశారు. సబ్జెక్టుల వారీగా షెడ్యూల్‌ను ప్రకటించారు. జనవరి 2 నుంచి 20 వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఉదయం, సాయంత్రం.. రెండు సెషన్లుగా 9 నుంచి 11.30 వరకు, మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. ఈసారి టెట్ పేపర్ 1, పేపర్2లకు కలిపి సుమారు 2.75 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు.



# పరువు తీశారు

అదానీపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరపాలి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డిమాండ్

టిపిసిసి ఆధ్వర్యంలో చలో రాజ్‌భవన్

రోడ్డుపై బైఠాయించిన సిఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ నాయకులు



ప్రజాపక్షం/హైదరాబాద్

దేశం పరువు మంట కలిపిన అదానీపై విచారణ జరపాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. గత 75 ఏళ్లుగా దేశ ప్రతిష్ఠను కాంగ్రెస్ పార్టీ పెంపొందించిందని, ప్రధాని మోదీ, అదానీ కలిసి దేశ పరువు తీసేశారని రేవంత్‌రెడ్డి తీవ్రంగా విమర్శించారు. అదానీ అవినీతిని మోదీ ఎందుకు ప్రశ్నించడం లేదని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. అదానీపై వచ్చిన ఆరోపణలు, మణిపూర్ అల్లర్ల అంశంపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ అఖిలభారత కాంగ్రెస్ కమిటీ (ఎఐసిసి) ఇచ్చిన పిలుపు మేరకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి)బుధవారం హైదరాబాద్‌లో ఛలో రాజ్‌భవన్ కార్యక్రమాన్ని నిర్వహించింది. కాంగ్రెస్ నాయకులు, శ్రేణులు నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం నుంచి రాజ్‌భవన్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఇందులో భాగంగా సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్, టిపిసిసి ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, మంత్రులు పొన్నం ప్రభాకర్ మంత్రులు దామోదర్ రాజనర్సింహ్మ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారులు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాజ్‌భవన్ సమీపంలో రోడ్డుపై బైఠాయించి కేంద్ర ప్రభుత్వ వైఖరిపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ భారత వ్యాపార సంస్థలు అవినీతిలో కూరుకుపోయాయని విమర్శించారు. అదానీ సంస్థలు అమెరికాలో లంచాలు ఇవ్వజూపాయని, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఎఫ్‌బిఐ నివేదించడంతో అమెరికా ప్రభుత్వం చర్యలకు పూనుకుందని చెప్పారు. అదాని అవినీతిపై చర్చించేందుకు, జెపిసి వేసేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకు రావడంలేదని, అదానీపై విచారణ జరిపిస్తే ఆయన జైలుకు వెళ్లడం ఖాయమని రేవంత్‌రెడ్డి అన్నారు. అరెస్టుల నుంచి తప్పించుకోవడానికి బిజెపి, బిఆర్‌ఎస్ నేతలు లొంగిపోయారని, అందుకే అదానీకి వ్యతిరేకంగా మాట్లాడటం లేదని విమర్శించారు. అదానీ అవినీతిపై జెపిసి ఏర్పాటు చేయాలని లోక్‌సభలో ఏకగ్రీవ తీర్మానం చేయాలని రేవంత్‌రెడ్డి అన్నారు.

**దేశ ప్రజల కోసమే నిరసన దీక్ష**

దేశ సంపదను, ఆర్థిక సంస్థలను తరువాయి 6లో

# ఇక భూ భారతి

## ధరణిని బంగాళాఖాతంలో కలిపేశాం



నాలుగు గోడల మధ్య కూర్చొని పోర్టల్ తెచ్చారు

వేలాది పుస్తకాలు చదివిన మేధావి తెచ్చిన ఆర్ఒఆర్ చట్టంతో రైతులకు లక్షలాది సమస్యలు

శాసనసభలో 2024 తెలంగాణ భూ భారతి బిల్లును ప్రవేశపెట్టిన రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి

## భూములకు భూధార్ కార్డులు

ప్రతి వ్యక్తికి ఆధార్ ఏవిధంగా ఉందో అలాగే భూములున్న ప్రతి రైతుకు 'భూధార్' కార్డులు అందిస్తాం, ఒక కోడ్ కేటాయిస్తాం, దానిని స్కాన్ చేస్తే భూమికి సంబంధించిన సమగ్ర సమాచారం అందుబాటులోకి వస్తుంది. భూ భారతి చట్టంలో భూధార్ అంశాన్ని చేర్చాం గతంలో ప్రతి గ్రామంలో జమాబందీ జరిగేది, 23 వేల మంది విఆర్‌ఓలు ఉండేవారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఒక్క కలం పోటుతో విఆర్‌ఒ వ్యవస్థను రూపుమాపింది. దీంతో రెవెన్యూ వ్యవస్థ కుప్పకూలింది. ఏటా జమాబందీ చేపట్టే అంశాన్ని కొత్త చట్టంలో పొందుపరిచాం. ల్యాండ్ ట్రైబ్యునల్ పునర్నిర్మాణంపై కొత్త చట్టంలో ఉంది. సిసిఎల్‌ఏ ద్వారా ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణపై చట్టంలో పొందుపర్చాం.

– మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలో సామాన్యుల భూహక్కుల పరిరక్షణే ధ్యేయంగా ''2024 తెలంగాణ భూ భారతి'' (భూమి హక్కుల రికార్డు)ని రూపొందించినట్లు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. అందరికీ ఆమోదయోగ్యంగా తీసుకువస్తున్న 'భూ భారతి చట్టం' కనీసం వందేళ్ళు వర్ధిల్లుతుందని ఈ ప్రభుత్వం బలంగా నమ్ముతున్నదని మంత్రి చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ధరణి పోర్టల్ రద్దు చేస్తున్నామని, దానిని బంగాళాఖాతంలో వేస్తామంటే ప్రజలు కాంగ్రెస్‌ను ఆశీర్వదించారని మంత్రి తెలిపారు. శాసనసభలో బుధవారం ''2024 తెలంగాణ భూ భారతి'' (భూమి హక్కుల రికార్డు) బిల్లును మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రవేశపెట్టారు. ప్రభుత్వం తీసుకువచ్చిన తెలంగాణ భూ భారతి బిల్లు ఉద్దేశాన్ని మంత్రి సభకు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ 'ఈరోజు చరిత్రాత్మక, రాష్ట్ర ప్రగతికి బాటలు వేసే రోజు. భూమి పేదరికాన్ని దూరం చేసి ఆత్మగౌరవంతో జీవించేలా చేస్తుంది. గ్రామాల్లో భూమి ప్రధాన జీవనాధారం' అని అన్నారు. కష్టజీవులను కంటికి రెప్పలా చూసుకునే బాధ్యత ప్రభుత్వాలదన్నారు. కానీ గత ప్రభుత్వం ఈ బాధ్యతను విస్మరించిందని విమర్శించారు. 1971లో తెచ్చిన ఆర్ఓఆర్ చట్టం 49 ఏళ్ల పాటు మనుగడలో ఉందని చెప్పారు. కాంగ్రెస్ అంటేనే ప్రజలకు భద్రత, భరోసా అన్నారు. ఇందిరమ్మను ఇప్పటికీ ప్రజలు గుండెల్లో పెట్టుకుని చూస్తున్నారని తెలిపారు. నాలుగు గోడల మధ్య కూర్చుని ధరణి పోర్టల్ తెచ్చారని, వేల పుస్తకాలు చదివిన మేధావి తెచ్చిన 2020 ఆర్ఓఆర్ చట్టంతో ప్రజలకు, తరువాయి 6లో



## విద్యారంగ పరిరక్షణకు ప్రతి జిల్లాకూ ఓ ఐఎఎస్

బడ్జెట్‌లో 12శాతం నిధులు కేటాయించాలి

ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, కార్యక్రమాలు, నిర్ణయాలు అమలుజరిగేలా చూడాలి

శాసనసభలో ప్రభుత్వానికి కూనంనేని సాంబశివరావు సూచన

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 12 శాతం నిధులను కేటాయించాలని, మంత్రుల నుంచి ఉన్నతాధికారులు, ఉపాధ్యాయులలో అంకితభావం, జవాబుదారీతనం పెరగాలని సిపిఐ శాసనసభాపక్ష నేత కూనంనేని సాంబశివరావు రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. ఐఎఎస్‌లకు అనేక బాధ్యతలు ఉంటాయని, కేవలం విద్యారంగాన్ని పర్యవేక్షించేందుకు ప్రతీ జిల్లాకు ఒక ఐఎఎస్ అధికారిని నియమించాలని, టీచర్లకు ఇబ్బందులు లేకుండా చూడాలని, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, చేపడుతున్న తరువాయి 6లో

# షా క్షమాపణ చెప్పాలి

అంబేద్కర్‌ను అవమానించడం సిగ్గు సిగ్గు

కేంద్ర హోంమంత్రి రాజీనామా చేయాలని పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రతిపక్షసభ్యుల డిమాండ్

అంబేద్కర్ వ్యతిరేక వ్యాఖ్యలపై గందరగోళం

ప్రతిపక్షాల నినాదాల మధ్య సభలు వాయిదా



**న్యూఢిల్లీ :** అంబేద్కర్‌కు వ్యతిరేకంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజ్యసభలో చేసిన వ్యాఖ్యలపై చెలరేగిన దుమారం మధ్య బుధవారం నాడు లోక్‌సభ కార్యకలాపాలు వాయిదాపడ్డాయి. అమిత్ షా వెంటనే క్షమాపణ చెప్పాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. అంబేద్కర్‌ను అమిత్ షా అవమానించారని తప్పుపట్టాయి. గందరగోళం కారణంగా మొదట మధ్నాహం రెండు గంటల వరకూ సభ వాయిదా పడింది. తిరిగి రెండు గంటలకు సమావేశమైన తర్వాత కూడా ప్రతిపక్షాల నిరసనలు కొనసాగాయి. ప్రతిపక్షాల గందరగోళంమధ్య మంత్రులు, ఎంపిలు పార్లమెంటులో రికార్డయిన అమిత్ షా ప్రసంగ పత్రాలను సభలో ప్రవేశపెట్టారు. ఆ సమయంలో స్పీకర్ హోదాలో పిసి.మోహన్ ఉన్నారు. తర్వాత కూడా గందరగోళం కొనసాగడంతో బుధవారంనాటికి సభాకార్యకలాపాలు ఇక ముగిశాయని ఆయన ప్రకటించి సభను వాయిదా వేశారు. సభను వాయిదావేస్తున్నట్లు ప్రకటన చేసే సమయంలో టిఎంసి మినహా చాలామంది ప్రతిపక్ష సభ్యులు లేచి నిలబడి పెద్ద పెట్టున ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రతిపక్ష ఎంపిలు ''జై భీమ్'' అంటూ నినాదాలు చేశారు. ఆ సమయంలో అనేకమంది కాంగ్రెస్‌పార్టీ ఎంపీలు సభ మధ్యలోకి దూసుకు వచ్చి నినాదాలు చేశారు. తొలుత కాంగ్రెస్ సభ్యులు సభ మధ్యలోకి దూసుకువచ్చారు. అంబేద్కర్ పోస్టర్లను ప్రదర్శించారు. అమిత్ షా రాజీనామా చేయాలని కోరారు. ''ఇండియా'' కూటమి ఎంపీలు ఎక్కువమంది సభ మధ్యకు తరువాయి 12లో

## పడవను ఢీకొన్న బోటు

ముగ్గురు నావికులుసహా 13 మంది మృతి

101మంది టూరిస్టులను కాపాడిన సిబ్బంది



**ముంబయి :** ముంబయి తీరంలో బుధవారం సాయంత్రం ఘోర ప్రమాదం జరిగింది. నావికాదళానికి చెందిన స్పీడు బోటు వేగంగా ప్రయాణిస్తూ అదుపుతప్పి ఒక పర్యాటకుల పడవను ఢీకొట్టింది. ఈ ఘటనలో పడవ తునాతునకలైంది. ప్రమాదంలో ముగ్గురు నావికాదళ సిబ్బందితోపాటు మరో పదిమంది సాధారణ పౌరులు మరణించారు. పడవలో ప్రయాణిస్తున్న 99 మంది ప్రాణాలతో బయటపడ్డారు. జాడతెలియకుండా పోయినవారికోసం నాలుగు హెలికాప్టర్లతో గాలింపు చర్యలు తరువాయి 6లో

## పెనుగొండ లక్ష్మీ నారాయణకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు



**గుంటూరు :** ప్రముఖ రచయిత అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీ నారాయణకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వరించింది. 'దీపిక అభ్యుదయ వ్యాస సంపుటి'కి గానూ కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చింది. పెనుగొండ లక్ష్మీ నారాయణ గుంటూరులో న్యాయవాదిగా పని చేస్తున్నారు. 1972 నుంచి అభ్యుదయ రచయితల సంఘం తరువాయి 6లో





ఫోకస్

# కళారంగం

## ఒకే ఒక్క ఫొటోతో..

ఎంతో మంది కొన్ని సంవత్సరాలు... దశాబ్దాలు కష్టపడినా దక్కని గుర్తింపు అతి కొద్దిమందికి హఠాత్తుగా లభిస్తుంది. అలాంటి అరుదైన వారిలో 'సెలబ్రిటీ కిడ్ ' జాక్ పేరు తప్పక చేరుతుంది. అమెరికాలోని యూనివర్శిటీ ఆఫ్ ఇలినాయిస్‌లో విద్యార్థి అదూఫా ప్రాక్టికల్స్ కోసం 2015లో ఘనా వెళ్లాడు. అక్కడ కళారూపాలను అధ్యయనం చేశాడు. ఆ సమయంలోనే అక్కడి ఒక ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు చిత్ర లేఖం పట్ల ఆసక్తిని పెంచే కార్యక్రమాన్ని చేపట్టాడు. డ్రాయింగ్ క్లాసులు జరిగే సమయంలో అదూఫా స్నేహితుడు కరోల్స్ కొర్సెస్ కూడా కొన్ని ఫొటోలు తీశాడు. ఘనాలో అధ్యయనం పూర్తయిన తర్వాత అదూఫా తిరిగి అమెరికా వెళ్లాడు.



ఘనాలో తాను తీసిన వందలాది ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. వాటిలో, ఘనా ప్రైమరీ స్కూల్‌లో తీసిన జాక్ ఫొటో ఒకటి. రంగు పెన్సిళ్లు తీసుకుంటున్నప్పుడు... డ్రాయింగ్ వేసే సమయంలో జాక్ సీరియస్ ముఖం ఎంతోమందిని ఆకట్టుకుంది. కొన్ని గంటల్లోనే లక్షలాది మంది ఆ ఫొటోను చూసి, లైక్ చేశారు. 'అద్భుతం' అంటూ కామెంట్లు కూడా పెట్టారు. దీనితో, హఠాత్తుగా జాక్‌కు స్టార్‌డమ్ వచ్చేసింది. జాక్ చదువుతున్న పాఠశాలలో ఎక్కువ మంది పేదలే ఉన్నారని, వారికి సాయం చేసేందుకు ముందుకు రావాలని అదూఫా ఇచ్చిన పిలుపులకు వేలాది మంది సానుకూలంగా స్పందించారు. మొదటి రెండు గంటల్లోనే 2000 డాలర్లు విరాళాలు రూపంలో వచ్చాయి. జాక్ ఫొటోను చూసి, ప్రపంచ వ్యాప్తంగా ఎంతో మంది ఇచ్చిన విరాళాలు 20,000 డాలర్లకు చేరుకున్నాయి. ఆ మొత్తాన్ని ఆ స్కూల్‌కు ఇచ్చిన అదూఫా తన నిజాయితీని నిరూపించుకున్నాడు. ఈ ఘనతకు కారణమైన బాలుడు జాక్‌కు మాత్రం తాను సెలబ్రిటీ కిడ్‌గా మారిన విషయం తెలియదు. చిత్రకళలో అతను ఉన్నత శిఖరాలు అధిరోహిస్తాడని ఆశిద్దాం.

## సంగీతమే అతని ప్రపంచం



జొహన్నెస్ బ్రహ్మాస్... 1833 మే 7న, హాంబర్గ్ (జర్మనీ)లోని ఒక సంగీత కుటుంబంలో జన్మించిన ఈ మహా సంగీతకారుడు 1897 ఏప్రిల్ 8న తన తుదిశ్వాస విడిచే వరకూ సంగీతమే లోకంగా జీవించాడు. అతని తండ్రి హాంబర్గ్ ఫిల్హార్మోనిక్‌లో డబుల్ బాసిస్ట్‌గా ఉండేవాడు. ఆ కారణంగానే బ్రహ్మాస్‌కు చిన్నతనం నుంచే సింఫనీ పట్ల ఆసక్తి పెరిగి ఉండవచ్చు. ఏడేళ్ల వయసులో ఎఫ్‌డబ్ల్యు కాసిల్ వద్ద పియానో పాఠాలు నేర్చుకోవడం ప్రారంభించాడు. జనాదరణ పొందిన సంగీత పోకడల నుంచి కొంత దూరంగా ఉండడం వల్ల అతనికి చోపిన్ లేదా లిజ్ట్ రచనల గురించిన అవగాహన లేకపోయింది. అయితే, ఈ లక్షణమే అతనిని సరికొత్త విధానాలను అవలంభించడానికి మార్గం చూపింది. మిగతా స్వరకర్తలు ఒక మూస విధానాన్ని అనుసరిస్తే, బ్రహ్మాస్ మాత్రం తనదైన శైలిలో కొత్త ఒరవడి సృష్టించాడు. కెరీర్ ప్రారంభంలో సంగీత విభావరులు నిర్వహిస్తూ, సంగీత కార్యక్రమాలకు హాజరైన బ్రహ్మాస్ 1846లో, కాసెల్ ప్రోత్సాహంతో, సంగీత దర్శకుడిగా మారాడు. సంగీత ప్రదర్శనల కంటే కొత్త రాగాలను సృష్టించడమే ఉత్తమమని నిర్ణయానికి వచ్చాడు. హాంబర్గ్‌కు చెందిన సుప్రసిద్ధ పియానిస్టు, స్వరకర్త ఎడ్వర్డ్ మార్క్‌సెన్‌తో కలిసి కొంత కాలం స్వరరచనలపై అధ్యయనం చేశాడు. 1853 సెప్టెంబర్ 30న, రాబర్ట్ షూమన్, క్లారా షూమన్ దంపతులను వారి ఇంట్లో కలుసుకున్నాడు. ఆ సమావేశం అతని జీవితాన్ని మార్చేసింది. వారిని ఆత్మీయులుగా భావించాడు. సంగీత దర్శకత్వంలో కొత్తకొత్త ప్రయోగాలు చేశాడు. 1856లో రాబర్ట్ మృతి చెదడంతో, ఒంటరిగా మిగిలిపోయిన క్లారా పట్ల ఆదరపూర్వకంగా వ్యవహరించాడు. వీరిద్దరి మధ్య బలమైన స్నేహం, సాన్నిహిత్యం ఏర్పడింది. జీవితకాలంలో ఎన్నడూ సాహిత్యం, సంగీతం విషయంలో బ్రహ్మాస్ రాజీ పడలేదు. చాలా వరకూ తాను రాసుకున్న పాటలనే స్వరపరచుకొని, ప్రదర్శనలకు వెళ్లేవాడు. ఒక్కోసారి తాను రాసిన గీతాలు తనకే నచ్చకపోవడంతో, తన పేరును ఉపయోగించేవాడుకాదు. ఇది అతని అలవాటుగా కాకుండా, సంగీతం పట్ల అతనికి ఉన్న నిబద్ధతగా చూడాలి. గీత రచన బాగా ఉన్నప్పుడే గొప్ప సంగీతం పుడుతుందని నమ్మిన బ్రహ్మాస్, చివరి క్షణం వరకూ అదే సిద్ధాంతానికి కట్టుబడ్డాడు. జర్మన్ సంగీత ప్రపంచంలో తనకంటూ ఒక అధ్యాయాన్ని సృష్టించుకున్నాడు.




## నాగరికత అవశేషాలు..

ఒకప్పుడు ప్రపంచ మేటి నాగరికతలు వివిధ కారణాల వల్ల కనుమరుగయ్యాయి. పురాతత్వ శాఖ తవ్వకాల్లో కొన్ని అవశేషాలు బయట పడుతున్నాయి. ఆనాటి నాగరికత వివరాలను మనకు అందించే ప్రయత్నాలు చేస్తున్నాయి. వాటిలోనే హరప్పా నాగరికత ఒకటి. హరప్పా ప్రస్తుతం పాకిస్తాన్‌లోని పంజాబ్ ప్రావీన్స్‌లో ఉంది. మొహంజదారో కూడా పాకిస్తాన్‌లోనే సింధ్ ప్రాంతంలో ఉంది. ఈ రెండు పట్టణాలు తవ్వకాల్లో వెలుగు చూశాయి. ఈ నాగరికతకు సంబంధించిన ధధోవీ గుజరాత్‌లోని కచ్ జిల్లాలో, కాళీబంగన్ రాజస్థాన్‌లో, లోథాల్ గుజరాత్‌లో, రాఖీగర్హి హర్యానాలో, చన్హుదారో పాకిస్తాన్‌లోని సింధ్‌లో, గన్వేరియావా పాకిస్తాన్‌లోని పంజాబ్‌లో సుత్క గెండర్ పాకిస్తాన్‌లోని బలూచిస్థాన్‌లో, అలంగీర్‌పూర్ ఉత్తర ప్రదేశ్‌లో ఉన్నాయి. దండయాత్రలు.. యుద్ధాలు... వాతావరణ మార్పులు.. నదీ ప్రవాహాలు వంటి అనేక కారణాలతో నాటి మొహంజదారో హరప్పా నాగరికత కాలగర్భంలో కలిసిపోయింది. సుమారుగా వందేళ్లుగా అనేక మంది టౌన్‌ప్లానర్లు, ఎపిగ్రాఫిస్టులు, మెటలర్జిస్టులు, ఖగోళ శాస్త్రవేత్తలు ఈ ప్రాంతాలను పరిశీలిస్తునే ఉన్నారు. పరిశోధిస్తునే ఉన్నారు. కొన్ని విషయాలను సిద్ధాంకరిస్తే, ఎన్నో అంశాలపై చిక్కుముడులు ఇంకా వీడనే లేదు. అయితే, ఆ రోజుల్లోనే అద్భుత నాగరికత విరాజిల్లిన ఆనవాళ్లు అందరినీ దిగ్భ్రాంతికి గురి చేస్తున్నాయి. తమ లోతును కనుక్కోమని సవాళ్లు విసురుతున్నాయి.




## ఈ మట్టి పలక ఎప్పటిదో?


ఈ చిత్రంలో కనిపిస్తున్న మట్టిపలకపై ఉన్న చిహ్నాలను, అక్షరాల వంటి ఆకృతులను గుర్తించడానికి పరిశోధకులు శ్రమిస్తునే ఉన్నారు. ఇరాక్‌లోని నినెవెహ్లోలో, అషుర్బానిపాల్ (క్రీస్తుపూర్వం 650 ప్రాంతం) గూర్భ లైబ్రరీలో, సుమారు 150 సంవత్సరాల క్రితం లభ్యమైంది. అప్పటి నుంచి దీని రహస్యాన్ని ఛేదించడానికి శాస్త్రవేత్తలు ప్రయత్నిస్తున్నా, ఇప్పటికీ అంతుచిక్కడం లేదు. ఇది 'కోఫిల్ ప్రభావిత ఘటన'గా పేర్కొనే కాలానికి చెందినదని కొందరి అభిప్రాయం. కొందరి పరిశోధకులు దీనిని అస్సిరియన్ టాబ్లెట్‌గా పరిగణిస్తున్నారు. కంప్యూటర్ విశ్లేషణ ఇది క్రీస్తు పూర్వం 3300 కాలం నాటి, మెసపొటేమియా కాలానికి చెందినదని చెప్తున్నది. అత్యంత పురాతమైన సుమేరియన్ మూలానికి చెందినది కావచ్చని అభిప్రాయపడింది. ఈ టాబ్లెట్‌కు 'ఆస్ట్రోలాబ్' అని పేరు పెట్టారు. ఇప్పటి వరకూ బయటపడిన అత్యంత పురాతనమైన ఖగోళ సంబంధిత సమాచారం ఇదే. దీని అంచుపై చెక్కిన కోణం కొలత గుర్తించిన బడిన యూనిట్లతో విభజించి ఉండడం విశేషం. డిస్క్ ఆకారపు నక్షత్ర చార్టు ఇందులో దర్శనమిస్తున్నది. మొత్తం మీద 5,500 సంవత్సరాల నాటి పురాతన మట్టి పలక లేదా టాబ్లెట్ ఇప్పుడు పరిశోధకుల్లో ఆసక్తి రేపుతున్నది. దీనిపై ఉన్న సమాచారం ఖగోళ శాస్త్రానికి సంబంధించినదన్న ప్రాథమిక అంచనాకు అంతా వచ్చారు. కానీ, వివరాలు మాత్రం ఎంత ప్రయత్నించినా తెలియడం లేదు. దీని రహస్యం బయటపడితే, శతాబ్దాల నాటి చరిత్ర, ఖగోళ శాస్త్ర వివరాలు, గొప్పతనం మనకు తెలుస్తాయి. అప్పటి వరకూ అంతా సస్పెన్స్.



## కళారంగంలో విప్లవాత్మక మార్పులు

ఇటీవల కాలంలో, కళారంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకోవటం ఆహ్వానించతగ్గ పరిణామం. ప్రత్యేకించి ప్రదర్శన కళలు లేదా రంగస్థల కళల్లో కొత్త పోకడలను అన్వేషిస్తున్నారు. ప్రత్యక్ష ప్రదర్శనల అనుభవాన్ని ప్రేక్షకులకు కలిగించేందుకు విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతున్నారు. ఒక ప్రదర్శనలో ప్రేక్షకులను సైతం భాగస్వాములను చేసే ప్రయత్నాలు ఎక్కువయ్యాయి. వారు ప్రదర్శనతో మమేకమైతే, ఆ ప్రదర్శన మరింత రక్తి కడుతుంది. అందుకే, ప్రేక్షకులను ప్రదర్శనల్లో నిమగ్నం చేయడానికి, మరింత విస్తృతమైన అనుభూతిని కలిగించడానికి వర్చువల్ రియాలిటీ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటున్నారు. వర్చువల్ రియాలిటీ, ఆగ్మెంటెడ్ రియాలిటీ, ప్రేక్షకులు లేదా పాఠకులు లీనమైపోయేలా కథను చెప్పడం.. ఆకట్టుకునే కథనాన్ని అనుసరించడం వంటి ఎన్నో మార్గాలను కళాకారులు అనుసరిస్తున్నారు. ఇలాంటి ప్రయోగాలు గతంలో జరగలేదని అనలేం. అయితే, పూర్తిస్థాయిలో ప్రయత్నాలు జరగలేదన్నది వాస్తవం. అంతేగాక, సాంకేతిక పరిజ్ఞానం కూడా ఇప్పటి మాదిరి అభివృద్ధి చెందలేదు. అందుకే, ఒక దృశ్యాన్ని వాస్తవమనే రీతిలో ప్రేక్షకులు అనుభూతి చెందే విధంగా సెట్టింగ్‌లు వేయడం కష్టమయ్యేది. ఇప్పుడు అలాంటి సమస్య లేదు. రంగస్థలంపైనే లేనిది ఉన్నట్టు చూపించే అవకాశాలు, విధానాలు ఉన్నాయి. దీనికితోడు డిజిటల్ టికెటింగ్, స్ట్రీమింగ్ వంటి సౌకర్యాలు కళాకారులకు ఎంతోకొంత మేలు చేస్తున్నాయి. తనకు నచ్చిన తేదీల్లో ప్రదర్శనలను తిలకించేందుకు వీలుగా టికెట్లు ముందుగానే బుక్ చేసుకునే వీలు ఉంది కాబట్టి, ప్రేక్షకుడు ఇబ్బంది పడడు. అంతేగాక, విస్తృత స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకునే అవకాశం కూడా ఏర్పడుతున్నది. తద్వారా ఆదాయం పెరుగుతుంది. పతనమవుతున్న నాటకం, రూపకం వంటి ఎన్నో కళలకు ఒక స్థిరత్వాన్ని కల్పిస్తుంది. ఇటీవల కాలంలో కొన్ని థియేటర్లు పర్యావరణ అనుకూలతపై దృష్టి సారిస్తున్నాయి. పర్యావరణానికి అనుకూలంగా ఉండే వేదికల రూపకల్పన, శక్తివంతమైన... సమర్థవంతమైన లైటింగ్, సౌండ్ సిస్టమ్స్‌ను వినియోగిస్తున్నాయి. డిజిటల్ ప్రోగ్రామ్స్ కూడా ఇప్పుడు ఎన్నో కళానిలయాలు, వేదికలకు అంబాటులో ఉన్నాయి.





ఆడియో వివరణలు, సంకేత భాషా వివరణలు సాధ్యమవుతున్నాయి. కాబట్టి వివిధ భాషా ప్రదర్శనలను ప్రేక్షకుడు అర్థం చేసుకోగలుగుతున్నాడు. ఎస్‌డి ప్రొజెక్షన్ మ్యాపింగ్, ఎల్ఇడి లైటింగ్, డిజిటల్ సౌండ్ డిజైన్‌తోసహా ప్రదర్శనలను పెరుగుపరచడానికి థియేటర్లు సాంకేతికతను వినియోగించుకుంటున్నాయి. నాటకాల ప్రదర్శనలు జరిగే వేదిక లేదా థియేటర్ గురించి, సమయాల గురించి ప్రచారం చేయడం గతంలో ఎంతో కష్టంగా ఉండేది. ఇప్పుడు సోషల్ మీడియా పుణ్యాన అలాంటి సమాచారం చాలా త్వరగా, సమర్థవంతంగా ప్రజల్లోకి వెళ్లిపోతున్నది. నాటక రంగం కళావిహీనమైందే తప్ప, పూర్తిగా పతనం కాలేదనడానికి ఇటీవల పెరుగుతున్న ఆదరణనే నిదర్శనం. నాటకాలతోపాటు, సంగీత విభావరులకు కూడా ప్రేక్షకులు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నారు. మొత్తం మీద పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ రూపురేఖలు వేగంగా మారుతున్నాయి. ఈ మార్పు సానుకూల వాతావరణాన్ని సృష్టిస్తున్నది కాబట్టి, ఆహ్వానం పలకాలి.

## వలిగొండ మోడల్ స్కూల్ ఘటనపై నిజనిర్ధారణ కమిటీ

ఎఐఎస్ఎఫ్ డిమాండ్



**ప్రజాపక్షం/వలిగొండ :** వలిగొండ మండలం లోతూకుంట ఆదర్శ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థునులను ప్రిన్సిపల్ కొట్టడంతో ఇద్దరు విద్యార్థులకు గాయాలయ్యాయి. బుధవారం పాఠశాలను ఎఐఎస్ఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి ఉప్పుల శాంతికుమార్ సందర్శించారు వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాగిజావ తాగే సమయంలో ఇంకా ఎంతసేపు తాగుతారని విద్యార్థుల పట్ల ప్రిన్సిపల్ కిరాతకంగా ప్రవర్తించి చేతులపై కొట్టడంతో విద్యార్థులకు చేతులు విరగడం జరిగిందని, ఘటనకు కారణమైన వారిపై నిజ నిర్ధారణ కమిటీ వేసి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లా విద్యాధికారితో ఫోన్‌లో మాట్లాడితే ఘటన సంబంధించి ఆదర్శ పాఠశాల డైరెక్టర్‌కు పంపించమని చెప్పారని ఆయన తెలిపారు. కలెక్టర్ పాఠశాలను సందర్శించి ఘటనపై చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులకు పూర్తిగా నయం అయ్యేవరకు ప్రభుత్వమే చికిత్స అందించాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంక్షేమ హాస్టళ్లపై ఆదర్శ పాఠశాలలు, గురుకుల పాఠశాలలపై నిరంతరం జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారుల పర్యవేక్షణ జరగాలన్నారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా నాయకులు సాయి కుమార్, బూడిద సాయి చరణ్, వంశి పాల్గొన్నారు.

## కార్మిక సంఘాల నేతలపై అక్రమ కేసు కొట్టివేత



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలు నిరసిస్తూ 2020 సంవత్సరంలో దేశవ్యాప్త కార్మిక సంఘాల సార్వత్రిక సమ్మెలో భాగంగా ఎఐటియుసి, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగిన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని మున్సిపల్ టౌన్ హాల్ నుండి తెలంగాణ చౌరస్తా వరకు కార్మిక ర్యాలీ ఆందోళన నేపథ్యంలో ప్రభుత్వాలు కక్షపూరితకంగా కార్మిక సంఘాల నేతలపై అక్రమ కేసులు బనాయించారు. ఈ కేసుపై సిపిఐ నేత ప్రముఖ న్యాయవాది బి.పరమేశ్ గౌడ్ నేతృత్వంలో దాదాపు నాలుగు సంవత్సరాలు కోర్టులో వాదనలు వినిపించారు. బి.పరమేశ్వర్ గౌడ్ కార్మిక హక్కుల కోసం, తాడిత పిడిత ప్రజల బాగుకై నిరంతరం పోరాటలు సాగించే కార్మిక సంఘాల నేతల పక్షాన బలంగా వాదనలు వినిపించారు. ఈ నేపథ్యంలో ఈ కేసును జిల్లా కేంద్రంలోని మూడవ అదనపు ప్రథమ శ్రేణి కోర్టు గౌరవ న్యాయమూర్తి కేసు పూర్వపరాలను పరిశీలించి కొట్టివేస్తున్నట్లు ప్రకటించారు. దీవతో కార్మిక సంఘాలు నాయకులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో న్యాయవాది ఆర్‌ఆర్ మన్యం, కార్మిక సంఘాలు నాయకులు కురుమూర్తి, సురేష్, వెంకటేష్, రాములు యాదవ్, సత్యనారాయణరెడ్డి, రామ్మోహన్, చంద్రకాంత్, ఖమర్ ఆలీ, రాజేశ్వర్, విజయవర్ధన్, రాజు, కే రామదాస్, తిరుమలయ్య, ఎర్ర నర్సింహులు, అలీం, సునిత, పాల్గొన్నారు.

# కమ్యూనిస్టుల ఐక్యతతోనే దేశానికి ప్రత్యామ్నాయం

సిపిఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకటరెడ్డి

సిపిఐ 100 వసంతాల ఉత్సవాల కరపత్రం ఆవిష్కరణ

30న నల్లగొండలో జరిగే బహిరంగసభను విజయవంతం చేయాలని పిలుపు



**ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి :** సామ్రాజ్యవాదానికి, భూస్వామ్య పెట్టుబడిదారి విధానానికి వ్యతిరేకంగా 100 సంవత్సరాల కాలంగా అనేక పోరాటాలకు నాయకత్వం వహించి సుదీర్ఘ పోరాట చరిత కలిగిన పార్టీ సిపిఐ అని ఆ పార్టీ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకటరెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని మగ్దూమ్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపిఐ వంద వసంతాల బహిరంగ సభ కరపత్రం ఆవిష్కరించారు. ఈసందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ 1925డిసెంబర్ 26న కన్పూర్‌లో భారత కమ్యూనిస్టు పార్టీగా ఆవిర్భావించి దేశంలో కష్టజీవుల పక్షాన కార్మిక, రైతాంగ, మహిళా, విద్యార్థి, యువజన హక్కుల కోసం నిరంతరం పోరాట నిర్వహిస్తూ ఆర్థిక అసమానతలు లేని సోషలిస్టు సమాజం కోసం అనేక త్యాగాలతో నిర్మితమైన పార్టీ సిపిఐ అన్నారు. కమ్యూనిస్టు పార్టీ చీలికతో కమ్యూనిస్టులకు కొంతనష్టం జరిగిన ప్రజల హక్కుల కోసం సమరశీల పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. 100 సంవత్సరాల సందర్భంగా చీలిపోయిన కమ్యూనిస్టులు ఐక్యత అయితే పాలక పార్టీలకు ప్రత్యామ్నాయ పార్టీగా ఉండబోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సిపిఐ 100 వసంతాల బహిరంగసభ నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎన్‌జి కళాశాల మైదానంలో ఈనెల 30న జరుగుతుందని తెలిపారు. బహిరంగకు సిపిఐ జాతీయకార్యదర్శి, మాజీ ఎంపి డి.రాజా, మాజీ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపి సురవరం సుధాకర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతోపాటు రాష్ట్ర, ఉమ్మడి జిల్లా నాయకులు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతంతో పాటు అనేక సంవత్సరాలు సుదీర్ఘకాలంగా ప్రజాఉద్యమాల్లో పాల్గొన్న సీనియర్ కమ్యూనిస్టు నాయకులను సన్మానం చేయడం జరుగుతుందన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ విప్లవాలకు పురిటి గడ్డన నల్లగొండ జిల్లా కేంద్రంలో సిపిఐ 100 వసంతాల బహిరంగ సభ నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. భూమికోసం భుక్తి కోసం వెట్టిచాకుల విముక్తి కోసం మట్టి మనుషుల పోరాట చరిత్ర కల్గిన జిల్లా తెలంగాణ రైతంగా సాయుధ పోరాటం వారసంత్వ ఉన్న నల్లగొండ జిల్లాలో కమ్యూనిస్టు పార్టీకి నూతన ఉత్తేజం నింపే విధంగా బహిరంగ సభ జరగబోతున్నమన్నారు ఇప్పటికే అన్ని ప్రాంతాలనుంచి డిసెంబర్ 30న జరిగే సిపిఐ బహిరంగ సభకు తరలి రావడానికి సిపిఐ శ్రేణులతో పాటు కమ్యూనిస్టు అభిమానులు సిద్ధంగా ఉన్నారన్నారు.

**జమిలి మోదీ నియంతృత్వానికి నిదర్శనం...** దేశంలో జిమ్మికులు చేసే మూడోసారి అధికారంలోకి చేపట్టిన మోదీ ప్రభుత్వం జమిలి ఎన్నికల నిర్వహించాలని పార్లమెంట్లో బిల్లు తీసుకురావడానికి సిపిఐ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకటరెడ్డి అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని ధ్వంసం చేయడం కోసమే ఒకే దేశం ఒకే ఎన్నిక అనే అంశాన్ని తెరమీద తీసుకురావడం జరుగుతుందన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత మతోన్మాద విధానాలను అమలు చేయడమే కాకుండా పలు రాష్ట్రాల్లో పరిపాలన చేస్తున్న బిజెపియేతర ప్రభుత్వాలను పడగొట్టి తమ ప్రభుత్వ ఏర్పరచుకునేందుకు కుట్రలు చేస్తుందన్నారు. ఈ నేపథ్యంలో జమిలి ఎన్నికలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. దేశంలో ఇండియా కూటమిలోని అన్ని పార్టీలతో పాటు సిపిఐ కూడా జమిలి ఎన్నిక బిల్లును వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు. విలేకరుల సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, సీనియర్ నాయకులు మల్లేపల్లి ఆదిరెడ్డి, ఉజ్జిని రత్నాకర్ రావు, జిల్లా సహాయకార్యదర్శి లోడంగి శ్రవణ్ కుమార్, కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి, ఆర్ అంజచారి, బంటు వెంకటేశ్వర్లు, బొల్గురి నర్సింహా, తీర్పారి వెంకటేశ్వర్లు, పట్టణ కార్యదర్శి గాదెపాక రమేష్, కెవిఎస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## నేటితరానికి సిపిఐ చరిత్ర

సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు



**ప్రజాపక్షం/బోనకల్ :** దేశ స్వాతంత్ర ఉద్యమంలో, తాడిత, పీడిత, అణగారినవర్గాల అభ్యున్నతికి, హక్కుల కోసం అనునిత్యం పోరాడిన భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) వందేళ్ల చరిత్రను నేటి యువ తరానికి తెలియజేయాలని పార్టీ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు శ్రేణులకు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బోనకల్, మధిర మండలాల, మధిర పట్టణ కార్యవర్గ సభ్యుల సంయుక్త సమావేశం ఆకెన పవన్, సిలివేరు శ్రీనివాస్‌రావుల అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. సమావేశానికి బాగం హేమంతరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ భారత దేశ స్వాతంత్ర ఉద్యమంలో భారత కమ్యూనిస్టు పార్టీ కీలక భూమిక పోషించదన్నారు. సంపూర్ణ స్వాతంత్రం కోసం పోరాడిన పార్టీ ఒక్క సిపిఐయే అన్నారు. దేశ సమగ్ర కోసం, ఐక్యత కోసం పంజాబ్ జరిగిన వేర్పాటు వాదానికి వ్యతిరేకంగా సిపిఐ పోరాడిందన్నారు. తెలంగాణలో సాయుధ పోరాటంతో ఈ ప్రాంతాన్ని విముక్తి చేసిన ఘనత ఒక్క సిపిఐదేనన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్మృతులు, వీరగాథలు ఉన్నట్లు ఇప్పుడున్న యువతకు తెలియదన్నారు. ప్రతి గ్రామంలో అప్పటి నాయకులు పంచిన భూముల విషయాలు, చేసిన త్యాగాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రస్తుత యువతకు తెలియజెప్పాల్సిన బాధ్యత మనమీదే ఉందన్నారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతూ పార్టీ వందేళ్లలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ప్రతి కార్యకర్త పార్టీ చరిత్రను యువతరానికి తెలిసేలా ప్రచారం చేయాలన్నారు. ఈనెల 26న సర్దార్ పటేల్ స్టేడియం నుండి భక్తకళారామదాసు కళాక్షేత్రం వరకు రెడ్‌షర్ట్ వాలంటీర్లు, వంద జెండాలతో ర్యాలీ ఉంటుందన్నారు. అనంతరం భక్తరామదాసు కళాక్షేత్రంలో జరిగే వంద సంవత్సరాల సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు, బెజవాడ రవిబాబు, ఏనుగు వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శులు యంగల ఆనందరావు, జిల్లా సమితి సభ్యులు పెరుమాళ్లపల్లి ప్రకాశరావు, ఎంఏ రహీం, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మదుపల్లి లక్ష్మణ్, చెరుకూరి వెంకటేశ్వరరావు, అన్నవరపు సత్యనారాయణ, జల్లా బ్రహ్మ, ఎస్‌కె కొండా, నాగకృష్ణచారి, యంగళ పెద్ద రమేష్, బుర్రి నాగేశ్వరావు, బెజవాడ నరేష్, బొడ్డుపల్లి వెంకటేశ్వర్లు, యంగల వెంకటమ్మ, ఏనుగు రవి, వంగాల నరసింహా, వంగాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## యువతకు సామాజిక స్పృహ అవసరం

డాక్టర్ మార్క శంకర్‌నారాయణ

సిపిఐ జిల్లా కార్యాలయంలో రాజకీయ విజ్ఞాన శిక్షణా తరగతులు ప్రారంభం



**ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి :** యువత సామాజిక స్పృహను పెంపొందించుకోవాలని రిటైర్డ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.శంకర్‌నారాయణ అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని సిపిఐ కార్యాలయంలో పార్టీ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి అధ్యక్షతన ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సామాజిక స్పృహ శాస్త్రీయ దృక్పథం అనే అంశంపై ఏర్పరిచిన రాజకీయ విజ్ఞాన శిక్షణా తరగతులు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భాంగా శంకర్ నారాయణ మాట్లాడుతూ సమాజంలో రోజురోజుకు సామాజిక స్పృహ కొరవడుతున్నదన్నారు. స్వాతంత్రం వచ్చి డెబ్బై ఐదు ఏళ్ళు గడిచినా ఈదేశం కులతత్వం, మతత్వం కోరల్లో చిక్కుకొని విలవిలలాడుతున్న ఈవేళ, అధికారులు, పాలకులు అవినీతి కూపంలో పీకల లోతు దాకా ఇరుక్కొని దేశాన్ని అధోగతి పట్టిస్తున్న ఈ సమయంలో, స్వాతంత్రోద్యమంలో పైసా వంతు పాత్రలేని మనువాద ఫాసిస్ట్ పాలకుల చేతుల్లో దేశభక్తి నామ కీర్తనలో దేశమే అంగడి సరుకుగా మారుతున్న ఈ వేళ, మూఢనమ్మకాలతో, అశాస్త్రీయ భావాలతో దేశం ఆగమవుతున్న ఈవేళ, సమాజంలో చదువుకున్న వాళ్లలో సైతం సామాజిక స్పృహ శాస్త్రీయ దృక్పథం కరువవుతున్నదని ఆవేదన చెందారు. సామాజిక స్పృహ అంటే సమాజం పురోగమన దిశలో ఉండాలని కోరుకోవడమన్నారు. సామాజిక స్పృహతోనే సమాజంలో శ్రమదోపిడీ జరుగుతున్నదనే సత్యాన్ని వెలికితీసి తన పెట్టుబడి గ్రంథం ద్వారా ప్రపంచానికి తెలియజెప్పి దానికి పరిష్కారాన్ని చూపిన మార్క్సిజం సిద్ధాంత కర్త కార్ల్ మార్క్స్ మతం గురించి మాట్లాడుతూ భ్రమల్లో మునిగే ప్రజల ఆనందమే మతమని, మతం మత్తుమందు అన్నారన్నారు. ప్రజాకవి కాళోజీ సామాజిక స్పృహతోనే ఆకలి మంటలు ఒక చోట అన్నపు రాసులు ఒక చోటని అన్నారని వారు గుర్తు చేశారు. శవాలు గంగానదిలో తేలినా, నిరుద్యోగం విలయతాండవం చేసినా నిత్యవసర ధరలు నింగిని తాకినా, ప్రభుత్వరంగ సంస్థలు ప్రైవేటుకు కరుచవుకగా అమ్మినా యువతలో తెలుసుకోవాలనే సోయి తగ్గిపోతుందని, ఇది దేశానికి ప్రమాదకరమని వారు ఆవేదన చెందారు. చర్చలో మునగాల బిక్షపతి, అశోక్, వెంకట్రాజం, సారంగపాణి, సంపూర్ణ, రాములు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రభుత్వము
రెవెన్యూ భూసేకరణ) శాఖ
ఫారం-VI
(ప్రాథమిక నోటిఫికేషన్)

(భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం, 2013, కేంద్ర చట్టం 30/2013) యొక్క సెక్షన్ 11(1) మరియు రూలు 19 సబ్ రూలు (1) ను అనుసరించి

కలెక్టర్ గారి కార్యాలయం ఫైల్ నం. G3/2328/2024 తేది: 10/12/2024
రెవెన్యూ డివిజనల్ అధికారి, హుస్నాబాద్ ఫైల్ నం. D/1544/2024 తేది: 02/12/2024
గెజిట్ నెంబరు: 159/2024 తేది: 10/12/2024

తెలంగాణ ప్రభుత్వం/జిల్లా కలెక్టర్ సిద్దిపేట గారి ఆదేశానుసారం దిగువ నిర్దిష్ట పరిచిన **సిద్దిపేట జిల్లా కోహెడ మండలము మరియు కచాపూర్ గ్రామంలో** ఉన్న భూమి విస్తీర్ణం **ఎకరములు 14.11 గుంటలు** ప్రజా ప్రయోజన నిమిత్తం అనగా **గౌరవెల్లి కెనాల్ ప్రాజెక్ట్ యొక్క గౌరవెల్లి ఎడమ వైపు ప్రధాన కాలువ యొక్క డిస్ట్రీబ్యూటరీలపై తవ్వకం నిమిత్తము** ఈ దిగువ చూపిన భూమి అవసరం అయి ఉన్నదని భావించినందున భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం, 2013 లోని సెక్షన్ 11(1) అనుసరించి ఈ ప్రకటన జారీచేయనైనది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము G.O.Ms.No.41, (LA.R&R/A2) Dept., dt.22.07.2017 ద్వారా నీటిపారుదల మరియు కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ శాఖ వారు 10-A అనుసరించి సోషల్ ఇంపాక్ట్ అస్సేస్మెంట్ మరియు ఆహార భద్రతను మినహాయింపు ఇవ్వనైనది.

కావున **సిద్దిపేట జిల్లా కోహెడ మండలము మరియు కచాపూర్ గ్రామంలో** ఉన్న భూమి విస్తీర్ణం **ఎకరములు 14.11 గుంటలు** గల భూమి యొక్క వివరములు ఈ క్రింద చూపిన వారికి భూసేకరణ పనుల ప్రారంభ నిమిత్తం ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేయనైనది.

షెడ్యూల్

| క్ర. సం. | సర్వే నెం. | [illegible] | [illegible] | పట్టాదారు పేరు & అనుభవదారు పేరు | నిర్మాణాలు (చెట్లు, బోర్లు, బావులు, కట్టడములు మరియు ఇతరములు) |
|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 |
| గ్రామము : కచాపూర్ మండలము : కోహెడ జిల్లా : సిద్దిపేట | | | | | |
| for excavation of Sub Minor 1R - Minor 1R of D6 on Gouravelly Left Side Main Canal from KM 0.217 to KM 1.375 | | | | | |
| 1 | 563 | Dry/Patta | 0.05 | యెల్లబోన మల్లేశం తండ్రి కొమురయ్య | |
| 2 | 444 | Dry/Patta | 0.14 | ప్రభుత్వ భూమి<br>యెల్లబోయిన మల్లేశం తండ్రి కొమ్రయ్య | |
| 3 | 447 | Dry/Patta | 0.04 | ఏలబోయిన సంపత్ తండ్రి బాలయ్య | |
| 4 | 443 | Dry/Patta | 0.08 | ఎల్లబోయిన రాజయ్య తండ్రి వెంకటయ్య<br>ఎరుమల్ల కొమురయ్య తండ్రి బీరయ్య<br>ఎల్లబోయిన వెంకటయ్య<br>కర్రె మల్లయ్య<br>ఎల్లబోయిన మల్లేశం తండ్రి కొమ్రయ్య | |
| 5 | 448 | Dry/Patta | 0.10 | బోడపట్ల కనుకయ్య తండ్రి సిద్దయ్య | |
| 6 | 449 | Dry/Patta | 0.11 | ఎరుమళ్ల శ్రీనివాస్ తండ్రి కొమురయ్య | |
| 7 | 451 | Dry/Patta | 0.16 | భీంరెడ్డి మల్లా రెడ్డి తండ్రి రాఘవ రెడ్డి | |
| 8 | 466 | Dry/Patta | 0.21 | ఎరుమళ్ల శ్రీనివాస్ తండ్రి కొమురయ్య<br>ఎరుమళ్ల లచ్చయ్య తండ్రి చిన్న కొమురయ్య<br>ఎరుమళ్ల వెంకటయ్య తండ్రి కొమురయ్య<br>ఎరుమల రాజయ్య తండ్రి బీరయ్య<br>ఐలేని కళాధర్ రెడ్డి తండ్రి జైపాల్ రెడ్డి<br>భీమరెడ్డి తిరుపతి రెడ్డి తండ్రి మల్లా రెడ్డి | |
| 9 | 465 | Dry/Patta | 0.21 | భీంరెడ్డి మల్లా రెడ్డి తండ్రి వెంకట్ రెడ్డి | |
| 10 | 476 | Dry/Patta | 0.37 | ఇరుమల్ల గట్టయ్య తండ్రి మల్లయ్య<br>భీమరెడ్డి భాస్కర్ రెడ్డి తండ్రి మల్లా రెడ్డి<br>ఇరుమల్ల లక్ష్మి భర్త భూమయ్య<br>భీంరెడ్డి దేవేంద్ర భర్త తిరుపతి రెడ్డి<br>ఇరుమల్ల అనిత భర్త యాదయ్య<br>ఇరుమల్ల లచ్చమ్మ | |
| 11 | 475 | Dry/Patta | 0.13 | పిడిశెట్టి రామక్క భర్త రాజయ్య<br>పిడుశెట్టి రాజయ్య తండ్రి భూమయ్య | |
| 12 | 30 | Dry/ Patta | 0.32 | పిడుశెట్టి రాజయ్య తండ్రి భూమయ్య<br>ఎరుమల్ల కనుకవ్వ భర్త యెల్లయ్య | |
| 13 | 29 | Dry/Patta | 0.20 | చిగిరి మంజుల భర్త సత్తయ్య<br>ఏరుమల్ల యాదయ్య తండ్రి బీరయ్య<br>ఏరుమల్ల బాలయ్య తండ్రి బీరయ్య<br>భీంరెడ్డి రాజి రెడ్డి తండ్రి రామ్ రెడ్డి<br>ఎరుమళ్ల సత్తయ్య తండ్రి బీరయ్య<br>భీంరెడ్డి సురేందర్ రెడ్డి తండ్రి మల్లా రెడ్డి<br>భీంరెడ్డి తిరుపతి రెడ్డి తండ్రి రఘుపతి రెడ్డి<br>ఏరుమల్ల నర్సయ్య తండ్రి లచయ్య<br>భీంరెడ్డి రాజి రెడ్డి తండ్రి వెంకట్ రెడ్డి<br>భీంరెడ్డి లక్ష్మా రెడ్డి తండ్రి జగ్గా రెడ్డి<br>భీంరెడ్డి రామ్ రెడ్డి తండ్రి వెంకట్ రెడ్డి | |
| 14 | 28 | Dry/Patta | 0.38 | భీంరెడ్డి కమలమ్మ భర్త వెంకట్ రెడ్డి<br>భీంరెడ్డి సూర్యప్రకాష్ రెడ్డి తండ్రి వెంకట్ రెడ్డి<br>ఇరుమల్ల కనుకవ్వ భర్త ఎల్లయ్య<br>భీంరెడ్డి మల్లా రెడ్డి తండ్రి చిన్న వెంకట్ రెడ్డి<br>ఇరుమల్ల బీరయ్య తండ్రి ఐలయ్య<br>భీంరెడ్డి వెంకట్ రెడ్డి తండ్రి మల్లా రెడ్డి<br>ఇరుమల్ల సత్తయ్య తండ్రి ఎల్లయ్య | |
| 15 | 27 | Dry/ Patta | 0.10 | భీంరెడ్డి సూర్యప్రకాష్ రెడ్డి తండ్రి వెంకట్ రెడ్డి<br>భీంరెడ్డి వెంకట్ రెడ్డి తండ్రి మల్లా రెడ్డి | |
| 16 | 25 | Dry/Patta | 0.09 | భీంరెడ్డి భారతి తండ్రి తిరుపతి రెడ్డి<br>భీంరెడ్డి సూర్య ప్రకాష్ రెడ్డి తండ్రి వెంకట్ రెడ్డి<br>భీంరెడ్డి జ్యోతి భర్త తిరుపతి రెడ్డి | |
| | | విస్తీర్ణం: | 6.29 | | |
| గ్రామము : కచాపూర్ మండలము : కోహెడ జిల్లా : సిద్దిపేట | | | | | |
| for excavation of D4 on Gouravelly Left Side Main Canal from KM 5.245 to KM 5.775 | | | | | |
| 1 | 255 | Dry/Patta | 2.00 | ఎల్లబోయిన కంకయ్య తండ్రి ఆశయ్య<br>బైరి సుగుణవ్వ భర్త సారయ్య<br>ముత్తి లింగం తండ్రి వీరయ్య<br>ఎల్లబోయిన కంకమ్మ భర్త కంకయ్య | |
| 2 | 250 | Dry/Patta | 0.13 | మైకల ఐలయ్య తండ్రి మొండయ్య | |
| 3 | 256 | Dry/Patta | 0.15 | మారంరెడ్డి భాస్కర్ రెడ్డి తండ్రి మారంరెడ్డి జర్మన్‌రెడ్డి | |
| 4 | 249 | Dry/Patta | 0.30 | మ్యాకల కొమురయ్య తండ్రి మొండయ్య<br>మ్యాకల ఐలయ్య తండ్రి మొండయ్య<br>మేకల రాజు తండ్రి ఐలయ్య | |
| | | | | జాజాల అంజయ్య తండ్రి వెంకటపతి | |
| 5 | 248 | Dry/Patta | 0.25 | జాజాల వెంకటేశ్వర్లు తండ్రి అంజయ్య<br>మ్యాకల పద్మ భర్త ఐలయ్య | |
| | | విస్తీర్ణం: | 4.03 | | |
| గ్రామము : కచాపూర్ మండలము : కోహెడ జిల్లా : సిద్దిపేట | | | | | |
| for excavation of Minor 1R of D6 on Gouravelly Left Side Main Canal from KM 1.995 to KM 2.140 | | | | | |
| 1 | 468 | Dry/Patta | 0.07 | ఉప్పరపెల్లి వీరవ్వ భర్త రాజయ్య<br>సూరు కొమైల్లి తండ్రి మొండయ్య<br>ఉప్పరపల్లి రాజయ్య తండ్రి మైసయ్య<br>ఉప్పరపెల్లి ప్రకాష్ తండ్రి రాజయ్య<br>ఉప్పరపల్లి రాజయ్య తండ్రి వెంకటయ్య<br>కురిమేల్లి రాజయ్య తండ్రి లింగయ్య<br>కురిమేల్లి యాదగిరి తండ్రి లింగయ్య<br>సుర రాజేశ్వరి భర్త కొమురేల్లి.<br>ఎరుమల్ల ఎల్లవ్వ భర్త రాజయ్య<br>ఉప్పరపెల్లి రామ భర్త రాజయ్య<br>కురిమేల్ల లింగయ్య తండ్రి కొమురయ్య | |
| 2 | 33 | Dry/Patta | 0.17 | ఎరుమల్ల మల్లయ్య తండ్రి యాదయ్య<br>ఎరుమల్ల కొమురయ్య తండ్రి యాదగిరి | |
| 3 | 37 | Dry/Patta | 0.30 | భీంరెడ్డి రాజి రెడ్డి తండ్రి నారాయణ రెడ్డి<br>భీంరెడ్డి జగ్గా రెడ్డి తండ్రి నారాయణ రెడ్డి<br>పిడిశెట్టి లక్ష్మి భర్త లింగయ్య<br>పిడిశెట్టి రమేష్ తండ్రి లింగయ్య<br>పిడిశెట్టి రంజిత్ తండ్రి లింగయ్య<br>ఏరుమల్ల కొమురయ్య తండ్రి యాదయ్య | |
| 4 | 38 | Dry/Patta | 0.32 | జాగీరు మల్లయ్య తండ్రి వీరయ్య<br>మంద రుచిత భర్త పవన్ | |
| 5 | 42 | Dry/Patta | 0.33 | ఆవుల రాధమ్మ భర్త రాజయ్య<br>ఎరుమల్ల యాదగిరి తండ్రి బీరయ్య<br>కరెడ్ల లక్ష్మి భర్త రాజయ్య<br>మంద రుచిత భర్త పవన్<br>జాగీరు మల్లయ్య తండ్రి వీరయ్య<br>ఆవుల రవి తండ్రి వెంకటయ్య | |
| 6 | 39 | Dry/Patta | 0.20 | మంద రుచిత భర్త పవన్<br>జాగీరు మల్లయ్య తండ్రి వీరయ్య<br>జాగిరి రజిత భర్త మహేందర్<br>కరెడ్ల లక్ష్మి భర్త రాజయ్య | |
| | | విస్తీర్ణం: | 3.19 | | |
| | మొత్తం విస్తీర్ణం: | | 14.11 | | |

ఇట్టి ప్రకటన భూసేకరణ పునరుపాది పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతు బద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013 సెక్షన్ 11(1) ప్రకారం సంబందిత భూయజమానులకు చట్టప్రకారం భూనష్ట పరిహారం చెల్లించుటకు గాను నోటిపికేషన్ జారీ చేయనైనది.

భూమి యొక్క ప్లాన్, మరియు వివరములు జిల్లా కలెక్టర్ సిద్దిపేట మరియు రెవెన్యూ డివిజనల్ అధికారి, హుస్నాబాద్ వారి కార్యాలయములో ఉంచనైనది. సంబదిత వ్యక్తులు ఏదైనా పని దినములలో కార్యాలయ పని వేళలో తనిఖీ చెసుకోవచ్చును. రాష్ట్ర ప్రభుత్వము జిల్లా కలెక్టర్ సిద్దిపేట గారు రెవెన్యూ డివిజనల్ అధికారి, హుస్నాబాద్ గారిని మరియు వారి సిబ్బంది ఇట్టి భూసేకరణకు సంబందించిన సెక్షన్-12 ప్రకారం పై తెలిసిన భూములలో ఏదేని ప్రదేశములో ప్రవేశించి సర్వే జరిపి భూకమతాన్ని కొలిచే అధికారం అనుమతించ నైనది.

సెక్షన్ 11(4) ప్రకారం భూసేకరణకు ప్రతిపాదించబడిన భూమి విషయములో జిల్లా కలెక్టర్, సిద్దిపేట గారి అనుమతి లేకుండా. ప్రాథమిక నోటిఫికేషన్ జారి చేసిన తేది నుండి అ నోటిఫికేషన్ లో ఉదహరింపబడిన భూములకు సంబందించి ఎవరు ఎటువంటి కొనుగోలు / అమ్మకాలు / తాకట్లకు సంబందించిన చర్యలు చేపట్టరాదు.


ఇట్టి ప్రాథమిక నోటిఫికేషన్ జారీ అనంతరం పైన చూసిన భూములలో ఎలాంటి సంబంధం ఉన్న వ్యక్తులైన భూసేకరణ పై సెక్షన్ 15(1) అభ్యంతరములు ఉన్నచొ ఇట్టి నోటిఫికేషన్ జారి చేసిన (60) దినములలో భూసేకరణ అధికారి ముందు వారి అభ్యంతరములు వ్రాత పూర్వకంగా తెలియజేయవచ్చును.

సం/- **భూసేకరణ అధికారి & రెవెన్యూ డివిజనల్ అధికారి, హుస్నాబాద్.**
సం/- **అదనపు కలెక్టర్, (రెవెన్యూ) సిద్దిపేట.**
సం/- **జిల్లా కలెక్టర్, సిద్దిపేట.**

DIPR RO NO. 468/LA/PP/Advt/Pub/2024-25


# కేంద్రంనుంచి రాష్ట్రాన్నికి రావాల్సిన
# వాటా నిధులను తీసుకువస్తున్నాం

## ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సమాఖ్య స్ఫూర్తిని గౌరవిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రిగా తను, తమ సహచర మంత్రులు ఎప్పటికప్పుడు కేంద్ర మంత్రులను కలిసి చట్ట ప్రకారం కేంద్రం నుంచి రాష్ట్రాన్నికి రావాల్సిన వాటా మేరకు నిధులను తీసుకువస్తున్నామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత వివిధ పథకాల కింద రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధుల వివరాలు ఎంత అని అడిగిన ప్రశ్నకు ఉపముఖ్యమంత్రి సమాధానమిస్తూ గత ప్రభుత్వం 10 ఏళ్లలో తీసుకువచ్చిన నిధులకంటే అధికంగా తమ ప్రభుత్వం నిధులు సాధించిందని వివరించారు. గత పది సంవత్సరాలుగా కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చిన నిధులు, గత ఏడాది కాలంగా కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చిన నిధుల వివరాలతో తాను సభకు వచ్చానని తెలిపారు. కేంద్రం రాష్ట్రానికి నేరుగా నిధులు కేటాయించదని, ఆ ప్రభుత్వం నిర్దేశించుకున్న ప్రత్యేక పథకాల ద్వారా నిధులు కేటాయిస్తుందని వివరించారు. మా ప్రభుత్వం ప్రతి విషయంలోనూ పారదర్శకంగా ఉంటుందని, తాము ఏ వివరాలను దాచుకునే వాళ్ళం కాదని డిప్యూటీ సిఎం పేర్కొన్నారు.

**వైశ్యుల సంక్షేమం అభివృద్ధికి పలు పథకాలు : డిప్యూటీ సిఎం**

వైశ్యుల సంక్షేమం అభివృద్ధి కోసం కార్పొరేషన్ ఏర్పాటు, ఖర్చు చేసిన నిధుల వివరాలకు సంబంధించిఎంఎల్‌సి బొగ్గారపు దయానంద్ అడిగిన మరో ప్రశ్నకు డిప్యూటీ సింఎ సమాధానమిస్తూ ప్రజా ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఆర్యవైశ్యుల అభివృద్ధి సంక్షేమం కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేశామని. కార్యాలయం ఏర్పాటు, జీతభత్యాల కోసం రూ.36లక్షలు కేటాయించినట్లు తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన ఆర్యవైశ్యుల సంక్షేమం కోసం స్వయం ఉపాధి, ఇతర సంక్షేమ కార్యక్రమాల కోసం పలు పథకాలు రూపొందించాలని ఆదేశించామని చెప్పారు.అవి పూర్తి కాగానే నిధులు కేటాయిస్తామని తెలిపారు.

**దేవాలయాల్లో ధూపదీప నైవేద్య కార్యక్రమం మొదలుపెట్టింది కాంగ్రెస్ ప్రభుత్వమే మంత్రి కొండా సురేఖ**

దేవాలయాల్లో దూపదీప నైవేద్య కార్యక్రమం మొదలుపెట్టింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని లేదన్నారు. వైఎస్ఆర్ హయాంలో ధూపదీప నైవేద్యం కింద 1205 దేవాలయాలను గుర్తించి మొదటగా రూ.2500 చొప్పున ఇచ్చామని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. రాష్ట్రంలో దూపదీప నైవేద్య పథకం కింద ప్రతి దేవాలయానికి సమకూరుస్తున్న నిధులు వివరాలను ఏమిటి అని ఎంఎల్‌సి కవిత అడిగిన ప్రశ్నకు మంత్రి కొండా సురేఖ సమాధానమిస్తూ ఈ పథకం కింద నెలకు రూ.4వేలు ధూపదీప నైవేద్యం కోసం, అర్చకుల గౌరవ వేతనం రూ.6వేలు మొత్తం పది వేలు ఇస్తున్నామని, 10 ఏళ్ల కాలంలో అధికారంలో ఉన్న బిఆర్ఎస్ కాంగ్రెస్ అమలు చేసిన పథకాన్ని కొంత పెంచడం తప్ప కొత్తగా చేసింది ఏమీ లేదన్నారు. తమ ప్రభుత్వం అర్చకులకు సంక్షేమానికి కట్టుబడి ఉందని తెలిపారు. రాష్ట్రంలో దాదాపు 6,541 దేవాలయాలకు ప్రతినెల రూ.6.27 కోట్లు చొప్పున సంవత్సరానికి రూ.75 కోట్లు పారితోషకం చెల్లిస్తున్నామని. ఇందుకు రూ.73.22 కోట్ల బడ్జెట్ కేటాయించి మంజూరు చేశామని తెలిపారు. ధూపదీప నైవేద్యం కింద రాని దేవాలయాలకు నోటిఫికేషన్ విడుదల చేస్తామని వెల్లడించారు.

**మత్తు మందుల అక్రమ సరఫరాపై ప్రభుత్వం ఉక్కుపాదం : మంత్రి పొన్నం ప్రభాకర్**



రాష్ట్రంలో మత్తు మందుల అక్రమ సరఫరాపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపిందని బిసిసంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ నివాస ప్రాంతాల్లో అధిక సంఖ్యలో ఉన్న పబ్‌లు, హుక్కా సెంటర్లు అక్రమంగా నడిపుతున్న విషయం వాస్తమేనా అని సభ్యులు బలమురి వెంకట్, ఎం.ఎస్. ప్రభాకర్‌రావులు అడిగిన ప్రశ్నలకు మంత్రి పొన్నం ప్రభాకర్ సమాధామిస్తూ ప్రభుత్వం ఇప్పటికే హుక్కా సెంటర్లను నిషేధించాలని నిర్ణయం తీసుకుందని, సి2పిఎ సెంట్రల్ యాక్ట్‌పై ఇప్పటికే ప్రెసిడెన్షియల్‌కి పంపించడం జరిగిందని చెప్పారు. డ్రగ్స్‌కు సంబంధించి ఎవరినీ వదిలే ప్రసక్తే లేదని, ఇప్పటికే పలు కేసులు నమోదు చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఫాంహౌజ్‌లలో పార్టీలు చేసుకోవాలనుకునే వారు అనుమతి తీసుకోవాలని, తెలంగాణలో మద్యపాన నిషేధం లేనందున పార్టీలలో మద్యం అనుమతి తీసుకొని డిడి చెల్లించి పార్టీలు చేసుకోవచ్చని తెలిపారు. అయితే పార్టీల పేరుతో డ్రగ్స్ అశ్లీలత ఉంటే చట్ట ప్రకారంగా కఠిన చర్యలు తప్పవని వెల్లడించారు.

రాష్ట్రంలో పోలీసు ఆరోగ్య భద్రత పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందా అని సభ్యులు వంటేరి యాదవరెడ్డి, తీన్మార్ మల్లన్న, జీవన్ రెడ్డి లు అడిగిన ప్రశ్నలకు మంత్రి పొన్నం ప్రభాకర్ సమాధానమిస్తూ పోలీసుల ఆరోగ్యపరమైన అంశం తెలంగాణ ప్రభుత్వం బాధ్యత..వారికి ప్రైవేట్ హాస్పటల్‌లో ఎవరైనా చికిత్స నిరాకరిస్తే ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. పోలీసులు ప్రమాదాల్లో మరణిస్తే సప్రమాదాల్లో చనిపోయిన ఆర్టీసి ఉద్యోగులు అందిస్తున్న కోటి రూపాయల బీమా తరహాలోనే పోలీసులకు సైతం వర్తింపజేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సిద్దిపేట పోలీసులు గజ్వేల్‌లో జరిగిన ప్రమాదంలో మరణించిన దానిపై కూడా ఇప్పటికే కేసు నమోదైంది. వారికి రావాల్సినవి అన్ని ప్రభుత్వం అందిస్తుంది..

**పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకే అధిక నిధులు : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

ఈ ఏడాది బడ్జెట్‌లో నీటి పారుదల రంగాన్ని కేటాయించిన నిధుల్లో అత్యధికంగా పాలమూరు రంగారెడ్డి ఎత్తి పోతల ప్రాజెక్టుకే కేటాయించామని, దీనిని 2026 డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామని నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు పనుల ప్రస్తుతం ఏదశలో ఉందో తెలపాలని సభ్యులు నవీన్ కుమార్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సమాధానమిస్తూ గత ప్రభుత్వం రూ.27,500 కోట్లు ఖర్చు పెట్టి ఒక్క ఎకరాకు కూడ సాగునీరు ఇవ్వలేదని, గత ప్రభుత్వం కనీసం ఒక్క అనుమతి కూడ తీసుకురాలేకపోయిందని, కానీ బిఆర్ఎస్ సభ్యులు నవీన్‌కుమార్ రెడ్డి వారు ఏదో సాధించినట్లు సభల్లో మాట్లాడుతున్నారని మంత్రి మండిపడ్డారు. ఇది బిఆర్ఎస్ పార్టీ సమావేశమే, బహిరంగ సభ కాదని, ఇది శాసనమండలి అని గుర్తుంచుకోవాలని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. మొత్తం రూ.4500 కోట్లు ఖర్చు పెట్టామని ప్రాజెక్టును ఖచ్చితంగా 2026 డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామని చెప్పారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు ఎలాంటి అమతులు తీసుకోలేదని మంత్రి మాట్లాడుతున్నారని, మరీ ఎంపి ప్రభుత్వం రాయలసీమ ఎత్తిపోతల ప్రాజెక్టు ఎలాంటి అనమతులు తీసుకోకుండా నిర్మించుకోలేదా అని సభ్యురాలు కవిత ప్రశ్నించగా, ఇందుకు గత బిఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టంచేశారు.

**42,90,246 మందికి సబ్సిడీ సిలిండర్లు : మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి**

మహాలక్ష్మి పథకం కింద తెల్ల రేషన్‌కార్డు దారులకు ఎల్‌పిజి గృహావసరాల సిలెండర్ ప్రతి రీఫిల్‌ను రూ.500 సబ్సిడీ ధరకే సరఫరా చేస్తారనే విషయం వాస్తమేనా అని సభ్యులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, జీవన్‌రెడ్డి, తక్కెళ్లపల్లి రవీందర్ రావులు అడిగిన ప్రశ్నకు పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి సమాధామిచ్చారు. ఈ పథక కింద రాష్ట్రంలో 91,50,363 మంది దరఖాస్తు చేసుకోగా, ఇందులో 42,90,246 మందికి సబ్సిడీ కింద సిలిండర్ల అందజేస్తున్నామని తెలిపారు.

# మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వర్సెస్ హరీశ్‌రావు

## అసెంబ్లీలో డ్రంక్ అండ్ డ్రైవ్ పెట్టాలి : హరీశ్ రావు
## సమాజం తలదించుకునేలా హరీశ్ వ్యాఖ్యలు : మంత్రి పొంగులేటి





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** శాసనసభ సమావేశాలు నాలుగో రోజు గరంగరంగా సాగాయి. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, మాజీమంత్రి హరీశ్‌రావులపై మధ్య మాటల యుద్ధం నడిచింది. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో కరీంనగర్, కామారెడ్డి రహదారి జాతీయ రహదారిగా మార్పు అంశంపై కాంగ్రెస్ సభ్యుడు కె.మదన్ మోహన్ రావు లేవనెత్తిన ప్రశ్న సందర్భంగా పరస్పర ఆరోపణలతో సభ వేడెక్కింది. ఒక్క మంచిపని చేయకుండా తమను విమర్శిస్తున్నారని, ఒకరోజు బేడీలు వేసుకుని అసెంబ్లీకి వస్తున్నారని, అస్సలు బేడీలు వేసుకోవాల్సిన ఇద్దరు బేడీలు వేసుకోలేదని, వారికి నిజమైన బేడీలు పోలీసులేస్తారని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. మంత్రి వ్యాఖ్యలకు హరీశ్‌రావు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హరీశ్‌రావుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. హరీశ్ రావుకు కూలిపోయే కాలేశ్వరం కట్టి కమిషన్ తీసుకోవడం తెలుసునని, రూ.లక్ష కోట్లు విలువచేసే ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)ను అమ్ముకున్నారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో హరీశ్‌రావు కమిషన్లు తీసుకున్నారని, ఈ ఆరోపణలు నేను నిరూపిస్తానని ఛాలెంజ్ చేశారు. నేను ఎక్కడైనా కమిషన్లు తీసుకున్నట్లు హరీశ్‌రావు నిరూపిస్తే, తాను దేనికైనా సిద్ధమని సవాల్ విసిరారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మామ చాటు అల్లుడిగా హరీష్‌రావు రూ.10వేల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. హరీశ్‌రావుకు దబాయించడమే వచ్చని, ఆయనకు పనిచేయడం రాదని ఎద్దేవా చేశారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వ్యాఖ్యలపై స్పందించిన హరీశ్ రావు మాట్లాడుతూ మంత్రి చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయని, ఆ వ్యాఖ్యలను సభ రికార్డుల నుంచి తొలగించాలని కోరారు. తనపై చేసిన ఆరోపణలపై చర్చ పెడితే తాను సిద్ధమని అన్నారు. శాసనసభ వ్యహారాల మంత్రి శ్రీధర్‌బాబు సుద్దులు మాకు చెప్పడం కాదు వారి సహచర మంత్రికి కూడా చెప్పాలని హరీశ్ రావు అన్నారు.

**హరీశ్ రావు సభకు క్షమాపణ చెప్పాలి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

కొందరు సభ్యులు ఉదయమే డ్రింక్ చేసి సభకు వస్తున్నారని హరీశ్ రావు ఆరోపించారు. సభలోకి వచ్చి ఏం మాట్లాడుతున్నారో వారికే తెలియడం లేదన్నారు. అందుకే అసెంబ్లీ బయట డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు పెట్టాలని సభాపతిని హరీశ్ రావు కోరారు. తన పేరును నేరుగా ప్రస్తావిస్తూ కోమటిరెడ్డి ఆరోపణలు చేశారని, అసెంబ్లీ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు ఆయన వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలన్నారు. హరీశ్‌రావు వ్యాఖ్యలను రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఖండించారు. హరీష్ రావు సమ సమాజం తలదించుకునేలా మాట్లాడారని, ఆయన మాట్లాడింది అభ్యంతరకరమైన పదమని అన్నారు. హరీశ్ రావు సభకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. హరీశ్ రావు వ్యాఖ్యలపై బీర్ల ఐలయ్య స్పందిస్తూ హరీశ్ రావుకు వారి మామ గుర్తుకువచ్చినట్లు ఉందన్నారు.

వారి మామ (కెసిఆర్) ఫామ్ హౌస్‌లో తాగి పడుకున్నారని, అందుకే సభకు రావడం లేదని విమర్శించారు. తెలంగాణ కోసం మంత్రి పదవి త్యాగం చేసిన కోమటిరెడ్డి వెంకటరెడ్డి గురించి మాట్లాడే అర్హత అగ్గిపెట్టే హరీశ్ రావుకు లేదని బీర్ల ఐలయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. హరీశ్ రావు, బీర్ల ఐలయ్య మాట్లాడిన మాటలను రికార్డుల నుంచి తొలగిస్తున్నామని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించారు.

**పదేళ్ల పాలనలో విధ్వంసం చేసిన బిఆర్ఎస్..**

కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో పదేళ్లు బిఆర్ఎస్ పాలన విధ్వంసం చేసిందని, ఉప్పల్ ఫ్లై ఓవర్‌ను ఆరున్నర ఏళ్ళు అయినా పూర్తి చేయలేదన్నారు. ఏడు కిలోమీటర్లు పిల్లర్లు వేసి స్లాబ్ వేయకుండా వదిలేశారని ఆరోపించారు.

# 'భూభారతి'ని స్వాగతిస్తున్నాం : కూనంనేని



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** శాసనసభలో బుధవారం ప్రభుత్వం ప్రవేశపెట్టిన "2024 తెలంగాణ భూ భారతి" (భూమి హక్కుల రికార్డు) బిల్లును స్వాగతిస్తున్నామని సిపిఐ శాసనసభ పక్ష నేత కూనంనేని సాంబశివరావు చెప్పారు. భూ భారతి కీలకమైన చట్టమని, ప్రతిపక్షాల సూచనలు, సలహాలు తీసుకోవాలని ఆయన సూచించారు. భూ భారతి ప్రాధాన్యతతో కూడిన బిల్లు కావడంతో దీనిపై సభ్యులు అధ్యయనానికి ఒక రోజు సమయమిచ్చి గురువారం బిల్లుపై చర్చ చేపడితే బాగుటుందని కూనంనేని సూచించారు.

**ఎజెండా అర్ధరాత్రి పంపడం పట్ల అభ్యంతరం**

అసెంబ్లీ బిజినెస్ ఎజెండాను ప్రభుత్వం అర్ధరాత్రి 12 గంటల తర్వాత పంపడం సమంజసం కాదని ఎంఐఎం శాసనసభా పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసి, బిజెపి ఎంఎల్‌ఎ పాల్వాయి హరీశ్, బిఆర్ఎస్ ఎంఎల్‌ఎ టి.హరీశ్‌రావులు అసంతృప్తి వ్యక్తం చేశారు. అసెంబ్లీలో భూ భారతి బిల్లు ప్రవేశపెట్టిన ప్రభుత్వం ఆ వెంటనే చర్చ పెట్టడంపై బిఆర్ఎస్ సహా ఎంఐఎం, బిజెపిలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. అక్బరుద్దీన్ ఒవైసి మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన తప్పిదమే ఈ ప్రభుత్వం కొనసాగిస్తోందని, అర్ధరాత్రి 12 గంటల వరకు అసెంబ్లీ బిజినెస్ ఎజెండా కనిపించడం లేదన్నారు. ఒక బిల్లుపై మాట్లాడాలంటే కనీసం 12 గంటల సమయం అవసరమన్నారు. ఇప్పుడే బిల్లు పెట్టి ఇప్పుడే సలహాలు, సూచనలివ్వమంటే ఎలా కుదురుతుందని ప్రశ్నించారు. మరోసారి ఇలాంటి పొరపాట్లు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. బిజెపి సభ్యుడు పాల్వాయి హరీశ్ మాట్లాడుతూ అర్ధరాత్రి 12 గంటల తర్వాత సభ ఎజెండా పెట్టడాన్ని తప్పుబట్టారు. ఇది శాసనసభలో సభ్యుల హక్కులను ఉల్లంఘించడమే అన్నారు. బిల్లుపై కనీసం ఒక రోజు వర్కింగ్‌డే ముందే తమకు పంపాలని కోరారు. బిల్లును చదువుకునేందుకు తమకు రేపటి వరకు సమయం కావాలని కోరారు. బిల్లు ఇవ్వకుండా చర్చంటే ఎలా అని ప్రశ్నించారు. శాసనసభ వ్యహారాల శాఖమంత్రి భూ భారతి బిల్లుపై స్పీకర్ అనుమతితో గురువారం చర్చించేందుకు సిద్ధమని సభకు తెలిపారు.

## అసెంబ్లీ మీడియా పాయింట్

# బిజెపిపై పోరాడుతుంటే హరీష్‌రావుకు నొప్పిఎందుకు : ఆది



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మేము బిజెపి మీద పోరాడుతుంటే హరీష్ రావుకు ఏంటి నొప్పి అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన జడ్చర్ల ఎంఎల్‌ఎ అనురుద్‌రెడ్డితో కలిసి మాట్లాడుతూ.. అదాని అవక తవకలపై ఎఐసిసి ఛలో రాజభవన్‌కు పిలువునిచ్చిందని..అందుకే ఛలో రాజ్ భవన్‌కు సిఎం రేవంత్ రెడ్డి వచ్చారన్నారు. అమెరికాలో అదాని అవినీతి అక్రమాలపై కేసు నమోదు అయిందని, దీనిపై ప్రధాని మోది నోరు ఎందుకు మెదపడంలేదని ప్రశ్నించారు. మణిపూర్ అల్లర్లు జరిగితే మోదీ ఎందుకు పోలేదని నిలదీశారు. తాము బిజెపి మీద పోరాడుతుంటే హరీష్‌రావు బాధపడుతున్నారని, దీంతో మరొకసారి బిజెపి, బిఆర్ఎస్ దోస్తీ బయట పడిందన్నారు. సిఎం రేవంత్ రెడ్డి అదాని అవినీతిపై జెపిసి వేయమని అడుగుతున్నారన్నారు. హారేష్‌రావు మీకు చిత్తశుద్ధి ఉంటే బిజెపికి వ్యతిరేకంగా పోరాటం చేయండి అని సవాల్ విసిరారు. బిజెపికి బి టీమ్ బిఆర్ఎస్ అని తెలిపారు. తాము అదానితో చట్టబద్ధమైన ఒప్పందాలు మాత్రమే చేసుకున్నాం అని స్పష్టం చేశారు. ధనవంతుల జాబితాలో పదేండ్ల క్రితం ప్రపంచంలో అదాని 60 లోపు ఉంటే.. ఇప్పుడు రెండో ప్లేస్‌కు ఎందుకు వచ్చాడో మోదీ సంధానం చెప్పాలి అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గంజాయి రహిత రాష్ట్రంగా, స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీని తీసుకొస్తుంటే ఓర్వలేక పోతున్నారన్నారు.

**ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలు త్వరలోనే సిఎం అమలు చేస్తారు**
**ఎంఎల్‌ఎ మట్టా రాఘమయి**

బిఆర్ఎస్ నాయకుల హడావిడిని ప్రజలు గమనిస్తున్నారని సత్తుపల్లి ఎంఎల్‌ఎ మట్టా రాఘమయి అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ సజావుగా సాగకుండా ప్రతి రోజూ డ్రామాలు చేస్తున్నారని విమర్శించారు. గడిచిన పది సంవత్సరాలుగా ఆటో కార్మికుల సమస్యలను బిఆర్ఎస్ పట్టించుకోలేదు అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యంపై బిఆర్ఎస్ విషం చిమ్మే ప్రయత్నం చేస్తున్నారన్నారు. మహిళలు ఈ పథకం ద్వారా నెలకు ఐదు నుండి ఆరు వేల రూపాయల లబ్ధి పొందుతున్నారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజలనుండి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ఇలాంటి పనులు చేస్తున్నారని విమర్శించారు.

**కెసిఆర్ చదివిన 80 వేల పుస్తకాల అనుభవం ఎక్కడికి పోయింది**
**ఎంఎల్‌సి బల్మూర్ వెంకట్**

కెసిఆర్ చదివిన 80 వేల పుస్తకాల అనుభవం ఎక్కడికి పోయిందని..తన అనుభవాలను అసెంబ్లీకి వచ్చి ప్రభుత్వానికి సూచనలు చేయాలని ఎంఎల్‌సి బల్మూర్ వెంకట్ తెలిపారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ..శాసనసభ లో, మండలిలో సమస్యలపై బిఆర్ఎస్ చర్చించాలని..అయితే బిఆర్ఎస్ నేతలు సభను పక్కదారి పట్టించాలని చూస్తున్నారని అన్నారు. ప్రతి పక్ష నేతగా కెసిఆర్ ఎందుకు అసెంబ్లీకి రావట్లేదని ప్రశ్నించారు. కెసిఆర్‌ను ముందుగా చట్ట సభలకు కెటిఆర్ తీసుకురావాలని సవాలు విసిరారు. కెటిఆర్ పదే పదే తనను అరెస్ట్ చేస్తారు అంటుండు..కెటిఆర్ తప్పు చేయకపోతే ఎందుకు పదేపదే లోపలికి పోతా అంటున్నాడని ప్రశ్నించారు. ప్రతి అంశంలో జరిగిన అవినీతిలో కెటిఆర్‌దే భాగస్వామ్యం ఉందని తేలుతుందన్నారు. ప్రజా ప్రభుత్వంలో ప్రొసీజర్ ప్రకారం చర్యలు ఉంటవని అన్నారు.

**అదానీతో దోస్తీ గల్లీలో కుస్తీ పడుతున్న కాంగ్రెస్: మాజీ మంత్రి హరీశ్‌రావు**

రేవంత్ రెడ్డి రోడ్ల మీద చేస్తున్న సర్కస్ ఫీట్లు చూస్తే ఊసరవెల్లి కూడా సిగ్గుపడుతుందని..అదానితో దోస్తీ గల్లీలో కుస్తీ పడుతున్నట్లు ఉంది కాంగ్రెస్ తీరు అని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ ఆయన మాట్లాడుతూ.. మొదటి రోజు శాసనసభకు ఆదాని, రేవంత్ అక్రమ సంబంధం మీద నిరసనగా టీషర్ట్స్ వేసుకొని వస్తే అడ్డుకున్నారు. ఇద్దరి దోస్తీకి కట్టుబడి సభ ప్రాంగణంలోకి కూడా అడుగుపెట్టనివ్వలేదని విమర్శించారు. సిఎం రాజ్ భవన్ వద్ద ఆదానీ అవినీతి గురించి మాట్లాడినట్లు సర్కస్ చేసిందన్నారు. రాజ్‌భవన్ వద్ద కూడా సిఎం..కెసిఆర్ గురించి, బిఆర్ఎస్ గురించే మాట్లాడిండు తప్ప, ఆదాని అవినీతి గురించి మాట్లాడింది తక్కువ అన్నారు. కాంగ్రెస్ పోరాటం ఆదాని మీద అయితే మొదటి రోజు మమ్మల్ని ఎందుకు అసెంబ్లీకి రాకుండా అడ్డుకున్నారు, నిరసన తెలిపే అవకాశం కూడా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. దావోస్ వెళ్లి ఆదానీతో రూ.12,400 కోట్ల అగ్రిమెంట్లు చేసుకున్న సిఎంకు నిజంగా అదాని అవినీతి మీద పోరాటం చేయాలనుకుంటే ముందు వెంటనే అగ్రిమెంట్లు రద్దు యాలని డిమాండ్ చేశారు. అదాని గ్రీన్ తో 5వేల కోట్ల కాంట్రాక్టు, వంద మెగావాట్ల డాటా సెంటర్ కు 5వేల కోట్లకు, 1400 కోట్లతో సిమెంట్ ఫ్యాక్టరీ, అదానీ డిఫెన్స్ ఫేస్ కోసం వెయ్యి కోట్లతో అగ్రిమెంట్ చేసుకురన్నారు. మొత్తంగా 12400 కోట్ల అగ్రిమెంట్ చేసారు.సిఎం మాటల్లో నిజాయితీ ఉంటే, వంద కోట్లు వాపస్ ఇచ్చినట్లు రూ.12400 కోట్ల అగ్రిమెంట్ కూడా రద్దు చేసి చిత్తుశుద్దిని నిరూపించుకోవాలని రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు.




**మండలిలో అడిగిన ప్రశ్నలకు తప్పుడు సమాధానాలు ఇస్తున్నారు: ఎంఎల్‌సి కవిత**

తాము శాసన మండలి లో అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వం తప్పుడు సమాధానాలు ఇస్తోందని ఎంఎల్‌సి సత్యవతి రాథోడ్‌తో కలిసి ఎంఎల్‌సి కవిత అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ....నిన్న మూసీ విషయం లో సభను మంత్రి శ్రీధర్ బాబు తప్పుదోవ పట్టించారన్నారు. ప్రపంచ బ్యాంకు ను మూసి కోసం డబ్బులు అడగలేదని శ్రీధర్ బాబు చెబుతున్నారన్నారు.సెప్టెంబర్ 2024 లో ప్రపంచబ్యాంకు ను మూసి కోసం ఋణం అడిగినట్టు తాను ఈరోజు సాక్ష్యాదారాలు బయట పెడుతున్నాను అని అన్నారు. డిపిఆర్ లేదని అసెంబ్లీలో చెబుతారు. ప్రపంచబ్యాంకు కు సెప్టెంబర్ 19 న ఇచ్చిన నివేదికలో ప్రపంచ బ్యాంకుకు డిపిఆర్ ఉందని చెబుతారు..ఎందుకు ఎవరి కోసం అబద్దం చెబుతున్నారు ..ఎవరి లాభం కోసం ఇదంతా అని ప్రశ్నించారు.

**రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా - ఎంఎల్‌ఎ పాయాల్ శంకర్**

ప్రభుత్వ వ్యవహారంపై ఆశ్చర్యం వేస్తోందని..అసలు రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా అని బిజెపి ఎంఎల్‌ఎ పాయాల్ శంకర్ అన్నారు. అసెంబ్లీ పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్‌కి ఓటేసినందుకు ప్రజలు బాధ పడుతున్నారనానరు. రాష్ట్ర పరిపాలన చేసే వారే రాజ్ భవన్‌కి ముట్టడికి వెళ్తారా! సిఎం రాజ్ భవన్ ముట్టడికి పోతే రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పరిస్థితి పరిస్థితి ఎంటి? అసెంబ్లీ మీటింగ్ సమావేశా సమయాల్లో ముట్టడిలా? సమావేశాలను తప్పించుకోవడం కోసం ముట్టడి చేశారన్నారు.

**రేవంత్ రెడ్డి రాజ్యాంగాన్ని ఖూనీ చేశారు...బిజెపి పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి**

అదానితో చేతులు కలిపి 100 కోట్ల విరాళం తీసుకున్నది నిజం కాదా అని సిఎంను బిజెపి పక్ష నేత మహేశ్వర్‌రెడ్డి ప్రశ్నించారు. రాహుల్ గాంధీ అపాయిమెంటె ఇవ్వకపోవడం వల్లే కాంగ్రెస్ ఛలో భవన్ ర్యాలీ చేశారని అన్నారు. పదవి కాపాడుకోవడం కోసమే రేవంత్ ధర్నాలో పాల్గొన్నారన్నారు. రాహుల్, రేవంత్ ల మధ్య దూరం పెరిగిందని అన్నారు. తెలంగాణ ఆత్మ గౌరవాన్ని ఢిల్లీకి తాకట్టు పెట్టారని విమర్శించారు. వరుసగా మూడు సార్లు కాంగ్రెస్ కి అధికారం దక్కలేదు..వరుసగా మూడు సార్లు గెలవడం వల్లే మోదీపై కాంగ్రెస్‌కు అక్కసు అని అన్నారు.


తెలంగాణ ప్రభుత్వం
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B) కార్యాలయం, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా.

NIT Short Tender Notice No. EE/R&B/MDCL/08/2024-25/ 'ఇ'-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన తేది: 17.12.2024

గౌరవనీయులైన భారత రాష్ట్రపతి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని హైదరాబాద్‌కు వెళ్లేందుకు (బయలుదేరడానికి) ఏర్పాట్లను అందించే ఒక (01) పని కోసం ఈ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారమ్ కింద అత్యవసర ఆన్‌లైన్ టెండర్లు ఆహ్వానించడమైనది, కింద సంతకం చేసిన వారి ద్వారా మొత్తం ఇసివి రూ.2.09 లక్షలు. **బిడ్ అప్‌లోడింగ్ ప్రారంభ తేది:** 18.12.2024న మ.03.30గం.ల నుండి, **ఆఖరి తేది:** 20.12.2024న ఉ.10.30గం.ల వరకు. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా www.tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B), మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా.
DIPR R.O. No. : 8071-PP/CL/ADVT/1/2024-25, Date: 18-12-2024

శ్రీశ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానము
ఊరుకొండపేట గ్రామం, ఊరుకొండ మండలం, నాగర్‌కర్నూల్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం.

08/SAST/2024 బహిరంగ వేలము తేది: 18.12.2024

ఇందుమూలముగా సమస్త ప్రజానికానికి మరియు గ్రామస్తులకు తెలియజేయటం ఏమనగా శ్రీ శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానము, ఊరుకొండపేట గ్రా, ఊరుకొండ మండలం, నాగర్ కర్నూల్ జిల్లా, తెలంగాణా రాష్ట్రం యొక్క ఈ దిగువ తెలిపిన వివిధ టెండర్స్ బహిరంగవేలము మరియు సీల్డ్ టెండర్స్ ద్వార తేది. 27.12.2024 శుక్రవారము రోజు మధ్యాహ్నము 12.30 గం. లకు శ్రీ శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానము, ఊరుకొండపేట గ్రామము నందు నిర్వహించుటకు నిర్ణయించుటమైనది. ఈ బహిరంగవేలములో పాల్గొనుటకు ఆసక్తి కలవారు అందరు వేలంపాటకు ముందుగా మధ్యాహ్నము 12.30 గం.ల లోపల నిర్ణహించిన డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనవలసినదిగా తెలియజేయటమైనది. సీల్డ్ టెండర్స్ నిర్ణహించిన డిపాజిట్ తో పాటు ముందుగా మధ్యాహ్నము 12.30 గం.ల లోపల సమర్పించగలరు. ఇతర వివరములకు ఫోన్ 9010901099 సంప్రదించగలరు.

| క్ర.సం. | పద్దుల వివరములు | కాల పరిమితి | డిపాజిట్ |
|---|---|---|---|
| 1 | తలనీలాలు సేకరణ హక్కు | 01.01.2025 నుండి 31.12.2025 వరకు | రూ. 100000.00 |
| 2 | కొబ్బరిముక్కలు సేకరణ హక్కు | 15.01.2025 నుండి 31.12.2025 వరకు | రూ. 50000.00 |
| 3 | కిరాణా సామగ్రి సరఫర | 01.01.2025 నుండి 31.12.2025 వరకు | రూ. 10000.00 |
| 4 | దేవస్థాన షాప్స్ (3 years ) | 01.01.2025 నుండి | రూ. 10000.00 |

ఇతర వివరములకు ఫోన్ 9010901099 సంప్రదించగలరు.
సం/- కార్యనిర్వాహణాధికారి
DIPR R.O. No. : 8044-PP/CL/ADVT/1/2024-25, Date: 18-12-2024

# సిరియా ప్రజలే భవితను నిర్దేశించుకోవాలి

ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి ఉద్ఘాటన



**న్యూయార్క్ :** సిరియాలో ప్రజలు తమ భవిష్యత్తును తామే నిర్దేశించుకునేవిధంగా తదుపరి పరిపాలన ఉండాలని, ఆ విధంగా సమ్మిళితపద్ధతిలో సిరియా నాయకత్వంలో రాజకీయ ప్రక్రియ కొనసాగాలని ఐక్యరాజ్యసమితి భద్రతామండలి ఉద్ఘాటించింది. నియంత అస్సాద్ పరిపాలన కుప్పకూలి ఆయన కుటుంబంతో సహా ఈనెల 8వ తేదీన రష్యాకు తరలివెళ్ళిపోయిన తర్వాత కొత్త ప్రభుత్వ హయాంలో సిరియా ప్రజలే భవిష్యత్తును నిర్దేశించుకునేవిధంగా పరిపాలన సమ్మిళిత పద్ధతిలో కొనసాగాలని భద్రతామండలి బుధవారంనాడు ఉద్ఘాటించింది. పశ్చిమ ఆసియా ప్రాంతీయ భద్రతకు ఎలాంటి ముప్పు వాటిల్లకుండా తగిన చర్యలు తీసుకోవాలని భద్రతామండలి కోరింది. అస్సాద్ మిత్రదేశమైన రష్యాతోపాటు అమెరికాకూడా భద్రతామండలి సమావేశం జరిపింది. సిరియా ప్రజల భవిష్యత్తుకి అనుగుణంగా రాజకీయ ప్రక్రియ కొనసాగాలని కోరింది. సిరియా ప్రజల భవిష్యత్తుపై బుధవారంనాడు భద్రతామండలి ఒక ప్రకటన విడుదల చేసింది. సిరియా ప్రజలు ప్రజాస్వామ్యబద్ధంగా, శాంతియుత పద్ధతులలో, స్వతంత్రంగా తమ భవిష్యత్తును తాము నిర్దేశించుకోవాలని ఆ ప్రకటనలో యుఎన్ఓ పేర్కొంది. ఇదిలా ఉండగా, సిరియాలో కొత్త ప్రభుత్వం ఏ ఒక్క రాజకీయపార్టీని లేకుండా చేయకూడదని అస్సాద్ వ్యతిరేక గ్రూపు సిరియా నేషనల్ కొయిలేషన్ నాయకుడు హాదీ అల్ బహ్రా అన్నారు. సిరియాలో పరివర్తనకాలంలో అధికారంలో కొనసాగే ప్రభుత్వం తన విశ్వసనీయతను రుజువుచేసుకోవాలన్నారు. సుమారు లక్షమంది ప్రజలు తమ పాత ఇళ్ళకు చేరుకునేందుకు పొరుగు దేశాల నుండి గడచిన పది రోజులుగా దేశంలోకి వస్తున్నారని అంచనావేశారు.

**బయటపడిన సామూహిక సమాధి**

సిరియాలో అల్ అస్సాద్ ఇరవై సంవత్సరాల పరిపాలనలో సుమారు లక్షమందిని చంపి రహస్యంగా ఖననం చేశారు. దీనికి సంబంధించిన ఒక సామూహిక సమాధి బుధవారంనాడు బయటపడింది. అంతర్జాతీయ వార్ క్రైమ్స్ ప్రాసిక్యూటర్ బుధవారం నాడు ఈ విషయం వెల్లడించారు. అమెరికా అధ్యక్షుడుగా ఎన్నికైన డోనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ, అస్సాద్‌ను కసాయివాడుగా అభివర్ణించారు. మరోవైపు సిరియా కొత్త ప్రభుత్వం కూడా రష్యాకు ఒక విజ్ఞప్తి చేస్తూ, అస్సాద్‌కు రష్యాలో ఆశ్రయం ఇవ్వడంపై పునరాలోచన చేయాలని కోరింది. కాగా సిరియాలో తిరిగి విమానాల రాకపోకలు మొదలవుతున్నాయి. అస్సాద్ ప్రభుత్వం కుప్పకూలిన తర్వాత 12 రోజులకు సిరియా రాజధాని డమాస్కస్ నుండి అలెప్పో నగరం అలెప్పోకు మొదటి విమానం బుధవారంనాడు తిరిగి రాకపోకలు ప్రారంభించింది. ఈ మొదటి ఎయిర్ బస్ విమానంలో జర్నలిస్టులతోపాటు 43 మంది ప్రయాణం చేశారు. ఐతే ఇప్పటికీ సిరియా సాధారణ జీవతానికి శ్రేయస్కరం కాదని పౌరులు అభిప్రాయపడుతున్నారు. నవంబరు 27న సిరియాలో తిరుగుబాటుదారులు వ్యూహాత్మకంగా అలెప్పోలో ప్రభుత్వ సైన్యంపై దాడిచేసి వారిని హతమార్చారు. అప్పటినుండీ అనేక నగరాలలో వారు విజయయాత్ర సాగించి చివరకు డిసెంబరు 8వ తేదీనాటికి సిరియా దేశాధికారాన్ని స్వాధీనం చేసుకున్నారు.




# భారత్ తరహాలోనే టారిఫ్‌లు వేస్తాం:ట్రంప్




**వాషింగ్టన్ :** అధికారంలోకి రాకముందే డోనాల్డ్‌ట్రంప్ తన విధానాలను ప్రకటించి పలుదేశాలపై తన ప్రభావం చూపిస్తున్నారు. ఈ పరంపరలో కెనడా ఇప్పటికే చిక్కుల్లో పడగా, తాజాగా ట్రంప్ భారత్‌కు కూడా ఒక హెచ్చరిక చేశారు. భారతదేశం చాలా భారీస్థాయిలో టారిఫ్‌లు వసూలు చేస్తోందని, ఇదే కొనసాగితే తాను అధికారంలోకి వచ్చాక అదేపద్ధతిలో తాము కూడా టారిఫ్‌లు విధిస్తామని హెచ్చరిక చేశారు. అమెరికా ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటున్న భారత్ భారీగా టారిఫ్‌లు వేస్తోందని, అందుకు ప్రతిగా తామూ అదేబాటలో పయనిస్తామని ట్రంప్ అన్నారు. మీరు వేసినట్టే మేమూ వేస్తాం అని ఆయన అన్నారు. మేం కూడా అంతే మొత్తంలో పన్నులు వేస్తామన్నారు. ''వాళ్ళు మాపై పన్నులు వేస్తున్నారు, మేం కూడా వారిపై పన్నులు వేస్తున్నాం, అంతే'' అని ట్రంప్ సింపుల్‌గా తేల్చి చెప్పారు. చైనాతో పొటన్షియల్ ట్రేడ్ ఎగ్రిమెంటుకు సంబంధించి అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా ట్రంప్ పైవిధంగా స్పందించారు. ''ఒకవేళ భారత్ గనుక తమపై 100 శాతం టారిఫ్ వేస్తే మేం కూడా అంతే వేస్తాం'' అని ట్రంప్ చెప్పారు. గడచిన అక్టోబరులో జరిగిన ఎన్నికల ప్రచారంలో కూడా ట్రంప్ భారత్ వసూలు చేస్తున్న టారిఫ్‌ల గురించి విస్తారంగా ఓటర్లలో ప్రచారం చేశారు. భారత్ చాలా ఎక్కువ టారిఫ్‌లు వసూలు చేస్తోందని ఆయన ఎన్నికల్లో ప్రచారం చేశారు. తాజాగా అడిగిన ప్రశ్నకు అందుకు అనుగుణంగానే ఆయన స్పందించారు.

## యూట్యూబ్ స్టార్ 'ప్రసాద్ బెహరా' అరెస్ట్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'నీ బ్యాక్ బాగుంది' అంటూ ఓ హీరోయిన్ మీద అసభ్యకర వ్యాఖ్యలు, ప్రవర్తన చేసిన యూట్యూబ్ స్టార్ ప్రసాద్ బె హరాని జూబ్లీహిల్స్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. తనపై ప్రసాద్ అసభ్యకర వ్యాఖలు చేశారంటూ సదరు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు ప్రసాద్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా 14 రోజుల జ్యూడీషియల్ రిమాండ్ విధించారు. దీంతో పోలీసులు అతన్ని చంచల్‌గూడ జైలుకు తరలించారు.

## పరువు తీశారు (మూడవ పేజీ తరువాయి)

మోసగిస్తున్న అదానీపై జెపిసి వేసి చట్టపరమైన విచారణ చేపట్టాలని దేశ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ పార్లమెంటులో కోరినా పట్టించుకోకపోవడంతో ఈ దేశ ప్రజల కోసం టిపిసిసి ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టినట్టు డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. ఈ దేశ, రాష్ట్ర సంపదను, వనరులను బిజెపి నాయకత్వానికి దగ్గరగా ఉండే కొద్ది మంది క్రోనీ కాపిటల్స్‌కు దోచి పెట్టేందుకు మోడీ ప్రయత్నిస్తున్నారని ఎన్నికల ముందు తాను చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ద్వారా వివరించిన విషయాన్ని గుర్తు చేశారు. దేశ, రాష్ట్ర సంపద, వనరులపై హక్కులు ఇక్కడి ప్రజలకు ఉండాలని పాదయాత్ర సందర్భంగా ప్రతి చోటా తాను మాట్లాడిన విషయాన్ని భట్టివిక్రమార్క గుర్తు చేశారు. ప్రజాస్వామ్య దేశాన్ని అదాని ఏ విధంగా దోపిడీ చేస్తున్నారు, ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక సంస్థలను ఏ విధంగా మోసగిస్తున్నారు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న సంస్థలు, హిండెన్ బర్గ్ లాంటి సంస్థలు బహిర్గతం చేశాయని తెలిపారు. అదానిని, ఆయన కంపెనీలు, వ్యాపారాలపై విచారించాలని పార్లమెంట్‌లో గత కొద్ది రోజులుగా దేశ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ డిమాండ్ చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. అక్కడ స్పందన లేకపోవడంతో ఎఐసిసి దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలకు ఎఐసిసి పిలుపు ఇచ్చిందన్నారు. నిరసన దీక్షలో భాగంగా గవర్నర్‌కు వినతి పత్రం సమర్పించింది.

**అదాని స్కామ్‌లతో దేశ ప్రతిష్ట మసకబారుతోంది**

టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ నరేంద్ర మోదీ అండదండలతో అదాని దేశంలోని వ్యవస్థలకు 'నమో అదాని'గా మారారని, అదాని కుంభకోణాలపై ఎన్‌డిఎ ప్రభుత్వం జెపిసి వేయడానికి ఎందుకు జంకుతుందని ప్రశ్నించారు. అదానిపై ప్రభుత్వ సంస్థలు మౌనం దాల్చడానికి మోదీ అండదండలే కారణమన్నది వాస్తవమన్నారు. అదాని స్కామ్‌లతో దేశ ప్రతిష్ట మసకబారుతోందన్నారు. అదాని అవినీతిని మొదట్లోనే అరికట్టి అరెస్టు చేసిఉంటే అంతర్జాతీయంగా దేశం పరువు పోయేది కాదన్నారు. దేశంలో అదాని చేసుకున్న విద్యుత్ ఒప్పందాల్లో రూ.2,029 కోట్ల (65 మిలియన్ డాలర్లు) కుంభకోణం జరిగినట్టు అమెరికా విచారణ సంస్థలు తేల్చాయని, సామాన్యులు, రైతులు రుణాలు చెల్లించడం ఆలస్యమైతే ఆస్తులను జప్తు చేసే ప్రభుత్వం అదాని విషయంలో ఉదాసీన వైఖరి ఎందుకు ప్రదర్శిస్తుందని, బ్యాంకింగ్ వ్యవస్థలను అదాని స్కామ్‌లతో లక్షల కోట్ల రూపాయలను ఎగ్గొట్టుతున్నా ఎందుకు మౌనంగా ఉంటున్నాయని ప్రశ్నించారు. గుజరాత్ అల్లర్ల సమయంలో యావత్ దేశం మోదీని తప్పుపడితే అదాని మాత్రం ఆయనను సమర్థించారని మహేష్‌కుమార్ గౌడ్ గుర్తు చేశారు. మణిపూర్‌లో అపోహలతో గొడవపడుతున్న వర్గాలతో కనీసం చర్చలు జరిపేందుకు కూడా ఆ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోకపోవడం శోచనీయమని, కనీసం ఒక్కసారి కూడా ప్రధాని మోదీ మణిపూర్‌లో పర్యటించలేదన్నారు. మణిపూర్ శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో బిజెపి ప్రభుత్వం విఫలమయిందని, కనీసం అక్కడ సిఎంను కూడా మార్చలేకపోతుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

## పడవను ఢీకొన్న బోటు (మూడవ పేజీ తరువాయి)

కొనసాగిస్తున్నారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఈ ప్రమాద ఘటన గురించి నాగపూర్‌లో పాత్రికేయులకు వివరించారు. కడపటి వార్తలు అందేసరికి పడవలో ప్రయాణిస్తున్న 101 మంది పర్యాటకులను సహాయ సిబ్బంది కాపాడి ఆసుపత్రికి తరలించారని చెప్పారు. రాత్రి తొమ్మిది గంటలకు కడపటి వార్తలు అందేసరికి మృతులసంఖ్య 13గా ఉంది. ప్రసిద్ధి చెందిన పర్యాటక ప్రదేశం ఎలిఫెంటా ఐలాండ్స్‌కు నీల్‌కమల్ పేరుగల ఒక ఫెర్రీ వెళుతున్న సమయంలో సాయంత్రం నాలుగు గంటలకు ఎదురుగా వేగంగా వస్తున్న నావికాదళానికి చెందిన స్పీడుబోటు ఫెర్రీని ఢీకొట్టింది. గేట్ వే ఆఫ్ ఇండియా నుండి పర్యాటకులను నీల్‌కమల్ ఫెర్రీ తీసుకుని బయలుదేరిన తర్వాత ఈ ప్రమాదం జరిగింది. నావికాదళం సిబ్బంది ఈ స్పీడ్ బోటులో ఇంజన్ ట్రైల్స్ వేస్తుండగా, అదుపు తప్పి ప్రయాణికుల పడవను ఢీకొట్టిందని నావికాదళం ఒక ప్రకటనలో తెలియజేసింది. ''ఘటన జరిగిన వెంటనే తీర ప్రాంత గస్తీ సిబ్బందితో, ఇతర సముద్రదళ పోలీసుల సమన్వయంతో నావికాదళం భారీస్థాయిలో ప్రయాణికులకోసం గాలింపు చర్యలు చేపట్టింది. నావికాదళానికి చెందిన నాలుగు హెలికాప్టర్లతో గాలింపు చేపట్టారు, ఒక తీరప్రాంత గస్తీ బోటు కూడా గాలింపు చర్యల్లో పాల్గొంటున్నది, సముద్ర గస్తీ పోలీస్‌కు చెందన మూడు పడవలు కూడా ఈ గాలింపు, సహాయ కార్యక్రమాలలో పాల్గొంటున్నాయి'' అని నావికాదళం సిబ్బంది విడుదల చేసిన ప్రకటన తెలియజేసింది. ''సజీవులను ఆ ప్రాంతంలో ఉన్న నావికాదళం సిబ్బంది కాపాడారు. వారిని జెట్టీలమీదకు తరలించి ఆసుపత్రులకు పంపించారు. ఇప్పటివరకూ 99 మందిని ప్రాణాలతో కాపాడారు'' అని ప్రకటన తెలియజేసింది. మరణించిన నావికాదళం సిబ్బందిలో ఇద్దరు ఒఇఎం (ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ మాన్యుఫ్యాక్చర్)కు చెందినవారు.ఈ దుర్ఘటనపట్ల రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఎక్స్ వేదికగా తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో ఎన్నో విలువైన ప్రాణాలకు నష్టం వాటిల్లిందని సంతాపం తెలియజేశారు. వారికి మంచి చికిత్స అందించాలని కోరారు. ''నా హృదయపూర్వక సంతాపం మృతుల కుటుంబాలకు తెలియజేస్తున్నాను, విస్తారంగా భారీ గాలింపు చర్య కొనసాగుతోంది, భారత నావికాదళం, తీర ప్రాంత గస్తీ సిబ్బందిని మోహరించాం, ఇంకా చాలామంది రంగంలోకి దిగి జాడ తెలియకుండా పోయినవారికోసం గాలింపు చేస్తున్నారు'' అని రాజ్‌నాథ్ సింగ్ ఎక్స్ వేదికగా వివరణ ఇచ్చారు.

## కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు

(మూడవ పేజీ తరువాయి)

కార్యకర్తగా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పలు బాధ్యతలు నిర్వహించి, 2023లో జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన తొలి తెలుగు సాహితీవేత్తగా గుర్తింపు పొందారు. 1972లో సమిధ అనే కవితతో తన సాహితీ ప్రస్థాన ప్రారంభించారు.వారి తొలి గ్రంథం 'అనేక' 2004లో ప్రచురితం కాగా, విదిత 2014 ప్రచురణయింది. దీపిక 2021లో ప్రచురణ తెచ్చారు. దీపికలో పూర్తి సాధికారిత కనిపిస్తుంది. 'దీపిక'లో దర్శించిన విషయాలపై వోరప్రసాద్ (సాహితీ స్రవంతి) ఇలా వ్యాఖ్యానించారు... 'తొలి మలి తరం తెలుగు కథలు' సంకలనం గురించి వివరంగా చర్చించింది. తప్పులకు రుజువులు చూపిస్తూ సరి చేసిన వ్యాసం విలువైన సమాచారం ఇస్తుంది. పివి నరసింహారావు కాడిన 'గొల్ల రామవ్వ' కథను హరితకాంశాల నేపథ్యంలో విశ్లేసించారు. గురజాడ సాహిత్యం పర్గీకరణలు రాయలును యుగకర్త అనడములోని సాహిత్య కులము బయట పెట్టారు. 'వైతాళికులు' సంకలనం వివాదంలో విస్మరణకు గురైన కవితా సంకలనం 'కల్పన'ను పాఠకులకు పరిచయం చేశారు. పరిశోధకులకు ఈ దేవీక నిజంగానే కరదీపిక. పెనుగొండ వారికి తెలుగు సాహిణ్యానికి వారు చేసిన పనికి గాను అజో విభో కందాళం వారి 'జీవన సాఫల్య పురస్కారం లభించింది. గతంలో ఆధికార భాషా సంఘం వారి తెలుగు బాషా పురస్కారం (2003)లో, ప్రజాకవి సుంకర సత్యవారాయణ స్మారక పురస్కారం (2003) వారి సాహిత్య కృషికి గుర్తింపుగా లభించాయి. సాహిత్య తైలంతో సదా వెలుగొంటే చల్లని దీవం అతను. వరకే పరిమితం కాని పెద్ద చుట్టుకొంత గల జీవిత వృత్తాన్ని వృత్తాంతాన్ని గీసుకొన్నాడు. పెనుగొండ. సరియంలో అతని వెలుగు నీడల బాజ్యం, బాంధవ్యం స్నేహ సమూహం, పరిచయాల సమాజు ఇందెన్నెన్నో ఉన్నాయి' అని ముక్తాయించారు కేంద్ర సాహిత్య అకాడమీ గ్రహీత, ప్రముఖకవి, కథకుడు పాపినేని శివశంకర్ స్థానిక చరిత్ర, సంస్కృతులు బృహత్ చకెత్రలో అంతర్భాగాలు బృహత్ చరిత్ర నిర్మాణానికి ఇది దోహదం చేసి, సుసంపన్నతను సమగ్రతను చేకూరుస్తాయి అన్ని వకుళాభరణం. రామకృష్ణ వ్యాఖ్య పెరుగొండ లక్ష్మీ నారాయణకి బాగా నప్పుతాలు ఎందుకంటే ఒకరు సాహితీవేత్త ఇవటమే గాక, సాహితీ దరిత్రకారుడు కూడా ఆపటం చాలా విశేషం.

**ఎస్వీ అభినందనలు**

పెనుగొండ లక్ష్మినారాయణకు జాతీయ సాహిత్య అకాడమి అవార్డు లభించడం పట్ల అభ్యుదయ రచయితల సంఘం జాతీయ నాయకులు, తెలుగు విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్వీ సత్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు. ఆయన రచించిన 'దీపిక' వ్యాస సంపుటికి అవార్డు దక్కడం పట్ల ఒక ప్రకటనలో అభినందనలు తెలియజేశారు.

# కెనడాలో ముదిరిన రాజకీయ సంక్షోభం





**ఒట్టావా :** కెనడా మంత్రివర్గంలో సీనియర్ మంత్రి రాజీనామాతో ప్రధానమంత్రి జస్టిన్ ట్రూడో ప్రభుత్వంలో రాజకీయ సంక్షోభం ముదిరిపోయింది. ఆయన భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. కెనడా ఆర్థికమంత్రి, మాజీ ఉప ప్రధానమంత్రి క్రిస్టియానా ఫ్రీలాండ్ గడచిన సోమవారంనాడు మంత్రివర్గానికి ఆకస్మికంగా రాజీనామా చేశారు. ప్రధానమంత్రి జస్టిన్ ట్రూడోతో తీవ్రంగా విభేదిస్తూ ఆయనకు ఫ్రీలాండ్ ఒక బహిరంగ లేఖ రాశారు. కెనడానుండి అమెరికాకు వెళ్ళే సరుకులపై టారిఫ్‌లను గణనీయంగా పెంచుతామని కాబోయే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన హెచ్చరికతో ఆమె తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ట్రూడో ఆలోచనలతో ఆమె విభేదించారు. ట్రంప్ విధానాలవల్ల కెనడా దేశ ఆర్థిక వ్యవస్థకు అతిపెద్ద సవాలు ఎదురవుతువందని ఆమె తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. దేశ ఆర్థికవ్యవస్థకు తీవ్ర నష్టం కలిగే ఈ సంక్లిష్టపరిస్థితుల్లో ట్రూడో ఈ పరిస్థితులను తట్టుకుని నిలబడగలరా?లేదా? అని ఆయన సొంతపార్టీ లిబరల్‌పార్టీలోనే తీవ్ర సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. దీంతో ట్రూడో భవిష్యత్తు సందేహంలో పడింది. జస్టిన్ ట్రూడో 2013 నుండీ లిబరల్‌పార్టీ నాయకుడుగా, 2015 నుండీ దేశ ప్రధాన మంత్రిగా కొనసాగుతున్నారు. కొత్త నాయకుడు నియమితుడైతే ట్రూడో తన పదవిని వదులుకోవాల్సి వస్తుంది. ఐతే స్వచ్ఛంధంగా పదవి నుండి వైదొలగుతానని ట్రూడో ఎలాంటి సంకేతాలు ఇవ్వడంలేదు. గడచిన అక్టోబరులోనే 24 ఎంపీలు ట్రూడోను రాజీనామా చేయాలని కోరుతూ లేఖరాయడంతోనే ఆయనకు సమస్యలు మొదలయ్యాయి. ప్రతిపక్ష కన్జర్వేటివ్‌లు సభలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు చాలా రోజులుగా ప్రయత్నం చేస్తున్నారు.

## భారత్ టెక్ వర్కర్లకు మేలు చేసిన బైడెన్

**వాషింగ్టన్ :** విదేశీ వర్కర్లను ఉద్యోగాల్లోకి తీసుకునే అమెరికా కంపెనీలు సులభంగా వారిని రిక్రూట్ చేసుకోవడానికి వీలుగా వీసా నిబంధనలను జో బైడెన్ ప్రభుత్వం సడలించింది. మరో నెలరోజుల్లో పదవి నుండి వైదొలగుతున్న బైడెన్ తాజా నిర్ణయం తీసుకున్నారు. హెచ్–1బి వీసా నిబంధనలను సడలించారు. ట్రంప్ అధికారంలోకి వస్తే ఈ మొత్తం వీసాల వ్యవహారం తలక్రిందులవుతుందని, విదేశీ ఉద్యోగుల భవిష్యత్తు కూడా అగమ్యగోచరం అవుతుందని వార్తలు వస్తున్న తరుణంలో బైడెన్ యంత్రాంగం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంవల్ల భారతీయ టెక్ వర్కర్లకు, వారి కుటుంబీకులకు కూడా మేలు జరుగుతుంది. భారత్,చైనా దేశాలపైనే అమెరికాలో వేలాది టెక్ కంపెనీలు ఆధారపడి ప్రతి ఏడాదీ వేలాదిమంది ఉద్యోగులను రిక్రూట్ చేసుకుంటున్నాయి. డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌లాండ్ సెక్యూరిటీ (డిహెచ్ఎస్) బుధవారం నాడు ఈ వీసా నిబంధనల సడలింపుపై ఒక ప్రకటన చేయడంతో భారతీయ టెక్ ఉద్యోగులకు ఎంతో ఊరట లభించింది. ఈ వీసా నిబంధనల మార్పులవల్ల అమెరికాలో ఉన్న టెక్ కంపెనీలకు ఎంతో లాభం కలుగుతుంది. కంపెనీలు వారి వ్యాపార అవసరాలకు అనుగుణంగా ఉద్యోగులను హైర్ చేసుకోవడానికి వీలు కలుగుతుంది. దీనికి సంబంధించిన దరఖాస్తుల ప్రక్రియ చాలా వేగంగా జరుగుతుందని యుఎస్‌సిఐఎస్ (యుఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్) తెలియజేసింది. ఈ మేరకు వచ్చే ఏడాది జనవరి 17 నుండీ కొత్త ఎడిషన్ ఫారం ఐ–129 అమలులోకి వస్తుంది. యుఎస్‌సిఐఎస్ ద్వారా ఏటా 65వేలమంది హెచ్–1బి వీసాలను మాత్రమే పరిమితంగా ఇస్తున్నారు.

## ఇక భూ భారతి (మూడవ పేజీ తరువాయి)

రైతులకు లక్షలాది సమస్యలు వచ్చాయన్నారు. కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలిక ఊడిందన్నట్లు ధరణి పోర్టల్‌తో లెక్కలేనన్ని ఇబ్బందులు ఎదురయ్యాయని వివరించారు. ఇచ్చిన మాట ప్రకారం, ఇద్దరు వ్యక్తులు తయారు చేసిన ధరణి, ఆర్‌ఓఆర్ చట్టాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రక్షాళన చేసిందన్నారు. 2020 చట్టంలో ప్రధాన పాత్ర పోషించిన తన్నీరు హరీశ్ రావు, మాజీ ఎంపి వినోద్‌కుమార్‌లు లిఖితపూర్వకంగా ఇచ్చిన సూచనలు కూడా స్వీకరించామన్నారు. ఒక చట్టంపై ప్రజల నుంచి అభిప్రాయాలను స్వీకరించడం రాష్ట్ర చరిత్రలో ఇదే ప్రథమమన్నారు.

**దొరల గడీల్లో తయారు చేసిన 2020 చట్టాన్ని ప్రక్షాళన చేశాం**

దొరల గడిల్లో కూర్చుని తయారు చేసిన 2020 ఆర్‌ఓఆర్ చట్టాన్ని పూర్తిగా ప్రక్షాళన చేశామని, దేశంలోని 18 రాష్ట్రాల్లో ఆర్‌ఓఆర్ చట్టాలు పరిశీలించి, భూ భారతి తీసుకువచ్చినట్లు మంత్రి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ, నాటి ప్రతిపక్షనేత, నేటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నేటి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తమ పాదయాత్రల సందర్భంగా ధరణిని అరేబియా సముద్రంలో కలుపుతామని ఇచ్చిన హామీని ప్రజలు విశ్వసించారని మంత్రి పొంగులేటి తెలిపారు. ఆ పోర్టల్‌ను బంగాళాఖాతంలో వేస్తామని హామీ ఇచ్చామని, ఇప్పుడు వేస్తున్నామని, ధరణి స్థానంలో భూ భారతిని తీసుకువస్తున్నట్లు చెప్పారు. ముసాయిదా బిల్లును 40 రోజులు వెబ్‌సైట్‌లో ఉంచామని, ఎంఎల్ఎలు, మేధావులు ఇచ్చిన అంశాలను ముసాయిదాలో పెట్టామని, 33 కలెక్టరేట్‌లలో ఒకరోజు చర్చ కూడా పెట్టారని వివరించారు. గతంలో అర్ధరాత్రి ధరణి పోర్టల్‌ను తీసుకువచ్చారని, ఆ పోర్టల్ కారణంగా 4 నెలలు రిజిస్ట్రేషన్లు జరగలేదని గుర్తుచేశారు. బేషజాలకు పోయి ధరణిని మార్చడం లేదని, ధరణిలోని మంచిని స్వీకరిస్తామన్నారు. ఇప్పటివరకు 23 సార్లు అభిప్రాయాలు తీసుకున్నామని, అందువల్లే బిల్లు ప్రవేశపెట్టడంలో ఆలస్యమైందని అన్నారు. ప్రజలకు పూర్తిస్థాయిలో ఉపయోగపడేలా బిల్లును రూపొందించేందుకు కృషి చేశామని, సాదాసీదా బిల్లును ప్రజలపై రుద్దే ఆలోచన తమ ప్రభుత్వానికి లేదని మంత్రి స్పష్టం చేశారు.

**బిఆర్ఎస్ ఎంపిటిసి కూడా బాధితుడే**

ధరణి కారణంగా ఎంతోమంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, కేసముద్రం మండలం నారాయణపురం గ్రామానికి చెందిన దరావత్ రవి అనే బిఆర్ఎస్ ఎంపిటిసి సభ్యుడు తన వద్దకు వచ్చారని మంత్రి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. ఆ గ్రామంలో సర్వే నంబర్ 149, 150, 154, 156, 168 లో ఉన్న 1398 ఎకరాల భూమి తరతరాలుగా అక్కడి గిరిజనుల సాగుబడిలో ఉన్నాయని, ధరణి వచ్చాక అటవీ భూమిగా మార్చారని ఆయన తెలిపారని, బిఆర్ఎస్ స్థానిక ప్రజాప్రతినిదులకే ధరణి న్యాయం చేయలేదని, అలాంటి వారికి న్యాయం చేసేలా కొత్త చట్టం తీసుకువచ్చామని మంత్రి వివరించారు. దాదాపు 18 లక్షల ఎకరాలు పార్ట్ బి లో ఉందని, గతంలో ఆ భూమికి పాస్ బుక్కులు ఉంటే ఎందుకు పార్ట్ బిలో చేర్చారని మంత్రి ప్రశ్నించారు. కొత్త చట్టం ద్వారా పార్ట్ బి లోని భూముల సమస్యలు పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

**భూ భారతిలో ఆరు మాడ్యూల్స్..**

గతంలో ధరణిలో 33 మాడ్యూల్స్ ఉండేవని, భూ భారతిని ఆరు మాడ్యూల్స్‌లోకి ప్రక్షాళన చేస్తున్నామని మంత్రి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. ధరణి పోర్టల్‌లో ఆస్తుల వివరాలు చూసుకునే పరిస్థితి లేదని, కొల్లగొట్టిన భూములను సీక్రెట్ లాకర్ ధరణిలో పొందుపర్చారని మంత్రి ఆరోపించారు. కొత్త చట్టంలో ప్రతి భూమి వివరాలు పొందుపరుస్తున్నామని, ప్రభుత్వ భూముల కబ్జాపై భూ భారతి ద్వారా ఫిర్యాదు చేసే అవకాశముందని మంత్రి వెల్లడించారు.

**అబాది, గ్రామకంతం భూములకు పరిష్కారం**

అబాది, గ్రామకంతం భూములకు పరిష్కారాలు ఈ కొత్త చట్టంలో ఉన్నాయని మంత్రి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. ఇక నుంచి ప్రతి ఏటా జమాబందీ నిర్వహిస్తామని, ప్రతి గ్రామానికి ఓ రెవెన్యూ అధికారిని నియమిస్తామని, అనుభవదారుల కాలాన్ని కూడా ఈ కొత్త బిల్లులో పొందుపరిచామన్నారు. పొజిషన్‌కు, పాసుబుక్కులో ఉన్న భూ విస్తీర్ణ వ్యత్యాసాలను సరిచేసే అవకాశం ఉందన్నారు. మ్యుటేషన్‌పై అభ్యంతరాలు ఉంటే ఆర్‌డిఓ ఆధ్వర్యంలో అప్పీల్ అథారిటీని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వారసత్వ ఆస్తుల అభ్యంతరాలపై అప్పీల్ అథారిటీకి వెళ్లే అవకాశం ఉంటుందన్నారు. క్రాస్ చెక్ చేసి మ్యూటేషన్ చేసే అధికారం ఆర్‌డిఓకు కొత్త చట్టంలో కల్పిస్తుందన్నారు. సభ్యుల నుంచి మంచి సూచనలు వస్తే ఈ బిల్లులో చేర్చడానికి తమకు ఎలాంటి బేషజాలు లేవని మంత్రి స్పష్టం చేశారు. ఎంఆర్‌ఓ రిజిస్ట్రేషన్ చేస్తారని, ఆర్‌డిఓ, కలెక్టర్ అప్పీల్ అథారిటీగా ఉంటారన్నారు. ఆ తర్వాత అప్పీల్ చేసుకోవడానికి ఒక ట్రిబ్యునల్ కూడా ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. 2020కి ముందు 9,24,000 సాదాబైనామా దరఖాస్తులు చేసుకున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

**మానవ సంబంధాలను దెబ్బతీసిన ధరణి**

మానవ సంబంధాలను సైతం ధరణి దెబ్బతీసిందని, మనుషుల మధ్య దూరాన్ని పెంచిందని మంత్రి శ్రీనివాస్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. భూ యజమానికి తెలియకుండానే చేతులు దాటిపోయేలా చేసిందని, అందుకే తమ నాయకుడు రాహుల్ గాంధీ ఎన్నికల సమయంలో ధరణిని సముద్రంలో వేస్తామని హామీ ఇచ్చారని, ధరణిని బంగాళాఖాతంలో కలిపి ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్నామని మంత్రి అన్నారు.

## ప్రతి జిల్లాకూ ఓ ఐఎఎస్

(మూడవ పేజీ తరువాయి)

కార్యక్రమాలు, నిర్ణయాలు అక్షరాల అమలు జరిగేలా చూడాలని,అప్పుడే విద్యారంగం బాగుపడుతుందన్నారు. విద్యారంగంపైన గత సిఎం కెసిఆర్ చాలా కలలుకన్నప్పటికీ, ఆయన ప్రధాన్యాతలు మారిపోయాయయని, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలో కసి కనిపిస్తుందని, అంకితభావం ఉన్నదని చెప్పారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థపై నిఘా లేదని, విద్యాసంస్థలపైన, అధ్యాపకులు ఏం చేస్తున్నారో దృష్టి పెట్టడం లేదన్నారు. శాసనభలో ''గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పన'' అనే అంశంపై బుధవారం జరిగిన స్వల్పకాలిక చర్చలో కూనంనేని సాంబశివరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ప్రభుత్వమైనా విద్యారంగాన్ని బాగు చేయాలని కోరుకుంటుందన్ని, ఇందులో భాగంగానే మొదట్లో అధికారంలోనికి వచ్చినప్పుడు కెసిఆర్‌లో చాలా తపన కనిపించిందని, ప్రతి స్కూల్‌లో సిఎం పిల్లలు, ఒక సామాన్యుడి పిల్లులు చదివేలా ' కామన్ స్కూల్ 'విధానం ఉండాలని చెప్పిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వ కలలు పెద్దగా ఉంటాయని, కానీ ఆ కలలను సాకారం చేసుకునే ప్రయత్నాలు మాత్రం చాలా చిన్నగా ఉంటాయన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి చదవలేదని, ఇంగ్లీష్‌లో మాట్లాడలేరని అప్పుడప్పుడు చెబుతారని, కానీ ఆయన బాగానే మాట్లాడుతారని , తప్పు ఏం మాట్లాడలేదని, ఒక ప్రభుత్వ పాఠశాలలో చదవి పట్టుదలతో సిఎం స్థాయికి వచ్చారన్నారు. విద్యారంగాన్ని అభివృద్ధి చేయాలనే పట్టుదల సిఎంలో కనిపిస్తుందన్నారు. విద్యారంగాన్ని బాగు చేయాలనే కాంక్ష, కోరిక ఒక సిఎంకు ఉంటే సరిపోదని, పై నుంచి కింది వరకు తపన ఉండాలని సూచించారు. దేశంలో, రాష్ట్రంలో ఆరంభం గొప్పగా ఉంటుందని, కానీ దీనిని అనుభవం, ఆచరణలో ఎవ్వరూ సిరీయస్‌గా తీసుకోబోరని అన్నారు. భారతదేశంలో సంపద ఉన్నప్పటికీ అనేక దేశాల కంటే విద్యారంగంలో వెనుకబడ్డామని, విద్యారంగంలో ఏ సమాజం, ఏ దేశం వెనుకబడుతుందో?, ఆ దేశం మిగిలిన చిన్న దేశాలతో పోటీ పడలేమని ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు అయినప్పటికీ అక్షరాస్యత 67 శాతం, ఇందులో చదవడం, రాయడం వచ్చిన లెక్కల ప్రకారం వాస్తవంగా పరిశీలిస్తే సొంతభాష తెలుగు లేదా ,ఇంగ్లీష్ వంద శాతం చదవడం,రాసేవారి సంఖ్య 10 నుంచి 15శాతం లేరని అంచనా అని అన్నారు. విద్యా వ్యవస్థను బాగు చేయడంలో అనేక మంది అనేక రకాలుగా వారి వారి ఆలోచనలు, దృక్పథాన్ని బడ్జెట్ రూపంలో ,మరోరూపంలో తీసుకొచ్చినప్పటికీ ఎందుకు విఫలమమవుతున్నామో గమనించాలన్నారు.

**ప్రభుత్వానికి పాలసీ లేదు**

ప్రభుత్వానికి పాలసీ లేదని, అందుకే టీచర్లు సంతోషంగా లేరని,టీచర్ల బదలీలు,వారు ఎప్పుడు ఎక్కడ ఉంటారో తెలియదని, అభద్రతాభావంతో ఉంటారని, కుటుంబంతో గడిపే పరిస్థితి కూడా ఉండబోదని, దీంతో వారు మనస్ఫూర్తిగా పిల్లలకు పాఠాలు చెప్పలేని పరిస్థితిలో ఉంటారని కూనంనేని సాంబశివరావు తెలిపారు. ప్రభుత్వ టీచర్లు, లెక్చరర్లు, డిఎస్‌సి పోటీ పరీక్షల ద్వారా నియమితులవుతారని, అయినా ప్రభుత్వ పాఠశాలు ఫలితాలు ఎందుకు తక్కువగా ఉంటున్నాయని ? ప్రశ్నించారు. ఒక పేద, ఆటో నడిపించుకునే వారు కూడా ప్రభుత్వ పాఠశాలకు పంపించేందుకు బిడియపడుతున్నారని, అదే ప్రైవేటు పాఠశాలలోచేరిపించేందుకు సంతోషపడుతున్నారని తెలిపారు. స్టాండెవిస్‌కంట్రీస్‌లో విద్యారంగానికి ఎక్కువ ప్రధాన్యత ఇస్తారని, ఐఎస్‌లకు సమానంగా ఉపాధ్యాయులకు వేతనాలు ఇస్తారని, ఇక్కడ కూడా ప్రస్తుతం జీతాలు బాగానే ఇస్తున్నప్పటికీ వారిని పర్యవేక్షించడంలో ఎక్కడ వైఫల్యం చెందుతున్నామో సీరియస్‌గా ఆలోచించాలని సూచించారు. పాఠశాలలో టిఆర్ఎస్ ప్రభుత్వం మన బడి, మన ఊరు సగం వరకే పూర్తయ్యాయని, వాటిని పూర్తి చేయాలా? లేదా అనేది ప్రస్తుత ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలని, ఆ తర్వాత ఆదర్శ పాఠశాలలను దృష్టి పెడితే బాగుంటుదని సూచించారు. అనేక నిధులను ఖర్చుపెడుతున్నప్పటికీ పాఠశాలల్లో విద్యార్థులు,టీచర్లు వెళ్లేందుకు కనీసం మరుగుదొడ్లు కూడా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలలకు ప్రహారీ గోడ లేదని, అక్కడ పశువులుపడుకుంటాయని, స్వీపర్లను కూడా నియమించే పరిస్థితి లేదని , ఎక్కడో వైఫల్యం చెందుతున్నామని,ప్రభుత్వం పెడుతున్న ఖర్చులకు, క్షేత్ర స్థాయిలో అమలు తీరకు మధ్య తేడా కనిపిస్తోందన్నారు.

**ఖాళీ పోస్టులను భర్తీ చేయండి**

ఖాళీలను భర్తీ చేసేందుకు ప్రయత్నించాలని, గురుకులాల్లో 772 హెడ్‌మాస్టర్, ఎస్‌జిటి పోస్టులలో 10,669,లాంగ్వేజ్ పండిత్‌లో 7046 , టిఎటి 378, ఇతర పోస్టులు 1006 మొత్తం 20,463 ఖాళీగా ఉన్నాయని కూనంనేని వివరించారు. సర్వ శిక్ష అభియాన్ 20 రోజులుగా వారు రోడ్లపైనే ఉన్నారని, వారు 19వేల మంది ఉంటారని, మినిమమ్ టైమ్‌స్కేల్ కూడా లేకుండా ఇబ్బందిపడుతున్నామని తెలిపారు. ఇటువంటివి పరిష్కరించాల్సిన అవసరం ఉన్నదన్నారు. మిడ్ డే మీల్స్‌లో మొత్తం బడ్జెట్ రూ. 666 కోట్లలో రూ. 322 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారని, తమ ఉద్యోగాలు పర్మినెంట్ అవుతుందనే ఆశతో వారే అప్పులు చేసి అన్నం వండుకుంటున్నారని వివరించారు. ఇటువంటి అంశాలు కూడా విద్యారంగంపైన ప్రభావం చూపుతన్నాయన్నారు.సెకండరీ ఎడ్యుకేషన్‌లో డ్రాప్ అవుట్ 11.95 శాతం ఉన్నదన్నారు. 90,690రూములు అవసరమని, 26వేల స్కూల్స్‌లో తాగునీటి సౌకర్యాలు లేవని, 25,508 స్కూల్స్‌లో, 25,259 బాలికలపాఠశాలలో మరుగుదొడ్లు లేవని, 26వేల పైచిలుకు పాఠశాలల్లో ప్రహరిగోడలు లేవని, 26వేల పైచిలుకు పాఠశాలల్లో ప్లేగ్రౌండ్స్ లేవని, ఇటువంటి అనేక ఇబ్బందులు ఉన్నాయన్నారు. 672 గురుకులాలకు సొంత భవనాలు లేవని, అద్దె భవనాల్లో ఇరుకైన గదులు ఉంటాయని తెలిపారు. ప్రస్తుత గురుకులాల సమయాన్ని 9గంటల నుంచి 8గంటలకు మార్చారని, దీంతో తక్కువ మరుగుదొడ్లు ఉండడం ద్వారా ఒక బాత్‌రూములో 30 మంది విద్యార్థులు పోవాల్సిన పరిస్థితి నెలకొన్నదని, ఆలస్యమైతే టిఫిన్ అందదనే ఉద్దేశంతో కొందరు విద్యార్థులు స్నానాలు కూడా చేయకుండా వెళ్తున్నారని చెప్పారు. ఇటువంటివి చిన్న సమస్యలేనని దీనిపైన దృష్టి పెట్టేవారు లేరన్నారు. ఏ ప్రభుత్వమైనా విద్యార్థులకు చదవు బాగా చెప్పించాలని, బాగా ఉండాలనే అందరూకోరుకుంటారన్నారు. అమలు తీరులోనే తేడా వస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ద్వితీయ శ్రేణి పిల్లలుగా బావిస్తుంటే, హాస్టల్స్‌లో చదివేవారు మరింత తక్కవగా బావిస్తున్నారన్నారు. విద్యార్థులకు ఉపాధ్యాయులే తల్లిదండ్రులని, 24 గంటలు మన ఆదీనంలో ఉంటారని, ఎంతో బాగా చూసుకోవచ్చన్నారు. విద్యార్థులకు బట్టలు ఎలా ఉన్నాయో?, హాస్టల్స్‌లో తెల్లబట్టలు ఉన్నవారు ఎంత మంది కనిపిస్తారోచూడాలన్నారు. అక్కడ చదవడం ద్వారా ఆత్మాభిమానంతోపాటు పైకి వస్తానని భావన కంటే, ఆ విద్యార్థుల్లో ఆత్మన్యూనత ఉంటుందని, దీనిని సరిచేసుకోవాలని,విద్యా విధానాన్ని బాగుచేసుకోకుండా దేశం, సమాజం బాగుపడబోదని చెప్పారు.ఆరు లక్షల మంది విద్యార్థులను బారంగా బావించి వారిని తయారు చేస్తే వారు కుటుంబాలకు నష్టమని, వారిని వజ్రాలుగా తయారు చేయాలని సూచించారు. రాధాకిషణ్ కోటారి, కమిషన్లు సూచనలుచేశాయని, వాటిని అమలు విద్యా రంగంపైన సిఎం కెసిఆర్‌కు తపన ఉన్నప్పటికీ ఆయన వైఫల్యం చెందారని, సిఎంరేవంత్ రెడ్డికి తపన ఉన్నదని, కానీ వైఫల్యం చెందకూడదని ఆకాంక్షించారు. ఈ తపన మంత్రులకు వారి వారి శాఖలపైన కూడా ఉండాలని, ఎవరి శాఖ మంత్రులకు సేచ్ఛ ఉండాలని, ఐఎఎస్, విద్యా రంగ అధికారులు, ఉన్నతాధికారులు అంకితభావంతో పనిచేయాలని, వారికి తపన ఉండాలని, ఉద్యోగం అయిపోయిందనే విధానం కాకుండా తమను తాము విద్యారంగానికి అరిపించుకోవాలని, ఈ రంగంలో పనిచేయడం గొప్ప అదృష్టంగా బావించాలని సూచించారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి : మునిసిపల్ కమిషనర్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్:** ప్రభుత్వం సూచించిన విధంగా విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు. బుధవారం ఖమ్మం నగరంలోని డా. బిఆర్ అంబేద్కర్ కళాశాలను మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, శిక్షణ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ తో కలిసి సందర్శించారు. అక్కడి విద్యార్థినిలతో వారు ముచ్చటించారు. ఎక్కడ నుంచి వచ్చారు, ఏమి చదువుకుంటున్నారు, భోజనం ఎలా ఉంటుంది, మెనూ ప్రకారం పెడుతున్నారా వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నాణ్యమైన విద్యను అందించడంతో పాటు రుచికరమైన భోజనాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటుందని వారు తెలిపారు. ప్రభుత్వం సూచించినవిధంగా మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. విద్యార్థినిలు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరేలా కష్టపడాలని తెలిపారు.

## 20న జాబ్‌మేళా

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** జిల్లాలోని యువతీ, యువకులకు ప్రైవేట్ రంగమైన హెటిరో నెక్సిటి, ముత్తూట్ మైక్రో ఫిన్ లిమిటెడ్‌లో ఉద్యోగాలు కల్పించుటకు ఈనెల 20న జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎన్.మాధవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20న శుక్రవారం ఉదయం 10 గంటలకు మోడల్ కెరీర్ సెంటర్ (ప్రభుత్వ ఐటిఐ, ఖమ్మం నందు జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. హైదరాబాద్‌లోని హెటిరో నెక్సిటిలో ప్రోడక్షన్, సపోర్ట్ (20 ఖాళీలు), ఇంజనీరింగ్, మెయింటినెన్స్ (50 ఖాళీలు), ప్రోడక్షన్ (110 ఖాళీలు) ఉద్యోగాలకు, అదేవిధంగా ముత్తూట్ మైక్రో ఫిన్ లిమిటెడ్ ఖమ్మంలో రిలేషన్ షిప్ ఆఫీసర్ (30 ఖాళీలు), బ్రాంచ్ క్రెడిట్ మేనేజర్ (5 ఖాళీలు), బ్రాంచ్ రిలేషన్ షిప్ ఆఫీసర్ (5 ఖాళీలు) ఉద్యోగాలు భర్తీ చేయుటకు జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. 18 నుండి 30 సంవత్సరాల వయస్సు గల ఇంటర్, ఐటిఐ, ఫిట్టర్, ఎలక్ట్రికల్, మెకానికల్, కెమికల్ డిప్లొమా, ఎంబిఏ, ఏదైనా డిగ్రీ అర్హత గల జిల్లాలోని నిరుద్యోగ యువతి, యువకులు విద్యార్హత గల సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో జాబ్‌మేళాకు హాజరు కావాలన్నారు. వివరాలకు 8121040350, 9966077622 నెంబర్లను సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారిని తెలిపారు.

## రేపటినుంచి యోగా ధ్యానోత్సవం

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** యూనైటెడ్ నేషన్స్ డిసెంబర్ 21న ప్రపంచ ధ్యాన దినోత్సవంగా ప్రకటించినందున శ్రీరామచంద్ర మిషన్ హార్ట్‌ఫుల్ నెస్ సంస్థ ఖమ్మం ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి 22 వరకు రఘునాథపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఉచిత యోగా, ధ్యాన శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వహకులు శ్రీనివాసరావు, బి.వీరబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 21 నుంచి 22 వరకు సాయంత్రం ఐదు గంటల నుండి ఏడు గంటల వరకు నిర్వహించే యోగా, ధ్యాన శిక్షణ కార్యక్రమంలో 15 సంవత్సరాలు దాటిన వారందరూ పాల్గొనవచ్చునని వారు తెలిపారు. వివరాలకు 9989606020, 9666022617, 8897785484 నెంబర్లను సంప్రదించాలని నిర్వహకులు తెలిపారు.

## క్లినికల్ అప్రెంటిషిప్ శిక్షణకు దరఖాస్తు

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఇంటర్మీడియట్ ఎంపిహెచ్‌డబ్ల్యూ (ఫిమేల్) ఒకేషనల్ కోర్సులలో ఉత్తీర్ణులైన విద్యార్థినిలకు ఒక సంవత్సరం క్లినికల్ షిప్ శిక్షణ కొరకు ఈనెల 23లోగా దరస్తు చేసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె.రవిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సత్తుపల్లి, మధిర, తిరుమలాయపాలెం ఏరియా ఆసుపత్రుల్లో శిక్షణ అందించనున్నట్లు ఎంపికైన వారు రూ.1,000 డిడి రూపంలో చెల్లించాలని, గతంలో దరఖాస్తు చేసుకుని ఎంపిక కాని వారు కూడా తాజాగా దరఖాస్తు చేసుకోవచ్చునని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థినిలు తమ బయోడేటా ఫారంతో రూ.10 పోస్టల్ స్టాంప్ అతికించిన సొంత చిరునామా కవర్, సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలను జతపరిచి సమీకృత కలెక్టరేట్‌లోని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కార్యాలయంలో ఈనెల 23లోగా అందజేయాలని కోరారు.

## రోడ్డు ప్రమాదంలో విద్యార్థిని మృతి



**ప్రజాపక్షం/వైరా:** వైరాలోని తెలంగాణ గురుకుల పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న చెరుకూరి హర్షశ్రీ రోడ్డు ప్రమాదంలో బుధవారం మరణించింది. వివరాల్లోకి వెళితే రఘునాథపాలెం మండలం కోయచిలక గ్రామానికి చెందిన చెరుకూరి వీరబాబు, నాగమణి దంపతులకు ఇద్దరు కూతుళ్ళు, పెద్ద కుమార్తె చెరుకూరు హర్షిని(13) వైరాలో తెలంగాణ గురుకుల పాఠశాలలో సెవెంత్ క్లాస్ చదువుతుంది. తండ్రి చెరుకూరి వీరబాబు అయ్యప్ప స్వామి మాల ధరించడంతో ఈ నెల15వ తారీఖున వారి ఇంటి వద్ద ఉన్న పడిపూజ కార్యక్రమానికి కూతురు తీసుకొని వెళ్లారు. బుధవారం తండ్రి ఇరుముడి కార్యక్రమం కావడంతో తండ్రి శబరిమలై బయల్దేరి వెళ్లగా కూతురు శ్రీహర్షశ్రీని మేన మామ శ్రీకాంత్ వైరా గురుకుల పాఠశాలకు పంపించడానికి తీసుకొని వస్తున్న క్రమంలో వైరాలో లారీ ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ద్విచక్ర వాహనంపై ఉన్న హర్షశ్రీ ఒక పక్క శ్రీకాంత్, మరో పక్క పడిపోవడం జరిగింది. హర్షశ్రీ లారీ టైర్ క్రింద పడిపోవడంతో అక్కడికక్కడే మరణించింది. అప్పటివరకు కుటుంబ సభ్యులతో ఇరుముడి కార్యక్రమంలో ఎంతో ఆనందంగా గడిపిన విద్యార్థిని హర్షశ్రీ మరణించిన విషయం కుటుంబ సభ్యులను , బంధువులను, గ్రామస్థులను కంటతడి పెట్టించి దిగ్భ్రాంతికి గురిచేసింది. విషయం తెలుసుకున్న వైరా పోలీసులు సంఘటనా స్థలం వద్దకు చేరుకొని విచారణ చేపట్టి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యను బలోపేతం చేయడానికి ఉద్దీపకం వర్క్ బుక్స్

**ప్రజాపక్షం/పాల్వంచ:** గిరిజన సంక్షేమ శాఖ ప్రాథమిక పాఠశాలలు. జిపిఎస్ పాఠశాలల్లో చదువుతున్న గిరిజన విద్యార్థినీ, విద్యార్థులకు ఇంగ్లీష్, గణితంలో కనీస సామర్థ్యాలు లేకపోవడం వలన వెనుకబడిపోవడం గమనించానని వారి విద్యను బలోపేతం చేయడానికి ఉద్దీపకం వర్క్ బుక్స్‌ను ప్రవేశపెట్టడం జరిగిందని ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి బి రాహుల్ అన్నారు. బుధవారం పాల్వంచ మండలంలోని నాగారం తండా, తోగూడెం జిపిఎస్ పాఠశాలలను ఆయన సందర్శించి ఉద్దీపకం వర్క్ బుక్స్‌కు సంబంధించిన పాఠ్యాంశాలను విద్యార్థులు ఏ విధంగా చదువుతున్నది, పిల్లలను అడిగి వారి చేత బోర్డుపై రాయించి ఒక్కొక్క విద్యార్థిని లేపి వర్క్ బుక్‌లోని సారాంశాలను పిల్లలలో దాగి వున్న ప్రతిభను నైపుణ్యాలను పిల్లలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సంబంధిత ఉపాధ్యాయులు క్రమం తప్పకుండా పాఠ్యాంశాలను విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించి మరల పిల్లల చేత తోటి పిల్లలకు బోర్డుపై రాయించి చూపెట్టాలన్నారు. కార్యక్రమంలో దమ్మపేట ఏటిడిఓ చంద్రమోహన్, పిజిహెచ్ బద్రు, ఎస్సీ ఆర్‌పి హరి లాల్, ఉపాధ్యాయులు సుజాత, పద్మ, రాంబాబు, పుల్లమ్మ పాల్గొన్నారు.

# భూసేకరణ ప్రక్రియ వేగవంతం

జిల్లాలో చేపడుతున్న ప్రాజెక్టులపై కలెక్టర్ సమీక్ష

**ప్రజాపక్షం/ఖమ్మంఅర్బన్:** జిల్లాలో చేపడుతున్న వివిధ ప్రాజెక్టుల భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులు చర్యలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో అధికారులతో వివిధ ప్రాజెక్టుల భూసేకరణ పురోగతిపై సమీక్షించారు. నేషనల్ హైవే 365 బిజి ఖమ్మం దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్‌కు ప్యాకేజి 1,2,3 లకు సంబంధించి 1358.1650 ఎకరాల భూసేకరణకు గాను 1292.1825 ఎకరాలకు అవార్డు పూర్తి చేసినట్లు నేషనల్ హైవే ద్వారా రూ.362.17 కోట్ల పరిహారాన్ని డిపాజిట్ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. రూ. 355.85 కోట్ల నష్టపరిహారం రైతుల ఖాతాలకు పంపిణీ చేసినట్లు తెలిపారు. ధంసలాపురం వద్ద ఎంట్రీ, ఎగ్జిట్‌కు కావాల్సిన భూసేకరణ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రాజెక్టుల వారీగా చేయాల్సిన భూసేకరణ, పూర్తి చేసినది, ఇంకా చేయాల్సింది, కోర్టు కేసులో ఉన్నది తదితర అంశాలపై కలెక్టర్ అధికారులకు సూచనలు చేశారు. సీతారామ ఎత్తిపోతల పథకం ఏన్కూరు లింక్ కాలువ మిగులు భూసేకరణ పూర్తిపై దృష్టిసారించాలన్నారు. జిల్లాలో వివిధ శాఖల ద్వారా చేపడుతున్న పనుల భూసేకరణకు రెవెన్యూ, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. భూసేకరణ చేసిన ప్రాజెక్టులకు సంబంధించి పనులు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, నేషనల్ హైవే పిడి రామాంజనేయరెడ్డి, ఆర్అండ్‌బి ఎస్ఇ హేమలత, ఆర్డివోలు జి.నర్సింహారావు, రాజేందర్, ఇరిగేషన్, నేషనల్ హైవే అధికారులు తదితరులు పాల్గొన్నారు.



పాడిపశువుల యూనిట్ల గ్రౌండింగ్‌కు చర్యలు

పాడి పశువుల యూనిట్‌ల గ్రౌండింగ్‌కు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఇందిరా మహిళా డెయిరీ, హాస్టళ్లలో చేయాల్సిన ఏర్పాట్లుపై కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ డా. పి.శ్రీజతో కలిసి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరా మహిళా డెయిరీ స్థాపన, పాడి పశువుల యూనిట్లకు 250 మంది లబ్దిదారుల ఎంపిక, వివిధ అంశాలలో అధికారులు బాగా పనిచేశారని కలెక్టర్ అభినందించారు. పాడి పశువుల యూనిట్ల గ్రౌండింగ్‌కు అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. మండల కేంద్రాలలో బిఎంయు ల ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించామని నిధులు మంజూరు కాగానే టెండర్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యే లోపు సంబంధిత స్థలంలో కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే ఇందిరా మహిళా డెయిరీకి ఒక గవర్నింగ్ బాడీ ఏర్పాటుకు రూల్స్ తయారు చేయాలన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలలో చలికాలం నేపథ్యంలో పిల్లలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలని, దోమతెరలు, అవసరమైన దుప్పట్లు, బ్యాంకెట్లను అందుబాటులో ఉంచాలని, స్నానానికి వేడి నీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన సురక్షిత తాగు నీటి సరఫరా కోసం ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటుకు ప్రాతిపదనలు అందించాలన్నారు. పిల్లలకు అందించే ఆహారం విషయంలో చిన్న పొరపాటు జరిగిన తీవ్రంగా పరిగణించడం జరుగుతుందని, ఎటువంటి తప్పులు జరగవద్దని అధికారులకు సూచించారు. సమావేశంలో డిఆర్‌డివో సన్యాసయ్య, డిఎస్‌సి డిఓ కస్తాల సత్యనారాయణ, ట్రైబల్ వెల్ఫేర్ ఉప సంచాలకులు ఎన్.విజయలక్ష్మి , ఎస్ఈ కార్పోరేషన్ ఇంచార్జి ఇడి నవీన్‌బాబు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి పుల్లయ్య, అడిషనల్ డిఆర్‌డిఓ నూరుద్దీన్, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.






మెరుగైన సేవలు అందించేలా విధులు

ప్రజలకు మెరుగైన సేవలు అందేవిధంగా సిబ్బంది విధులు నిర్వహించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని వివిధ కార్యాలయాలను, సెక్షన్లను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ సమస్యలపై కలెక్టరేట్‌కు వచ్చే ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో ఉద్యోగుల కోసం ఏర్పాటు చేసిన భోజనశాలను వినియోగించుకోవాలన్నారు. విధులకు సిబ్బంది సకాలంలో హాజరు కావాలని, సమయ పాలన పాటించాలన్నారు. నిరుపేదలైన లబ్ధిదారులను ఎంపిక చేసి ఇండ్లు మంజూరయ్యేలా చూడాలన్నారు. మనం అధికారులుగా ఉన్న సమయంలో పేదలకు సాయం చేయాలనే ధృక్పథంతో పనిచేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేసే వివిధ సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన లబ్దిదారులందరికీ పూర్తి స్థాయిలో లబ్ధి చేకూరేలా చూడాలన్నారు.

## పకడ్బందీగా ఇందిరమ్మ ఇండ్ల సర్వే వివరాలు నమోదు

ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్:** ఇందిరమ్మ ఇండ్ల సర్వేకు సంబంధించి లబ్ధిదారుల వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలని ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు. బుధవారం ఖమ్మం నగరంలోని పలు డివిజన్లలో మున్సిపల్ కమిషనర్ పలు డివిజన్లలో పర్యటించి ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలించారు. సర్వే చేస్తున్న సిబ్బందితో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరేలా ఇందిరమ్మ ఇండ్ల యాప్‌ను రూపొందించిందని ఆయన తెలిపారు. ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను క్షేత్రస్థాయిలో సేకరించేందుకు సర్వే నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సర్వేకు సంబంధించి లబ్ధిదారుల వద్ద పూర్తి వివరాలు సేకరించి యాప్‌లో నమోదు చేయాలని ఎటువంటి అవకతవకలు లేకుండా చూడాలని అధికారులకు తెలిపారు.

# సంక్షేమ హాస్టళ్లపై సర్కార్ నిర్లక్ష్యం

దానవాయిగూడెం గురుకుల పాఠశాలలో ఎలుక కాటు ఘటనపై విచారణ జరిపించాలి

బాలికకు సిపిఐ, ఎఐఎస్ఎఫ్ నేతల పరామర్శ





**ప్రజాపక్షం/ఖమ్మం :** సంక్షేమ హాస్టళ్ల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని క్షేత్ర స్థాయిలో హాస్టళ్ల పరిస్థితిని తెలుసుకుని తదనుగుణంగా చర్యలు చేపట్టాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు డిమాండ్ చేశారు. క్షేత్రస్థాయి అధికారుల తప్పిదాలు విద్యార్థుల పాలిట శాపంగా మారుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఎలుక కాటుకు గురై మమత ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మి భవాని కీర్తిని ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పదే పదే ఎలుకలు కాటేస్తుంటే చర్యలు తీసుకోకపోవడం శోచనీయమని దానవాయిగూడెం గురుకుల పాఠశాల సిబ్బంది ఎలుకలు కరిస్తే ఉండలేకపోతే ఇంటికి వెళ్లవచ్చునని బెదిరింపు ధోరణిలో మాట్లాడడం శోచనీయమన్నారు. ఎలుక కరిచినందు వల్ల యాంటీ ర్యాబీస్ వ్యాక్సిన్ ఇచ్చారని అది ఇప్పుడు బాలిక అనారోగ్యానికి కారణమైందన్నారు. మోతాదుకు మించి వ్యాక్సిన్ ఇవ్వడం కారణంగానే లక్ష్మి భవాని కీర్తి కాళ్లు చచ్చుపడ్డాయని హేమంతరావు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి స్థాయిలో విచారణ జరపాలని ఆయన కోరారు. ఎస్ఎన్ మూర్తి పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న హాస్టళ్లలో కనీస సౌకర్యాలు లేవని విద్యార్థులకు బెడ్స్ లేకపోవడంతో కింద పడుకోవడం వల్ల తరచూ ఇబ్బందులకు గురవుతున్నారని హేమంతరావు తెలిపారు. బెదిరింపు ధోరణికి పాల్పడుతున్న స్థానిక సిబ్బందిపై తగు చర్యలు తీసుకోవాలన్నారు. మమత వైద్యులను బాలిక ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు తాటి వెంకటేశ్వరరావు, ఎఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ, నాయకులు వంశీ తదితరులు పాల్గొన్నారు.

## 26న సిపిఐ ఆవిర్భావ దినోత్సవ సభ

సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్




**ప్రజాపక్షం/ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 26న ఖమ్మంలో ఆవిర్భావ సభను నిర్వహిస్తున్నామని సభను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ విజ్ఞప్తి చేశారు. సిపిఐ ప్రజాసంఘాల సంయుక్త సమావేశం యర్రాబాబు అధ్యక్షతన బుధవారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో జరిగింది. సమావేశంలో దండి సురేష్ మాట్లాడుతూ డిసెంబర్ 26కు పార్టీ ఆవిర్భావించి 99 సంవత్సరాలు పూర్తి చేసుకుని 100వ సంవత్సరంలోకి అడుగిడనుందని ఈ సందర్భంగా రెడ్‌షర్ట్ వాలంటీర్లు 100 మంది అరుణ పతాకాన్ని చేబూని ముందు వరుసలో ఉంటారని, కోలాట, డప్పు దళాలతో పార్టీ కార్యకర్తలతో భక్తరామదాసు కళాక్షేత్రం వరకు ప్రదర్శన సాగుతుందని, ప్రదర్శన అనంతరం సభ జరుగుతుందన్నారు. సభకు సిపిఐ జాతీయ నాయకులు హాజరుకానున్నారని సురేష్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఇంచార్జి బాగం హేమంతరావు, ప్రజా సంఘాల నాయకులు కొండపర్తి గోవిందరావు, మహ్మద్ సలాం, పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, రామాంజనేయులు, పగడాల మల్లేష్, నానబాల రామకృష్ణ, ఇటికాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## గడువులోగా 'సిఎంఆర్' రైస్ డెలివరీ పూర్తి

సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** నిర్దేశిత గడువు లోగా సిఎంఆర్ రైస్ డెలివరీ పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాలోని మిల్లర్లు, రెవెన్యూ, సంబంధిత అధికారులతో సిఎంఆర్ రైస్ డెలివరీపై సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఖల్లాలో వానాకాలం పంట కింద 80,903 వేల మెట్రిక్ టన్నుల సిఎంఆర్ రైస్ డెలివరీకి గాను 69,592వేల మెట్రిక్ టన్నుల రైస్, యాసంగి పంటకు సంబంధించి 14,757 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం డెలివరీకి గాను 7,743 వేల మెట్రిక్ టన్నుల రైస్ డెలివరీ చేయడం జరిగిందని తెలిపారు. వానాకాలం, యాసంగి కలిపి జిల్లాలోని రైస్ మిల్లర్లు మరో 18,324 వేల మెట్రిక్ టన్నుల సిఎంఆర్ రైస్ డెలివరీ చేయాల్సి ఉందని వీటిని ప్రభుత్వం నిర్దేశిత గడువు లోగా అందించాలన్నారు. నాణ్యత లేని ధాన్యం ఉంటే రైస్ మిల్లర్లు తీసుకోవద్దని అంతే తప్పా ఎటువంటి కోతలు విధించడానికి వీలు లేదన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. జిల్లాలో నాణ్యమైన ధాన్యం పండుతుందని ఆయన తెలిపారు. ధాన్యం తూర్పార పట్టాల్సిన అవసరం ఉంటే తప్పనిసరిగా చేస్తామని, తూర్పార పట్టకుండా రైస్ మిల్లులకు ధాన్యం తరలిస్తున్న కొనుగోలు కేంద్రాల వివరాలు అందించాలని సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. రైస్ మిల్లర్ కొనుగోలు కేంద్రాల ఇంచార్జి, రవాణా కాంట్రాక్టర్ సమన్వయంతో పనిచేస్తూ రవాణా ఇబ్బంది లేకుండా చూసుకోవాలన్నారు. సమావేశం లో జిల్లా పౌర సరఫరాల అధికారి చందన్ కుమార్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ జి. శ్రీలత, మిల్లర్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్ఐలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తున్న బిజెపి

సిపిఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యుడు రాఘవులు

**ప్రజాపక్షం/సత్తుపల్లి :** ప్రజా స్వామ్యాన్ని బిజేపి ప్రభుత్వం ధ్వంసం చేస్తుందని సిపిఎం పోలిట్ బ్యూరో సభ్యుడు బివి రాఘవులు ఆరోపించారు. బుధవారం పట్టణంలోని లక్ష్మి ప్రసన్న ఫంక్షన్ హాల్‌లో గల మోరంపూడి పుల్లయ్య ప్రాగణంలో భారత కమ్యూనిస్టు పార్టీ(మార్క్సిస్టు) 22వ ఖమ్మం జిల్లా మహాసహభలను నిర్వహించారు. మహాసభలకు ముఖ్య అతిధులుగా సిపిఎం పోలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, వెంకట్, కేంద్ర కమిటీ సభ్యులు సాయిబాబా తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ బిజెపి 75 ఏండ్ల దేశ రాజ్యాంగానికి నష్టం కలిగించే విధం గా పలు ఆంశాలు ప్రవేశపెట్టాలని చూస్తుందని, అందులోనివే నాలుగు కార్మిక చట్టాలన్నారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర చట్టాన్ని ఈ ప్రభుత్వం తీసుకురాకుండా కార్పోరేట్ శక్తులైన అదాని, అంబానీలకు దాసోహం అంటుందన్నారు. ఈ మధ్య కేంద్ర ప్రభుత్వం ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖలు రాసిందని, రైతు చట్టాలపై తమ అభిప్రాయాలను తెలపాలని కోరిందన్నారు. జీఎస్‌టి ద్వారా పేదల నడ్డి ఏ విధంగా విరుస్తుందో గమనిస్తూనే ఉన్నామన్నారు. కార్మిక చట్టాలు పనిచేసి రైతాంగం నడ్డి విరుస్తాయన్నారు. మనం పండించే పంటను మనం అమ్ముకునే హక్కు లేకుండా చేయాలనేది బిజేపి ప్రభుత్వం సిద్దాంతమన్నారు. ఈజిఎస్ నిధులను వేరే పథకాలకు దారి మళ్ళిస్తుందని మండిపడ్డారు. కార్పోరేట్ కంపెనీలను అదానికి, వ్యవసాయాన్ని అంబానికి అందించి దేశాన్ని నాశనం చేయాలనేది భారత ప్రదాని మోదీ కుట్ర అన్నారు. జమిలి ఎన్నికలతో దేశంలో ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే కుట్ర చేస్తుందన్నారు. మూసీ నది ప్రక్షాళన అంటున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మూసీలో విషాలను వదులుతున్న ఫార్మా కంపెనీలపై చర్యలు తీసుకునే దమ్ముందా అని ప్రశ్నించారు రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం. ఫార్మా కంపెనీల పేరుతో రెండు పంటలు పండుతున్న భూములను లాక్కుని ప్రజలను ఇబ్బంది పెట్టాలని చూస్తే ఎర్రజండా చూస్తు ఊరుకునేదిలేదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు సుదర్శన్, పాలడుగు బాస్కర్, వెంకటేశ్వరరావు మక్కా, బుర్రి వెంకన్న, తాళ్ళ నాగరాజు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇంచార్జ్ కనకయ్య, ఉమ్మడి ఖమ్మం జిల్లా నాయకులు సోమయ్య, నాయకులు తాతా బాస్కర్, మోరంపూడి పాండు రంగారావు, మాచర్ల భారతి, జాజిరి శ్రీను,కొలికపోగు సర్వేశ్వరరావు,రావుల రాజబాబు, నాయుడు వెంకటేశ్వరరావు, జాజిరి జ్యోతి, మల్లూరి చంద్రశేఖర్ సత్తుపల్లి, వైరా, మధిర, పాలేరు డివిజన్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# జాబితా సరే.. జమలేవీ?

నాల్గవ విడత రుణమాఫీలో గందరగోళం

బ్యాంకుల చుట్టూ తిరుగుతున్న రైతులు

**ప్రజాపక్షం/ఖమ్మం :** రుణమాఫీపై రైతుల్లో తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్న వేళ నాల్గవ జాబితా మరింత గందరగోళానికి దారితీసింది. గత నెల 30న మహబూబ్‌నగర్‌లో జరిగిన రైతు సదస్సులో రెండు లక్షలలోపు వ్యవసాయ రుణం ఉండి వివిధ కారణాలతో రైతుల ఖాతాల్లో జమ కాని వాటికి సంబంధించి ముఖ్యమంత్రి మూడు వేల కోట్ల రూపాయలను విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. డిసెంబర్ నెలలో ఉద్యోగుల వేతనాలు, పింఛన్లు ఇచ్చిన తర్వాత ఏడవ తారీఖు నాటికి రైతుల ఖాతాల్లో జమ చేస్తామని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ ప్రకటించారు. కాని ఇంతవరకు ఏ రైతు ఖాతాలోనూ నగదు జమ కాలేదు. సహకార సంఘాలకు, బ్యాంకులకు జాబితాలైతే వచ్చాయి కాని నగదు జమ కాలేదు. దీనితో రైతులు బ్యాంకులు, సహకార సంఘాల చుట్టూ తిరుగుతున్నారు. బ్యాంక్ అధికారులకు కూడా దీనికి సంబంధించి సరైన అవగాహన లేకపోవడంతో పూటకొక రీతిన సమాధానం చెబుతూ రైతులను గందరగోళ పరుస్తున్నారు. ఇన్సూరెన్స్‌లు అంటూ ఒకట్రెండు రోజులు సమాధానం చెప్పిన బ్యాంక్ అధికారులు కొందరు ఇప్పుడు ఐదవ జాబితా అంటూ రైతులను నిరాశపరిచేవిధంగా వ్యవహరిస్తున్నారు. ఉదాహరణకు ఖమ్మం రూరల్ మండలం ఆరెంపుల గ్రామానికి చెందిన జల్లా సుధాకర్ అనే రైతు డిసిసిబి పరిధిలోని రైతు సేవా సహకార సంఘం ద్వారా వ్యవసాయ రుణం తీసుకున్నారు. రూ. 50వేల రుణం తీసుకున్న సుధాకర్‌కు మొదటి మూడు దఫాల్లోను మాఫీ కాలేదు. పలుమార్లు బ్యాంకుల చుట్టూ తిరగగా కుటుంబ సభ్యుల నిర్ధారణ జరగలేదని చెప్పి ఇంటికి వచ్చి మూడు నెలల క్రిందట ఫోటోలు తీసుకుని వెళ్లారు. నాల్గవ జాబితాలో వస్తుందన్న ఆశతో బ్యాంకు వద్దకు వెళితే తొలిరోజు జాబితాలో పేరు ఉంది కాని ఇంకా నగదు జమ కాలేదన్న బ్యాంకు అధికారులు మరి కొద్ది రోజులు వేచి చూడాలని కోరారు. వ్యవసాయ అధికారుల వద్దకు వెళితే మీకు ఇన్సూరెన్స్‌కు సంబంధించి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయని అందుకే రుణ మాఫీ జరగ లేదని సంబంధం లేని సమాధానం చెబుతున్నారన్నారు. ఇదిలా ఉండగా బ్యాంక్‌కు సంబంధించి



సొసైటీ పరిధిలోని రుణం పొందిన రైతులకు సంబంధించి బ్యాంకు అధికారుల తప్పిదం కూడా రైతుల పాలిట శాపంగా మారినట్లు తెలుస్తుంది. రైతులకు సంబంధించిన ఇన్సూరెన్స్ డబ్బులను కూడా రుణ మొత్తంలో కలిపి చూపడంతో బ్యాంక్ ఉన్నతాధికారులు తిరస్కరించారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. మొత్తంగా నాల్గవ విడత నగదు జమ కాకపోవడంతో రైతులు బ్యాంకుల చుట్టూ, వ్యవసాయ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. నాలుగు విడతల జాబితాలోనూ చోటు దక్కని రైతులు ఉన్నారంటే ఆశ్చర్యం కలుగక మానదు. రెండు లక్షలలోపు ఉన్న రైతులకు పూర్తి స్థాయిలో రుణ మాఫీ జరగక పోగా అమాత్యుల పొంతన లేని ప్రకటనలు ఇప్పుడు ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతను తీసుకువస్తున్నాయి. రెండులక్షల పైబడిన రైతులకు రుణమాఫీ చేస్తామని రెండు లక్షలు పైన రుణాన్ని రైతులు చెల్లిస్తే రెండు లక్షల రూపాయలను ప్రభుత్వం చెల్లిస్తుందని ప్రభుత్వం ప్రకటించింది. అనేక వేదికల మీద ఈ విషయాన్ని మంత్రులు స్పష్టం చేశారు. మొత్తం రుణమాఫీ రూ. 31వేల కోట్లు జమ చేయాల్సి ఉండగా రూ.20వేల కోట్లు జమ చేసి రుణమాఫీ సంపూర్ణమైందని ప్రభుత్వం ప్రకటించడంతో రైతుల్లో ప్రభుత్వం పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుంది. ప్రభుత్వం గతంలో ప్రకటించినవిధంగా రుణమాఫీని పూర్తి స్థాయిలో అమలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. నాల్గవ విడత గందరగోళానికి ప్రభుత్వం తెరదించాలని కోరుతున్నారు.

## బ్యాంక్ రుణాలు సద్వినియోగం చేసుకోవాలి : ఎం అనిల్‌కుమార్



ప్రజాపక్షం / వేలేరు : కేంద్ర ప్రభుత్వం అందించే వివిధ రకాల రుణాలను సద్వినియోగం చేసుకొని రైతులు, మహిళాసంఘాల సభ్యులు, వ్యాపారులు, తదితరులు సద్వినియోగం చేసుకోవాలని హనుమకొండ జిల్లా ఎస్‌బిఐ ప్రాసెసింగ్ ఆఫీసర్ ఎం అనిల్ కుమార్ కోరారు. బుధవారం హనుమకొండ జిల్లా వేలేరు మండల కేంద్రంలోని రైతువేదికలో వేలేరు ఎస్‌బిఐ బ్యాంక్ మేనేజర్ అక్బర్ ఉన్నీసా ఆధ్వర్యంలో జరిగిన బ్యాంక్ రుణాల సద్వినియోగంపై అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వేలేరు మండలంలోని రైతులు, మహిళలు, వ్యాపారవేత్తలు, కేంద్రప్రభుత్వం అందించే డైరీఫాం, కోళ్ళఫారాలు, షీప్‌ఫాంలే కాకుండా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, ట్రాక్టర్లు, తదితర రుణాలను బ్యాంక్ వడ్డీతో అందించడం జరుగుతోందని కనుక సకాలంలో సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ అక్బర్ ఉన్నీసా షేక్, జిల్లా ప్రాసెసింగ్ ఆఫీసర్ ఎం అనిల్‌కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ బి.శ్రావణ్‌కుమార్, అసిస్టెంట్ ఫీల్డ్ ఆఫీసర్ మక్కల శ్రీకాంత్, వ్యవసాయశాఖాధికారి కవితారాణి, బ్యాంక్ సిబ్బంది నంగునూరి రవి, బోడ రవి, మండలరైతులు, మహిళాసంఘాల సభ్యులు, వ్యాపారులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని ఆందోళన



ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:కృష్ణకాలనీలో డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని ఆందోళన చేసిన కాలనీవాసులు జిల్లేడ్ రోడ్డు అభివృద్ధి పనులు కోసం ఒక కిలోమీటర్ ఫోర్‌లైన్ కోసం రూ.6కోట్లు 30లక్షలతో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. పనులు మూడు ఫీట్ల సైడ్ డ్రైనేజీ వాటర్‌ను కృష్ణకాలనీ వాసుల ఫిట్ డ్రైనేజీలకు కలపడంతో కాలనీవాసులకు ఇండ్లు పూర్తిగా మునిగిపోతాయని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలనీవాసుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ విషయంపై అధికారులకు పలుమార్లు దరఖాస్తులు విన్నవించుకున్నారు. కానీ మా సమస్యలు తెలియపరిచిన పరిష్కరించడం లేదని బుధవారం డ్రైనేజీ పనులను కాలనీవాసులు అడ్డుకున్నారు. సైడ్ డ్రైనేజీ వాటర్ ఎన్‌హెచ్ హైవే లేదా ఊరు చివరికి పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. మా సమస్య పరిష్కరించే అంతవరకు మా ఆందోళనలు ఆపమని కాలనీవాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీచర్ సుధాకర్, మోహన్, నవీన్, రమేష్, దయాకర్, నరేష్, రాజిరెడ్డి, సంపత్, వేల్పూరి, సత్యనారాయణ, కృష్ణకుమార్, మెకానిక్ రాజ్, శ్రీరామ్ రవి, ఎగ్‌బాల్, రాజ్,కుమారస్వామి, కాలనీవాసులు పాల్గొన్నారు.

## ప్రాథమిక వైద్యశాల తనిఖీ



ప్రజాపక్షం/నెక్కొండ:వరంగల్ జిల్లా వైద్య అధికారి డాక్టర్ సాంబశివరావు వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్యశాలను బుధవారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పిహెచ్సిలోని రికార్డులను తనిఖీ చేశారు జాతీయ స్థాయి కార్యక్రమాలను వాటి పనితీరును పరిశీలించారు. సిబ్బంది వివరాలు వారి హాజరు పట్టికను తనిఖీ చేశారు. అనంతరం హాస్పిటల్ పరిసరాలను పరిశీలించి సిబ్బందికి ప్రాథమిక వైద్యశాల డాక్టర్ రహేళ తన్వీర్‌కు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ ప్రకాష్, డాక్టర్ సుమన్ ఎం ఒ, డాక్టర్ మౌనిక, డాక్టర్ రాహుల్ ఎం ఎల్ హెచ్ పిలు, అనిల్ కుమార్, రవి చంద్రారెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సిఐ కార్యాలయంలో డిసిపి తనిఖీ




ప్రజాపక్షం/పాలకుర్తి: పాలకుర్తి సర్కిల్ కార్యాలయాన్ని బుధవారం జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్ బుధవారం సందర్శించి రికార్డులను పరిశీలించారు. కార్యాలయం అంతా తిరిగి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డిసిపి రాజమహేంద్ర నాయక్ మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులు ఫిర్యాదు చేస్తే స్పందించాలని అదే విధంగా న్యాయం చేయాలని ఆదేశించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఆయన వెంట వర్ధన్నపేట ఎసిపి నర్సయ్య,సిఐగట్లమహేందర్ రెడ్డి ఉన్నారు.

## ప్రమాదాలు జరుగుతున్నా... అధికారులకు పట్టింపు ఏది..??



ప్రజాపక్షం ఎఫెక్ట్

ప్రజాపక్షం/ కమలాపూర్: కమలాపూర్ మండల కేంద్రంలోని సబ్ స్టేషన్ వద్ద గల స్పీడ్ బ్రేకర్ వల్ల కొంత కాలంగా తరచు ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. శనివారం బైక్ పై వస్తున్న శైలజ ఓంకార్ దంపతులు స్పీడ్ బ్రేకర్ వల్ల ప్రమాదానికి గురికాగా, ఆదివారం అదే స్పీడ్ బ్రేకర్ వద్ద జయగిరి గ్రామానికి చెందిన ప్రేమలత దంపతులు ప్రమాదానికి గురయ్యారు. దీంతో గాయపడిన వారిని ప్రభుత్వాసుప్రతికి తరలించారు. ఇప్పటికైనా ఆర్ అండ్ బి అధికారులు స్పందించి ప్రమాదానికి కారణమవుతున్న స్పీడ్ బ్రేకర్ ను తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు అనే వార్తకు స్పందించిన ఎంపిడివో బాబు, కమలాపూర్ సిఐ హరికృష్ణ, ఆర్ అండ్ బి డిఈ రాజు, ఏఈ జయశ్రీ ప్రమాదం జరుగుతున్న స్థలాన్ని పరిశీలించి వీలైనంతా త్వరగా స్పీడ్ బ్రేకర్ సమస్యను పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు.

# పకడ్బందీగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



ప్రజాపక్షం/మహాదేవపూర్: ఇందిరమ్మ ఇళ్ల సర్వే పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులకు ఆదేశించారు. బుధవారం మండలకేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ పథకంలో భాగంగా నిర్వహించే సర్వేలో లబ్ధిదారుల వివరాలు పక్కాగా నమోదు చేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో ఒక్కరు కూడా మిస్ కాకుండా మొబైల్ యాప్‌లో నమోదు చేయాలని మండలకేంద్రంలో 2500 మంది లబ్ధిదారులకు సర్వే నిర్వహిసార్తమని అన్నారు.ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న అర్జీదారుల వివరాల సేకరణను పరిశీలించారుమార్గదర్శకాలను పాటిస్తూ ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా లబ్ధిదారుల వివరాలు అత్యంత జాగ్రత్తగా నమోదు చేయాలని సూచించారు.దరఖాస్తుదారులకు సందేహాలు ఉంటే స్థానిక ఎంపిడిఓను సంప్రదించాలని అన్నారు. అనంతరం గిరిజన ఆశ్రమపాఠశాలను సందర్శించి పరిశీలించారు.అనంతరం టస్సర్ కాలనీలో పట్టు వస్త్రాలు నేస్తున్న ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టస్సర్ పట్టు వస్త్రాలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పనకు కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారంస్టాల్ ఏర్పాటు చేయాలని డిఆర్డిఓకు సూచించారు. అలాగే హైదరాబాద్ శిల్పారామంలో పట్టు వస్త్రాలను విక్రయించడానిక అనువుగా స్టాల్ ను ఏర్పాటు చేయించినట్లు తెలిపారు.పట్టు వస్త్రాలను ఆన్లైన్‌లో విక్రయించడానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పట్టు గుడ్ల నుండి దారం తీస్తున్న తీరు,వస్త్రాలు నేస్తున్న తీరును పరిశీలించారు. మహిళా శక్తి వీ రలక్ష్మి స్వీట్స్ అండ్ హాట్ కేంద్రాన్ని పరిశీలించి మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన అధికారి సంజీవ రావు, డిఆర్డిఒ నరేష్, సెరికల్చర్ అధికారి సమ్మయ్య, మండల ప్రత్యేక అధికారి వీరభద్రయ్య, ఎంపిడిఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## పట్టు సాగుతో సిరుల పంట

వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద



ప్రజాపక్షం/ గీసుకొండ : పట్టు సాగు ద్వారా తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఆర్జించవచ్చని, ఆ దిశగా రైతులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పేర్కొన్నారు. బుధవారం వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలోని దస్రు తండా గ్రామంలో పట్టు పరిశ్రమ సాగు పెద్ద నిర్మాణాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాంప్రదాయ పంటలు వేసి నష్టపోకుండా ఆదాయం వచ్చే పట్టు సాగు చేపట్టాలని, గ్రామ రైతులు పంట మార్పిడి చేయాలని సూచించారు. పట్టు పరిశ్రమ అధికారులను శాస్త్రవేత్తలను సంప్రదించి వారి సూచనల మేరకు పట్టు పురుగుల పెంపకంలో పాటించాలన్నారు. కర్ణాటక రైతుల వలే పెట్టుబడితో అధిక లాభం పొందవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పట్టు పరిశ్రమ సంయుక్త సంచాలకులు అనసూయ, సహాయ పట్టు పరిశ్రమ అధికారి అరవింద్, సంపత్, రాజు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సజావుగా ఇందిరమ్మ ఇండ్ల సర్వే

అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్



ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరదర్శకంగా, సజావుగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయలక్ష్మి మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్‌లు అన్నారు. భూపాలపల్లి మున్సిపల్ పరిధిలోని 1, 16 వార్డులలో అడిషనల్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్‌తో కలిసి ఇందిరమ్మ ఇండ్ల సర్వే విధానాన్ని వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రజలతో మాట్లాడుతూ, ఇల్లు లేని నిరుపేదలైన వారికి మొదటి విడతలు లో ఇళ్లు లేని వారికే అధిక ప్రాధాన్యత ఇస్తారని అన్నారు. ఇందిరమ్మ ఇల్లు వాటి విధి విధానాల గురించి ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్, సిగ్గెం వెంకటరాణి సిద్దు, టిపిఓ పి.సునీల్, మున్సిపల్ ఏఈ మానస, శానిటరీ ఇన్స్పెక్టర్ నవీన్, సంబంధిత వార్డు ఆఫీసర్లు, అధికారులు పాల్గొన్నారు.

# క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి



ప్రజాపక్షం / హనుమకొండ ప్రతినిధి : క్రీడలలో రాణించేలా క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. హనుమకొండ జెఎన్ఎస్‌లో చీఫ్ మినిస్టర్స్ కప్ 2024 జిల్లా స్థాయి పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలోని క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికి తీయడానికి చీఫ్ మినిస్టర్స్ కప్ పోటీలను రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. జిల్లాస్థాయిలో వివిధ క్రీడాంశాలలో పోటీలను నిర్వహించడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా క్రీడాకారులు, క్రీడలలో క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో రాష్ట్ర బడ్జెట్లో రూ.375 కోట్లను కేటాయించారని పేర్కొన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటములు అనేవి సహజమని అన్నారు. క్రీడల్లో పాల్గొని స్ఫూర్తిని చాటాలన్నారు. క్రీడలలో అత్యుత్తమ ప్రతిభతో హనుమకొండ జిల్లా పేరును నిలబెట్టాలన్నారు. వరంగల్ జిల్లాతోనూ పోటీపడాలన్నారు. వివిధ క్రీడల్లో క్రీడాకారులు రాణించి హనుమకొండ జిల్లా పేరును తెలంగాణ రాష్ట్రంలో మార్మోగేలా తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన క్రీడాకారులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక కాగా క్రీడాకారులను మేయర్ తదితరులు పరిచయం చేస్తున్నారు. హ్యాండ్ బాల్ ఆడి జిల్లా స్థాయి క్రీడా పోటీలను మేయర్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఎండి అజీజ్ ఖాన్, జిల్లా యువజన క్రీడా అధికారి అశోక్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## నిజాయితీతో పనిచేసి ప్రజల మన్ననలను పొందండి

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



ప్రజాపక్షం / వరంగల్ క్రైమ్ : నిజాయితీతో పని చేసి ప్రజల మన్ననలను పొందాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా స్టేషన్ ఘన్‌పూర్ ఎసిపి కార్యాలయమును వరంగల్ పోలీస్ కమిషనర్ బుధవారం తనిఖీ చేశారు. తనిఖీ భాగంగా ఏసిపి కార్యాలయమునకు చేరుకున్న పోలీస్ కమిషనర్‌కు పోలీస్ అధికారులు మొక్కను అందజేసి స్వాగతం పలకగా, సాయుధ పోలీసులు గౌరవ వందనం చేశారు. అనంతరం పోలీస్ కమిషనర్ ఎసిపి కార్యాలయమునకు సంబంధించిన రికార్డులను పరిశీలించడంతో పాటు, ఎసిపి అధ్వర్యంలో దర్యాప్తు జరిగిన కేసుల ప్రస్తుత స్థితిగతులపై పోలీస్ కమిషనర్ అరా తీయడంతో పాటు, గ్రేవ్ కేసుల్లో నిందితుల అరెస్టు, దర్యాప్తు జరుగుతున్న తీరును పోలీస్ కమిషనర్ ఎసిపి కిషన్ అడిగి తెలుసుకొవడంతో పాటు, పెండిరగ్‌లో ఉన్న ఎస్‌టి, ఎస్‌సి కేసులు, ఇతర గ్రేవ్ కేసుల వివరాలకు సంబంధించిన రికార్డులను పోలీస్ కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పరకాల సబ్‌డివిజినల్ పోలీస్ అధికారులతో కమిషనర్ మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో పోలీస్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని, ప్రతి పోలీస్ స్టేషన్‌తో పాటు, బ్యాంకులు, ఇతర ప్రధాన కూడళ్ళల్లో సిసి కెమెరాలు ఏర్పాటు అధికారులు చొరవ చూపించాలని, నేరాల కట్టడి కొసం అధికారులు మరింత శ్రమించడంతో పాటు, నేరం జరిగిన వెంటనే స్టేషన్ అధికారులు వేగంగా స్పందించాలని. ఈ తనిఖీలో వెస్ట్ జోన్ డిసిపి రాజమహేంద్ర నాయక్ , ఎ. ఎస్‌పి మన్నన్ భట్, ఎసిపి భీం శర్మ, స్టేషన్ ఘన్పూర్ సబ్‌డివిజనల్ పోలీస్ అధికారులు, ఇన్స్పెక్టర్ జి. వేణు, రఘునాథ్ పల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఎస్‌ఐలు వినయ్ కుమార్, రమేష్, నవీన్ కుమార్, నరేష్, శ్రవణ్ కుమార్‌తో పాటు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## క్రీడాకారులకు గెలుపు, తపన ఉండాలి

హనుమకొండ ఎసిపి దేవేందర్ రెడ్డి



ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : ఆటల పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు గెలవాలనే తపన ఎక్కువ ఉంటుందని, క్రీడాకారులు జీవితాన్ని చాలెంజ్‌గా తీసుకొని ముందుకు సాగుతారని, అలాంటివాళ్లు భవిష్యత్తులో ఉన్నతులుగా ఎదుగుతారని ఎసిపి దేవేందర్‌రెడ్డి అన్నారు. భీమారం ఎస్‌పిఎస్ క్యాంపస్‌లో ఎస్‌పిఎస్ ఇనిస్ట్యూషన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ 18క్రికెట్, స్విమ్మింగ్ పోటీలను ఎసిపి దేవేందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఎసిపి దేవేందర్ రెడ్డికి ఘన స్వాగతం పలికిన ఎస్‌పిఎస్ గ్రూప్స్ చైర్మన్ ఎర్రబెల్లి తిరుమల్ రావు ఎసిపి నీ ఘనంగా సన్మానించి మెమొంటోను ప్రధానం చేశారు. టార్చ్ వెలిగించి క్రికెట్ పోటీలను ప్రారంభించిన ఎసిపి, క్రికెట్ ఆడి క్రీడాకారులు ఉత్సాహం నింపగా వారితోపాటు చైర్మన్ తిరుమల్ రావు, సిఐ రవికుమార్ క్రికెట్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎసిపి దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ చదువుతోపాటు ఆటపాటల్లో రాణించాలని, విద్యార్థులు ఒక చదువుపైనే దృష్టి సారించకుండా, క్రీడల వైపు కూడా ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని, కష్టపడితే ఉన్నతంగా ఎదగవచ్చు అనడానికి ఎస్వీఎస్ కాలేజీలే నిదర్శనం అన్నారు. చైర్మన్ తిరుమల్ రావు మాట్లాడుతూ క్రీడలతో విద్యార్థులకు మానసిక ఉల్లాసం కలుగుతుంది, ప్రస్తుత పోటీ ప్రపంచంలో చాలామంది విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారని, వారిలోకి క్రీడా భావం నింపేందుకే ఈ పోటీలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఎస్ఆర్‌ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు తుమ్మ అమరేశ్, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

# నేటి నుంచి సిఎం కప్ జిల్లా స్థాయి క్రీడలు

ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్



ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి: సిఎం కప్ మహబూబాబాద్ జిల్లా స్థాయి క్రీడలు గురువారం నుండి ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ క్రీడలకు జిల్లా కేంద్రంలోని ఎన్‌టిఆర్ స్టేడియంలో ఏర్పాట్లు చేశారు. జిల్లాలలోని అన్ని మండలాలకు చెందిన 3.400మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటారు. ఎన్‌టిఆర్ స్టేడియం, ప్రభుత్వ జూనియర్ కళాశాల బాస్కెట్‌బాల్ గ్రౌండ్, గిరిజన భవన్, జెపిహెచ్ఎస్ కల్వల, బిషప్ గ్రౌండ్ దోర్నకల్‌లో ఈ క్రీడలు నిర్వహిస్తున్నారు. 19న 1174మంది 20న 1054మంది క్రీడాకారులు, 21న 224మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. ప్రతిభ కనపర్చిన క్రీడాకారులను ఎంపిక చేసి ఈ నెల 27నుండి జరిగే రాష్ట్రస్థాయి సిఎం కప్ పోటీల్లో పాల్గొంటారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో, కె.వీరబ్రహ్మాచారి పలువురు అధికారులతో కలిసి ఎన్‌టిఆర్ స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలించారు. 19 నుంచి 21వరకూ జరిగే ముఖ్యమంత్రి చాంపియన్‌షిప్ ట్రోఫీ, సిఎం కప్ క్రీడల్లో జిల్లాలోని పాఠశాలలు, గ్రామస్థాయిలో యువతి, యువకులు మండలస్థాయిలో ప్రతిభ కనపర్చిన క్రీడాకారులు ఈ జిల్లా స్థాయిలో పాల్గొంటారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లను ఎన్‌టిఆర్ స్టేడియంలో పూర్తి చేశారు. వివిధ మండలాల నుంచి వచ్చే క్రీడాకారులకు ఉచిత భోజనం, రవాణా తదితర సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. క్రీడలు నిర్వహించే ఎన్‌టిఆర్ స్టేడియం ప్రాంతంలో క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ట్రాఫిక్ రక్షణ చర్యలు తీసుకోవాల్సిందిగా పోలీస్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో కలిసి పనిచేయాలని సిఎం కప్ క్రీడా పోటీలను విజయవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. క్రీడాకారులకు కల్పించిన సౌకర్యాలను, క్రీడా ప్రాంగణాన్ని సంపూర్ణంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. క్రీడలకు ఆహ్వాన పత్రికలను పరిశీలించారు. ఈ జిల్లాస్థాయిలో ప్రతిభ కనపర్చిన క్రీడాకారులు హైద్రాబాద్, హన్మకొండలో జరిగే రాష్ట్రస్థాయి సిఎం కప్ పోటీల్లో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ కృష్ణవేణి, డివైఎస్‌ఓ ఒ.జ్యోతి, మున్సిపల్ కమీషనర్ రవీందర్, డిఇ ఉపేందర్, మహబూబాబాద్ తహసీల్దారు భగవాన్‌రెడ్డి పాల్గొన్నారు.

## క్షయవ్యాధి గ్రస్తులకు పోషకాహారం





ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి: జాతీయ క్షయనివారణ కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లా క్షయనివారణ సంస్థ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి టి బి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహారాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సాంబశివరావు అందజేశారు. వరంగల్ జిల్లా క్షయ నివారణ సంస్థ ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఉద్యోగులు క్షయ వ్యాధిగ్రస్తుల కోసం పోషకాహారాన్ని వారి సొంత నిధులతో సమకూర్చి క్షయ వ్యాధిగ్రస్తులకు అందజేశారు.ముఖ్యఅతిథిగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సాంబశివరావు మాట్లాడుతూ క్షయ వ్యాధిగ్రస్తులకు చేయితనిస్తూ వారికి పోషకాహారాన్ని అందించిన జిల్లా క్షయనివారణ సంస్థ సిబ్బందిని అభినందిస్తున్నామన్నారు. డిప్యూటీ డిఎంహెచ్ఓ, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ మోహన్ సింగ్ గారు, టిబి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నరేష్, డెమో అనిల్ కుమార్, క్షయ వ్యాధి నివారణ సంస్థ సిబ్బంది పాల్గొన్నారుజిల్లా క్షయనివారణ అధికారి కార్యాలయ సిబ్బంది, ప్రభాకర్, రంజిత్, వేణుగోపాల్, నరేష్, మాధవి, సుభాషిని, సంకీర్తన, నరేష్ ,అశోక్ పాల్గొన్నారు.

## అంధకార బంధురం.. 'ఎన్‌హెచ్ 163'!

రఘునాథపల్లి నేషనల్ హైవేరోడ్డులో ప్రజల ఇక్కట్లు

తక్షణమే సమస్యను పరిష్కరించాలంటూ స్థానికుల డిమాండ్



ప్రజాపక్షం/రఘునాథపల్లి: రఘునాథపల్లి మండల కేంద్రంలో గల హన్మకొండహైధరాబాద్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్ 163)పై ఉన్న లైట్లు గత వారం రోజులుగా వెలుగకపోవడంతో రఘునాథపల్లి నేషనల్ హైవే రోడ్డు అంధకారంలో మునిగిపోయింది. దీంతో మండల కేంద్రంలోని ప్రజలు ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోననే భయాందోళనలకు గురవుతున్నారు. ఇదిలా ఉంటే రఘునాథపల్లి మండల కేంద్రంలో ఇప్పటికే దొంగతనాలు జరుగుతున్న సంఘటనలు ఎన్నో కనిపిస్తున్నా కూడా నేషనల్ హైవే అధికారులు గానీ, పోలీసు ఉన్నతాధికారులు గానీ స్పందించకపోవడం పట్ల మండల ప్రజలు ఒకింత అసహనం వ్యక్తం చేస్తున్నారు. గత వారం వరకు బాగానే వెలిగిన నేషనల్ హైవే లైట్లు ఇది వరకు ఉన్న కాంట్రాక్ట్ అయిపోవడంతో స్థానికులు అడిగితే మా కాల పరిమితి ముగిసింది. మేము ఇప్పుడు అక్కడ పనిచేయడం లేదంటూ సమాధానం చెప్తున్నారని స్థానికులు వాపోతున్నారు. మరి కాంట్రాక్ట్ పాత వాళ్లది అయిపోతే కొత్త వాళ్లని వెంటనే తీసుకోవాల్సిన బాధ్యత నేషనల్ హైవే అధికారులది కాదా అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు ప్రమాదం జరిగితేనే అధికారులు పట్టించుకుంటారా అంటూ వారు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే మండల కేంద్రంలో నెలకొన్న పరిస్థితిపై స్థానికులు 1033కి ఫిర్యాదు చేసి రోజులు గడుస్తున్నా నేషనల్ హైవే అధికారులు చర్యలు తీసుకోకపోవడం పట్ల ప్రజలు తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి రఘునాథపల్లి మండల కేంద్రంలో కమ్ముకున్న కారుచీకట్లను తొలగించి నేషనల్ హైవే లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## మనమెంతో.. మనకంత వాటా కావాలి

వరంగల్ జిల్లా బిసి హక్కుల సాధన సమితి ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి



ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి: మనమెంతోమనకంత వాటా కావాలని వరంగల్ జిల్లా బిసి హక్కుల సాధన సమితి ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి అన్నారు. వరంగల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏ నినాదం వెనుక ఏ వర్గ ప్రయోజనం ఉందో తెలుసుకోలేనంత కాలం ప్రజలు మోసపోతూనే ఉంటారని అన్నాడు. ఓ మహానుభావుడు.. దేశానికి స్వాతంత్ర్యంవస్తే భారతదేశ ప్రజలు స్వేచ్ఛ వాయువులు పీల్చుకోవడమే కాదు, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో ప్రజలందరూ కుల, మత, ప్రాంత, లింగ వివక్షతలేని సమానత్వపు హక్కులు పొందుతారని భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14చెబుతుందన్నారు. ఆర్టికల్ 21(ఎ)ప్రకారం 614 ఏళ్ల వరకు ఉచిత నిర్బంధ విద్య ప్రభుత్వమే అందిస్తుందని, ఆరోగ్యంగా ఉండటం కోసం ప్రతి ఒక్కరికి ఉచిత వైద్యం పొందే హక్కు కూడా రాజ్యాంగమే కల్పించిందన్నారు. ప్రతి మనిషికి ఉపాధి అవకాశాలు కల్పించే హక్కు కూడా ఆర్టికల్ 16 కల్పిస్తుంది. ఆర్టికల్ 41ప్రకారం ప్రజలకు విద్య, ఉపాధి అవకాశాల కోసం, నిర్దిష్ట బలహీన వర్గాలకు సామాజిక సహాయం కోసం కెటాయింపులు చేయాలనీ నిర్ధేశిస్తుందన్నారు. రాజ్యాంగ రక్షణలు భారత పౌరులకున్నా ఇంకా సామాజిక ఆర్థిక రాజకీయ రంగాలలో బెస్ట్ కమ్యూనిటీస్ (బిసికులాలు) వెనక్కినెట్టివేయబడుతూనే ఉన్నాయి. స్వాతంత్రం వచ్చి, ఏడున్నర దశాబ్దాలు దాటిందని, రాజ్యాంగంలో పొందుపరిచిన విధంగా మిశ్రమ ఆర్థిక వ్యవస్థ ద్వారా తొలి ఐదు దశాబ్దాలవరకు పటిష్ఠంగానే ఉచిత విద్య, వైద్యం, ఉపాధి, సబ్సిడీలు, సంక్షేమం, అభివృద్ధి రంగాల్లో చాలా వరకు మనకు అందాయన్నారు. స్వాతంత్ర్య పూర్వం కొల్హాపూర్ సంస్థానం సాహు మహారాజు 1902లోనే బ్రాహ్మణేతర వెనుకబడిన తరగతుల వారికి ప్రతీ ఒక్కరికీ విద్యనందిచండంతో పాటు, ఉద్యోగాలలో 50% రిజర్వేషన్లు కల్పించిన మహానుభావుడన్నారు.


## తాళం వేసిన ఇంట్లో చోరీ

ప్రజాపక్షం/పాలకుర్తి: తాళం వేసి ఉన్న ఇంటి తాళం పగొలగొట్టి బంగారం, కొంత నగదును చోరీ చేసిన సంఘటన మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం బోడ లలిత అనే మహిళ హన్మకొండలో ప్రభుత్వ ఉద్యోగం చేస్తోంది. ఆమె ఈ నెల 11న హన్మకొండకు వెళ్లింది. అక్కడి నుంచి బంధువుల ఇళ్లకు వెళ్లి బుధవారం హన్మకొండ నుంచి లలిత పాలకుర్తికి వచ్చి చూడగా ఇంటి తాళం విరుగొట్టి తలుపులు తెరిచి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తాళం పగులగొట్టి ఉంది. అందులో 30 తులాల బంగారం, రూ.50వేల నగదు చోరీ జరిగినట్లు గుర్తించారు. ఈ ఘటనపై క్లూస్ టీం డాగ్ స్క్వాడ్‌తో వచ్చి ఆ ఇంటి పరిసర ప్రాంతాలను పరిశీలించారు. బాధితురాలు లలిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.

# సర్వేల్ గురుకుల విద్యార్థికి తీవ్రగాయం

## విద్యార్థులకు రాగిజావ సర్వ్ చేస్తుండగా ప్రమాదం

## మరో ఇద్దరు గాయపడ్డట్టు సమాచారం




**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం** : రాష్ట్రంలో పేరొందిన గురుకుల విద్యాలయాలలో సర్వేల్ గురుకులం ఒకటి అలాంటి పాఠశాలలో ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంతో ఓ విద్యార్థికి తీవ్ర గాయం అయింది. బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం సర్వేల్ లోని బాలుర గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతికి చెందిన శివరాత్రి శామ్యూల్ అనే విద్యార్థి అల్పాహార సమయంలో విద్యార్థులందరికీ రాగిజావ పోసేందుకు గిన్నెను పైకి ఎత్తుతుండగా అది ఒక్కసారిగా జారిపడి శామ్యూల్ కాళ్ళ మీద పడింది. దీంతో తీవ్ర గాయాలైన శామ్యూల్ ను హైదరాబాదులోని ప్రైవేట్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఈ సంఘటనలో శామ్యూల్ తో పాటు మరో ఇద్దరు కూడా గాయపడినట్లు తెలుస్తుంది. జి మదన్ అనే వ్యక్తి కూడా గాయపడడంతో ఆయనకు పాఠశాలలోనే ఆయింట్మెంట్ రాసి చికిత్స అందించినట్లు సమాచారం. విద్యార్థులకు వడ్డించాల్సిన వంట మాస్టర్లు ఉండగా ఎనిమిదో తరగతి విద్యార్థులతోనే నిత్యం వడ్డించడంతోనే ఈ సంఘటన చోటు చేసుకున్నట్లు విద్యార్థులు తెలిపారు. అంతేకాకుండా గురుకుల పాఠశాలలోని డిప్యూటీ వార్డెన్ తొందరపాటు కూడా ఇందుకు కారణంగా తెలుస్తుంది.

# కుక్కలు,కోతుల బెడదను నివారించాలి



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట** : భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో యాదగిరిగుట్ట మున్సిపల్ పరిధిలో ప్రజలకు, విద్యార్థులకు ఇబ్బందిగా తయారైన కుక్కలను, కోతుల బెడద నివారించాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ అజయ్ కుమార్‌కి మెమోరాండం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు, జిల్లా కార్యవర్గసభ్యులు కళ్ళెం కృష్ణ, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు పేరబోయిన పెంటయ్య, సిపిఐ మండల కార్యదర్శి కల్లెపల్లి మహేందర్, సహాయ కార్యదర్శి పేరబోయిన మహేందర్, కార్యవర్గ సభ్యులు గోరేటి రాములు, పేరబోయిన బంగారు, రాయగిరి బాలకిషన్, గోపగాని రాజు, మాటూరి మల్లయ్య, అనంతుల నర్సింహ్మ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామస్థాయి క్రీడాకారులను వెలికితీయడమే సిఎం కప్ లక్ష్యం



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** గ్రామస్థాయి నుండి క్రీడాకారులను వెలికి తీయడమే లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా చీఫ్ మినిస్టర్ కప్ పోటీలను నిర్వహిస్తున్నట్లు సూర్యాపేట జిల్లా చీఫ్ మినిస్టర్ కప్ క్రీడల ఇన్‌ఛార్జి ఆదాం బాబా, జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షులు గందూరి కృపాకర్ లు తెలిపారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జిల్లా బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయిచెస్ క్రీడలను వారు ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత చదువుల్లో రాణించాలంటే తప్పనిసరిగా క్రీడలను అలవర్చుకోవాలన్నారు. ముఖ్యంగా చెస్ క్రీడా మేధోసంపత్తితో ఆడటం జరుగుతుందని, చెస్ క్రీడల ఏదో సంపత్తి పెరిగి చదువులో రాణిస్తారని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా చెస్ ఆటల్లో భారతదేశం ముందు వరుసలో ఉందని కొనియాడారు. జిల్లా వ్యాప్తంగా చెస్ క్రీడలను అభివృద్ధి చేస్తున్న గందూరి కృపాకర్‌ను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్‌మాస్టర్ గోలి పద్మ, జిల్లా చెస్ అసోసియేషన్ సెక్రటరీ సతీష్, కోశాధికారి మురళి, నల్గొండ జిల్లా చెస్ కార్యదర్శి కరుణాకర్‌రెడ్డి, పిడిలు విశ్వజ్ఞచారి, వెంకటేశ్వర్లు, రామ్మోహనచారి, విజయ్‌కుమార్, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీల హామీలు అమలు చేయాలి



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి:** ప్రభుత్వం ఎన్నికల సమయంలో అంగన్‌వాడీలకు ఇచ్చినటువంటి హామీలను వెంటనే అమలు చేయాలని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ ఎఐటియుసి యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు యడమ సుమతమ్మ ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో కోరారు. అంగన్‌వాడీలకు ఇచ్చే వేతనాలు ఆవగింజ అంత అయితే చెప్పే పనులు మాత్రం చేంతాడు అంత అని ఆవేదన వ్యక్తం చేశారు. 45 సంవత్సరాల నుండి పనిచేస్తున్న అంగన్‌వాడీ సిబ్బందికి హెల్త్ కార్డులు లేక ఆపద వస్తే వారికి మరణాలే శరణ్యం అవుతున్నాయని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యమైన గుడ్లు ఇవ్వాలన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్ కింద టీచర్లకు 2లక్షలు, ఆయాలకు లక్ష రూపాయలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని అన్నారు. టీచర్లకు రూ. 26వేలు, ఆయాలకు రూ. 18వేల వరకు వేతనాలు పెంచి ప్రతి నెల 1వ తేదిలోపే చెల్లించాలని కోరారు.

# ట్రాఫిక్ రూల్స్ పాటించకపోతే కేసులే..

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్ ఆదేశానుసారం డిఎస్పీ రాజశేఖర్‌రాజు, టూటౌన్ సీఐ నాగార్జున ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని డాక్టర్స కాలనీలో ట్రాఫిక్ నియంత్రణ చర్యలో భాగంగా డాక్టర్స్ కాలనీలోని ఆసుపత్రి, మెడికల్‌షాపు నిర్వాహకులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని లేనట్లయితే కేసులు నమోదు చేస్తామన్నారు. డాక్టర్స్ కాలనీలో ఆసుపత్రి నిర్వాహకులు, మెడికల్‌షాపు వారు రోడ్లపై ఏర్పాటు చేసి బోర్డులను ట్రాఫిక్ ఎస్ఐ బండి మోహన్‌తయాదవ్ పోలీసు సిబ్బందితో కలిసి తొలగించారు. అత్యవసర పరిస్తితుల్లో అంబులెన్స్ డాక్టర్స్ కాలనీలోకి రావాలంటే రోడ్లపై వాహనాలను నిలుపుదల చేయడం వల్ల తీవ్ర ఇబ్బందులు తలెత్తుతాయని అన్నారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమించి బోర్డులను ఏర్పాటు చేసినా, వాహనాలను రోడ్లపై పార్క్ చేసినా కఠి న చర్యలు ఉంటాయన్నారు. ట్రాఫిక్ సిబ్బంది చంద్రశేఖర్, క్రాంతికుమార్, నాగరాజు, సుమన్, అక్రమ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.




# లింగమంతుల జాతర ఏర్పాట్లకు ప్రణాళికలు సిద్ధం

## అధికారులకు కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్‌పవార్ ఆదేశం



**ప్రజాపక్షం/సూర్యాపేటకలెక్టరేట్:** శ్రీలింగమంతుల స్వామి జాతర ఏర్పాట్లకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్‌పవార్ అదేశించారు. బుధవారం సూర్యాపేటలోని 5వ వార్డులోని శ్రీలింగమంతుల స్వామి దేవాలయాన్ని అదనపు కలెక్టర్ పి.రాంబాబుతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2025 ఫిబ్రవరి లో జరిగే శ్రీ లింగమంతుల స్వామి జాతర ఫిబ్రవరి 2వ తేదీన దిష్టిపూజ నిర్వహిస్తారని, ఫిబ్రవరి 16,17,18 ,19,20 తేదీలలో జాతర నిర్వహించబడుతుందని అన్నారు. జాతర ఏర్పాట్ల కోసం ప్రతి కార్యక్రమానికి ఒక ప్రత్యేక అధికారిని ఏర్పాటు చేయాలని, అధికారులు జాతర సజావుగా నిర్వహించడానికి కావాల్సిన పనుల అంచాన విలువలను సిద్దం చేయాలని అధికారులకు సూచించారు. జాతర జరుగు అన్ని ప్రాంతాల్లో సిసి కెమోరాలు ఏర్పాటు చేయాలని, పర్యవేక్షణకు ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్స్, గుడి పైన కింద ఏర్పాటు చేయాలని, అన్ని ప్రాంతాలను కవర్ చేస్తూ పబ్లిక్ ఎట్టస్టేషన్ సిస్టం ఏర్పాటు చేయాలని చెప్పారు. జాతరలో పనిచేసే సిబ్బంది అందరికి పాసులు ఉండాలని, వాలంటీర్స్ అందరికి పోలీస్ అప్రూవల్ కార్డ్సు ఉండాలని, దేవాలయం వద్ద ప్రోటోకాల్ కోసం ఒక అధికారిని నియమించాలని తెలిపారు. ప్రజాప్రతినిధులు, ప్రత్యేక అధికారులు వచ్చినప్పుడు ప్రత్యేక దర్శనం కోసం ఒక అధికారిని నియమించాలని తెలిపారు. వాటర్ సమస్యలేకుండా సోప్ పిట్స్ సిద్దం చేయాలని, రెవిన్యూ పరంగా దేవాలయం ఏరియా, చుట్టు ఉన్న భూములకు సంబంధించిన మ్యాప్‌ను సిద్దం చేయాలని సూచించారు. గుడిపైన ఏర్పాట్లను దేవాదాయశాఖ అధికారులు, గుడి కింద ఏర్పాట్లను మున్సిపల్ అధికారులు, అర్అండ్‌బి అధికారులు పనిచేయాలన్నారు. జాతర చుట్టుపక్కల రహదారులకు సుందరీకరణ చేయాలని, కోనేరు వద్ద లైటింగ్‌ను ఏర్పాటు, ప్రాంతాల వారిగా, ప్రదేశాల వారీగా ట్రాన్స్‌ఫార్మర్‌ల ఏర్పాటు చేసుకోవాలని, జాతర జరుగు సమయంలో ప్రాంతాలను శుభ్రంగా ఉంచుటకు పారిశుద్ధ్య కార్మికులను దేవాదాయ, మున్సిపల్, ఎంపిడివోలు చూడాలని కలెక్టర్ తెలిపారు. జాతర విజయవంతం కావడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో దేవాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సులోచన, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, ఐదవవార్డు కౌన్సిలర్ బాషామియా, డిఎస్పీ రవి, ఈవో కుశలయ్య, అలయ పూజారులు శ్రీశైలం, శ్రీను, తహసిల్దార్ కృష్ణయ్య, ఆర్ఐ శ్రీధర్, మిషన్ భగీరథ అధికారులు ఇంట్రా శ్రీనివాస్, గ్రిడ్ అధికారి కరుణాకర్‌రెడ్డి, ఎంపీడీవోలు, అధికారులు పాల్గొన్నారు.

## 'ప్రజాపక్షం' వార్తకు స్పందన

**ప్రజాపక్షం/సూర్యాపేటప్రతినిధి:** 'లింగన్నపట్ల నిర్లక్షమెల...! జాతర ఏర్పాట్లపై సమీక్షలేవి పాలకవర్గం లేదు... అధికారులకు పట్టింపులేదా? అంటూ ప్రజాపక్షం జిల్లా అనుబంధంలో ప్రచురించిన వార్త కథనానికి జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్‌పవార్ స్పందించారు. బుధవారం ఆయన సూర్యాపేట మున్సిపాలిటి పరిధిలోని పెద్దగట్టు శ్రీ లింగమంతుల స్వామి దేవాలయాన్ని ఆయా శాఖల అధికారులతో కలిసి సందర్శించారు. జాతర ఏర్పాట్లపై ఆయన అధికారులతో మాట్లాడారు. జాతర సమీపిస్తున్నందున ఆయా శాఖల అధికారులు నిర్వాహణ కోసం చేపట్టాల్సిన పనులపై నివేదికను రెండో రోజుల్లో అందజేయాలని అదేశించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాతర సజావుగా సాగేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అన్నిశాఖల అధికారుల సమన్వయంతో ముందుకు పోవాలన్నారు. దీనికి ముందు ఆయన లింగమంతుల స్వామి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు కలెక్టర్‌కు స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. ఆయనతో పాటు పెద్దగట్టును సందర్శించిన వారిలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, ఇవో కుశలయ్య, 5వ వార్డు కౌన్సిలర్ ఎస్‌కె బాషామియా తో పాటు ఆయాశాఖల అధికారులు ఉన్నారు.

# రూ. కోటి 39 లక్షలకు చెర్వుగట్టు తలనీలాల సేకరణ

**ప్రజాపక్షం /నార్కట్ పల్లి :** తెలంగాణ రాష్ట్రంలో శైవక్షేత్రాలలో ప్రసిద్ధిగాంచిన నల్లగొండ జిల్లా నార్కట్ పల్లి మండలం చెరువుగట్టు శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో తల నీలాల సేకరణ టెండర్ అత్యధికంగా రూ. 1 కోటి 39 లక్షలు చేరుకుంది. బుధవారం హైదరాబాద్లోని దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానం చెరువుగట్టు గ్రామం నార్కెట్పల్లి మండలం నల్లగొండ జిల్లా నాకు సంబంధించి 20.12.2024 నుండి 19.12. 2025 వరకు అనగా ఒక సంవత్సర కాలపరిమితికి తలనీలాల సేకరణ హక్కుకు తేదీ.18న అడిషనల్ కమిషనర్ ఎం. ఎం. డి. కృష్ణవేణి సమక్షంలో కమీషనర్ కార్యాలయంలో నిర్వహించారు. ఒక సంవత్సర కాల పరిమితికి నిర్వహించిన ఇట్టి బహిరంగ వేలం పాటలో 16 మంది పాల్గొనగా కొలకలూరుకు చెందిన భాస్కర్ ఇండియన్ ఎయిర్ వారు రూ. 1,39,00,000 అక్షరాలు ఒక కోటి 39 లక్షల రూపాయలకు అధిక పాట పాడి టెండర్‌ను దక్కించుకున్నారు.ఇట్టి బహిరంగ వేలం పాట లో దేవస్థాన కార్యనిర్వాహణాధికారి ఎస్. నవీన్, సీనియర్ అసిస్టెంట్ ఎస్. ఇంద్రసేనారెడ్డి, జూనియర్ అసిస్టెంట్ ఇ. శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మాతాశిశు మరణాలు లేని జిల్లాగా తీర్చిదిద్దాలి

## జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/ నల్లగొండ** : మాతా శిశు మరణాలు లేని జిల్లాగా నల్లగొండ జిల్లాను తీర్చిదిద్దేందుకు వైద్యాధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి పిలుపునిచ్చారు. బుధవారం ఆమె కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్యశాఖ పై నిర్వహించిన సమీక్ష సందర్భంగా మాట్లాడుతూ ప్రసవం సమయంలో, అలాగే ప్రసవానంతరం మాతృ మరణాలు,శిశు మరణాల వంటివి సంభవించకుండా చూసుకోవాల్సిన బాధ్యత వైద్య ఆరోగ్యశాఖ తోపాటు, సంబంధిత శాఖల పై ఉందని అన్నారు. వైద్య సేవలలో నిర్లక్ష్యం వంటి కారణాల వల్ల ఏ తల్లి బాధపడకూడదని చెప్పారు. మాత ,శిశు మరణాలు సంభవించకుండా క్షేత్రస్థాయిలో పకడ్బందీగా ట్రాకింగ్ సిస్టం ఏర్పాటు చేయాలన్నారు. మహిళ గర్భం దాల్చినప్పటి నుండి ప్రసవం అయ్యే వరకు, అలాగే ప్రసవానంతరం కూడా పూర్తిగా వైద్య ఆరోగ్యశాఖ,ఐ సి డి ఎస్ కనుసన్నల్లో ఉండేలా నెలనెలా పరీక్షలు,ఇమునైజేషన్ , పౌష్టికాహారం వంటివి అందించాలని ,నిర్ధారిత సమయానికి ప్రసవం జరిగేలా చూడాలని, ప్రసవం సందర్భంగా ఎలాంటి జబ్బులకు గురికాకుండా తల్లిని అలాగే ప్రసవించిన తర్వాత బిడ్డను క్షేమంగా ఉండేవిధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. జిల్లాలో వైద్యుల ప్రెస్క్రిప్షన్ లేకుండానే కొన్ని మెడికల్ షాపులు, ఆసుపత్రులలో అబార్షన్ కిట్ల అమ్ముతున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, వైద్యుల అనుమతి లేకుండా అబార్షన్ కిట్లు అమ్మడం, కొనడం చట్టరీత్యా నేరమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు.జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, డిప్యూటీ డిఎంహెచ్ఓ వేణుగోపాల్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి ,జిల్లా ప్రధాన ఆస్పత్రి సూపరింటిండెంట్ అరుణకుమారి సంబంధిత ఆస్పత్రుల వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.



# పేద ప్రజల పక్షాన సిపిఐ పోరాటం

**ప్రజాపక్షం/ రామన్నపేట:** స్వాతంత్ర్యం కోసం జరిగిన పోరాటంలో అనేక మంది ప్రాణ త్యాగాలు చేసిన వీర చరిత్ర గలది సీపీఐ పార్టీ అని జిల్లా సీపీఐ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి పార్టీ మండల కార్యదర్శి ఉట్కూరి నరసింహ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని అనంతరం నిర్వహించిన సమావేశంలో సీపీఐ పార్టీ వంద వసంతాల ఉత్సవాల ప్రారంభం సందర్భంగా నల్లగొండలోని ఎన్‌జీ కళాశాలలో గ్రౌండ్‌లో జరిగే బహిరంగ సభకు నాయకులు, కార్యకర్తలు, సానుభూతి పరులు ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి శివరాత్రి సమ్మయ్య, పార్టీ సీనియర్ నాయకులు బాలగోని మల్లయ్య, ఉట్కూరి భగవంతం, గంగాపురం వెంకటయ్య, రచ్చ యాదగిరి, ఐలాపురం నరసింహ తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/డిండి :** పేద ప్రజల పక్షాన సిపిఐ నిరంతరం పోరాడుతుందని సిపిఐ జిల్లా సమితి సభ్యులు తూం బుచ్చిరెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి శ్రీరామదాసు కనకాచారి అన్నారు. బుధవారం మండలంలోని గద్రాల్ తండా గ్రామ సిపిఐ శాఖ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన వారు మాట్లాడుతూ సిపిఐ పేద బడుగు బలహీన వర్గాల ప్రజల సంక్షేమం కోసం, వారి హక్కుల కోసం ప్రభుత్వాలపై పోరాడి హక్కులు సాధించిన చరిత్ర సిపిఐ పార్టీదని డిసెంబర్ 30న నల్గొండ జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాలలో జరిగే భారీ బహిరంగ సభ విజయవంతానికి పార్టీ శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రతి సభ్యులకు నూతన సభ్యత్వాన్ని అందజేశారు. ఈ సమావేశంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి బొల్లె శైలేష్, మండల కార్యవర్గ సభ్యులు ఎలిమినేటి హుస్సేన్, సోమిడి శ్రీనయ్య, తౌక్లాపూర్ శాఖ కార్యదర్శి ఛక్రి, గద్రాల్ తండా శాఖ కార్యదర్శి కిష్టానాయక్ , శాఖా సభ్యులు పాల్గొన్నారు.



# సమగ్ర ఉద్యోగులకు బిసి సంఘం అండ



**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్:** తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల కు బిసి సంఘం అండగా నిలుస్తుందని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు.జిల్లా సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో తమను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట సమగ్ర ఉద్యోగులు చేపట్టిన నిరవధిక దీక్ష బుధవారం నాటికి 9 రోజు కి చేరుకుంది,దీక్షకు శ్రీనివాస్ గౌడ్ మద్దతు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్ర శిక్ష అధ్యాపకులను రెగ్యులరైజ్ చేస్తానని వాగ్దానం చేసి ఇప్పుడు చేయకుండా మాట మారుస్తున్నారని వారిని చేసి విద్యాశాఖలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు.విద్యాశాఖలోని సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులుగా రాష్ట్రవ్యాప్తంగా 19300 మంది నల్గొండ జిల్లాలో దాదాపుగా 1100 మంది వివిధ విభాగాలుగా పనిచేస్తున్నారు. గత 20 సంవత్సరాలుగా విద్యాశాఖ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తూ వారిని రెగ్యులర్ చేయాలని కోరారు.ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే వీరికి న్యాయం చేయాలని లేని యెడల సమ్మె ఉధృతం చేస్తానికి బీసీ సంక్షేమ సంఘం నిరంతరం వెన్నంటి ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మొలుగూరి కృష్ణ ,బొమ్మగాని రాజులు,సంఘం ప్రధాన కార్యదర్శి నెలపట్ల సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ కేశ బోయిన శంకర్ ముదిరాజ్, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు నల్ల మధు యాదవ్ , జనరల్ సెక్రటరీ కందుల వెంకటేష్ గౌడ్ ,మహిళా అధ్యక్షురాలు గుమ్మల మంజులా రెడ్డి, నిలాంబరి, వసంత, సింగం జానకి తదితరులు ఉన్నారు.



# విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

## చింతపల్లి ఎంపిడిఒకు షోకాజ్ నోటీసు జారీ

## జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**ప్రజాపక్షం/చింతపల్లి:** ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలనలో నిర్లక్ష్యం వహించి, సిబ్బందికి యాప్ వివరాల నమోదుపై అవగాహన కల్పించనందుకు గాను చింతపల్లి ఎంపిడి సుజాతకు షోకాజ్ నోటీస్ జారీ చేయాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠీ ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ మండల పరిధిలోని ఘాసిరాం తండా, నసర్లపల్లి గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ముందుగా జిల్లా కలెక్టర్ మండలంలోని ఘాసిరాం తండాలో ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తు దారుల ఇండ్ల వద్దకు వెళ్లి సర్వే బృందం యాప్ లో నమోదు చేసిన వివరాలను పరిశీలించారు. పలువురి దరఖాస్తుదారుల ఇళ్లను పరిశీలించి క్షేత్రస్థాయిలో సిబ్బందికి యాప్ పరిశీలనపై ముందే అవగాహన ఎందుకు కల్పించలేదని అలాగే సర్వే పై గ్రామంలో ముందే ప్రజలకు సమాచారం ఇవ్వకపోవడంతో ఎంపిడిఓపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేసి షోకాజ్ నోటిస్ జారీ చేయాల్సిందిగా ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలనకు సర్వే బృందాలు వచ్చినప్పుడు గ్రామాలలో తప్పనిసరిగా దరఖాస్తు దారులు ఇంటి వద్ద ఉండాలని, ఇంటి ముందు నిలబడి ఫోటోతో సహా యాప్‌లో అప్లోడ్ చేసేలా ఫొటో దిగి సంబంధించిన ధ్రువపత్రాలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. గతంలో ఏదైనా కారణం చేత ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ సందర్భంగా దరఖాస్తు చేసుకో లేకపోయిన వారు ఇప్పుడు ఎంపీడీవో కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాలలో ఏర్పాటుచేసిన ప్రజా పాలన మీసేవ కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ఏవైనా సందేహాలు ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 18004251442కు ఫోన్ చేయాలన్నారు. దేవరకొండ ఆర్డిఓ రమణారెడ్డి, గృహ నిర్మాణ శాఖ పిడి రాజ్‌కుమార్, సర్వే బృందాలు ఉన్నాయి.

# క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి కోమటిరెడ్డి

**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్:** కోమటిరెడ్డి యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో నల్గొండలోని ఎన్జీ కళాశాల ఆవరణలో ఈనెల 25వ తేదీ నుంచి జరిగే కెవిఆర్ కప్పు సీజన్1 క్రికెట్ పో టీల పోస్టర్స్ ను రాష్ట్ర రోడ్డు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి బుధవారం హైదరాబాదులోని ఫిలిం ఛాంబర్ లో ఆవిష్కరించారు.క్రీడాకారులను ప్రోత్సహించేందుకు జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ను ఏర్పాటు చేయడం పట్ల నిర్వాహకులను మంత్రి కోమటిరెడ్డి అభినందించారు.ఈ కార్యక్రమంలో కెవిఆర్ కప్పు ఆర్గనైజర్స్ నంద్యాల వీర బ్రహ్మానందరెడ్డి, నరేందర్ యాదవ్, మందడి వెంకట్ రెడ్డి, ఉమర్ షరీఫ్, గుండగోని సాయి, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ జహంగీర్ బాబా తదితరులు పాల్గొన్నారు.




# సేవకు 'జై'... ప్రజా సమస్యల పరిష్కారంలో 'వీరుడు'!



**ప్రజాపక్షం/ హాలియా:** ఒకవైపు ప్రజాసేవ చేస్తూనే... మరోవైపు సామాజిక సేవకు శ్రీకారం చుట్టి తన సొంత ఖర్చులతో నియోజకవర్గంలోని పలు సేవా కార్యక్రమాలు చేపడుతు తోటి ఎమ్మెల్యేలకు ఆదర్శంగా నిలుస్తున్నాడీ యువ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి. ట్రస్టులు, ఫౌండేషన్ సంస్థ లు ఇవేవీ చెప్పకుండా తన సొంత ఖర్చులతో అత్యవసరం అనుకున్న పనులకు ఎంతైనా వెచ్చించి వాటిని పరిష్కరించే వరకు వెను తిరగకుండా పనిచేసే పలువురి చేత శభాష్ యువ నాయకుడా అనిపించుకుంటున్నాడు. నాగార్జునసాగర్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందిన కుందూరు జై వీర్ రెడ్డి ఏడాది కాలంలో ఎమ్మెల్యే నిధులతో సంబంధం లేకుండా తన సొంత నిధులతో తన దృష్టికి వచ్చిన ప్రధాన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తూ ప్రజలతో మమేకం అవుతున్నారు. గతంలో ఉన్న ఎమ్మెల్యేలకు భిన్నంగా ప్రస్తుత ఎమ్మెల్యే జై వీర్ రెడ్డి సుమారు కోటి న్నర రూపాయలతో నియోజకవర్గంలోని వివిధ సామాజిక సేవ కార్యక్రమాలు చేపట్టారు. ప్రధానంగా ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లోని వసతి గృహాలలో ఉంటున్న బాలికల ఇబ్బందులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఎమ్మెల్యే జై వీర్ రెడ్డి చలికాలంలో సరైన దుప్పట్లు లేక అవస్థలు పడుతున్న తీరును చూసి చెలించారు. మొత్తం నియోజకవర్గంలో ఉన్న అన్ని ప్రభుత్వ వసతి గృహాలలో నివాసముంటున్న బాలికలకు తన సొంత ఖర్చులు సుమారు రూ.75 లక్షలు వెచ్చించి 7500 రగ్గులను పంపిణీ చేసి ఔరా అనిపించారు. దీంతోపాటు సాగర్ లోని బీసీ గురుకులం వద్ద విద్యార్థులు రోడ్డు దాటుతూ ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని గ్రహించిన ఆయన స్కై వేను ఏర్పాటు చేస్తానని విద్యార్థులకు హామీ ఇచ్చి సుమారు 50 లక్షలు రూపాయలతో వాటి పనులకు శ్రీకారం చుట్టారు. దీనితోపాటు హాలియాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు కూర్చునేందుకు రూ.20లక్షలతో డబుల్ డెస్క్ బెంచీలు ఏర్పాటు చేస్తానని తయారు చేయించారు. ఇవే కాక వికలాంగులకు కూడా ట్రై సైకిల్లు ఇస్తానని చెప్పి అనుకున్నదే తడువుగా వాటిని మొదటి విడత కొంత మంది వికలాంగులకు అందజేశారు. దశలవారీగా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు తాను ప్రణాళికలు సిద్ధం చేసుకున్నట్లు ఎమ్మెల్యే పలు సమావేశాలలో ప్రజలకు చెబుతున్న తీరు ఆకట్టుకుంటుంది.



## 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా కార్యాచరణ

జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** రాబోయే మార్చి నెలలో జరిగే పదవ తరగతి పరీక్షలలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా కార్యాచరణ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. బుధవారం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణపై కలెక్టర్ సుదీర్ఘంగా సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాబోయే మార్చి నెలలో జరిగే పదవ తరగతి పరీక్షల కోసం ఇప్పటి నుండి ప్రణాళిక సిద్ధం చేసుకుని విద్యార్థుల స్థాయిని పెంచి వారి సామర్థ్యాల ప్రకారం మంచి ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ పాఠశాలలో ప్రతిరోజు ఉదయం సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, విద్యార్థులకు ప్రతిరోజు ఏదో ఒక సబ్జెక్టులో పరీక్ష పెట్టాలని, రాబోయే మూడు నెలల పాటు ప్రతి పదవ తరగతి విద్యార్థి పాఠశాలకు వచ్చే విధంగా చూసుకోవాలని, ఉన్నత పాఠశాలలోనే హెడ్ మాస్టర్ ప్రతి సబ్జెక్టు ఉపాధ్యాయులు పిల్లలను దత్తత తీసుకొని పదవ తరగతి పరీక్షలకు ప్రిపేర్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి డి. మాధవి, జిల్లా సమగ్ర శిక్ష సమన్వయకర్త పిఎం షేక్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అవార్డు గ్రహీత దినేష్‌ను సత్కరించిన ఎఐటియుసి నాయకులు




**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్, ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు కామ్రేడ్ మద్దెల దినేష్‌కు డిసెంబర్ 15న డిల్లీలో బహుజన సాహిత్య అకాడమీ జాతీయ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన 17వ కాన్ఫరెన్స్‌లో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ నేషనల్ అవార్డు అందజేసిన సందర్భంగా బుధవారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్‌లో దినేష్‌ను ఎఐటియుసి నాయకులు శాలువా కప్పి పూలగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలపడం జరిగింది. ఈ కార్యక్రమానికి సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ దినేష్ సేవలను గుర్తించి బహుజన సాహిత్య అకాడమీ జాతీయ సంస్థ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ నేషనల్ అవార్డు ఇవ్వడం పట్ల ఆయనను అభినందిస్తూ, బడుగు బలహీన వర్గాల ప్రజల సమస్యల కోసం , వారి అభివృద్ధి కోసం దినేష్ నిరంతరం కృషి చేయడం జరిగిందని, భవిష్యత్తులో దినేష్ మరిన్ని అవార్డులు అందుకోవాలని, ప్రజలకు మరిన్ని సేవలు అందించి వారి మన్ననలు పొందాలని ఆయన ఆకాంక్షించారు. ఎఐటియుసి నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.ఎ.గౌస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమం లో దళిత హక్కుల పోరాట సమితి నగర కార్యదర్శి ఎర్రల రాజయ్య, సిపిఐ నగర కార్యవర్గ సభ్యులు తొడుపునూరి రమేశ్ కుమార్, ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ సభ్యులు గంగారపు ప్రసాద్‌తో పాటు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## భూనిర్వాసితులకు పరిహారం

మంత్రికి పిఏసిఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్ వినతి



**ప్రజాపక్షం/మంథని :** నేషనల్ గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు సరైన నష్టపరిహారం అందించాలని పిఏసిఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్ మంత్రి శ్రీధర్‌బాబును కోరారు. బుధవారం హైదరాబాద్‌లోని మినిష్టర్ క్యాంపు కార్యాలయంలో నిర్వాసిత రైతులతో మంత్రిని కలిసిన ఆయన వినతిపత్రం అందజేశారు. మంథని మండలం పుట్టపాక గ్రామం మీదుగా నేషనల్ గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం జరుగుతోందని, ఈ హైవే నిర్మాణంలో రైతులకు చెందిన భూములు కోల్పోతున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. భూములు కోల్పోతున్న ప్రతి రైతుకు సరైన పరిహారం అందేలా కృషి చేయాలని ఆయన మంత్రిని కోరారు. అర్హులైన ప్రతి రైతుకు అండగా నిలిచి ఆదుకోవాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించి రైతులను న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానని భరోసా ఇచ్చినట్లు కొత్త శ్రీనివాస్ తెలిపారు.ఈ కార్యక్రమంలో పోరెడ్డి తిరుపతిరెడ్డి, చాట్లపల్లి సంతోష్, శీలం ప్రభాకర్, గణేష్, ఈసంపల్లి చంద్రమూర్తి, మిట్ట రాజశేఖర్, రేసు అచ్చిబాబు, రొడ్డ సాయికృష్ణతో పాటు రైతులు పాల్గొన్నారు.

## నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు భోజనం

**ప్రజాపక్షం/ముత్తారం:** మంత్రి ఇలాకాలోని పెద్దపల్లి జిల్లా మంథని నియోజకవర్గ ముత్తారం మండలంలోని దర్యాపూర్ మోడల్ పాఠశాలలో గత వారం రోజులుగా మధ్యాహ్నం భోజనం బందు చేసిన పట్టించుకున్న వారే కరువయ్యారని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ విమర్శించారు. బుధవారం ముత్తారం మండల కేంద్రంలోని దర్యాపూర్ మాడల్ పాఠశాలలో గత వారం రోజుల నుండి మధ్యాహ్నం భోజనం నిర్వహించడం లేదని తెలుసుకున్న పుట్ట మధు పాఠశాలను స్థానిక బిఆర్ఎస్ నాయకులతో కలిసి పాఠశాలను పుట్ట మధు సందర్శించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పాఠశాల అధ్యాపకులతో మధ్యాహ్నం భోజనం నిలుపుదల అంశంపై మాట్లాడారు. అనంతరం పుట్ట మధు మాట్లాడుతూ కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను గాలికి వదిలేసిందని మంత్రి ఇలాకలలోనే మధ్యాహ్నం భోజనం నిలిచిపోయి వారం రోజులు గడుస్తున్నప్పటికీ కాంగ్రెస్ పార్టీ నాయకులు పట్టించుకోకపోవడం దారుణం అన్నారు. మధ్యాహ్నం భోజనం నిర్వాహకులకు ఎనిమిది నెలలుగా బిల్లులు చెల్లించకపోవడమే దీనికి ప్రధాన కారణమన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇప్పటికైనా కళ్ళు తెరచి విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు ఆలోచన చేయాలని వారు అన్నారు.నిరుపేద విద్యార్థులు చదివే సర్కారు పాఠశాలలను పట్టించుకోడమే కాంగ్రెస్ ప్రభుత్వం మానేసిందని,కనీసం పాఠశాలలో విద్యుత్తు సదుపాయాలు, వంటగది, తదితర సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిరుపేద విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సౌకర్యం కల్పించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరు మంత్రి శ్రీధర్ బాబు ఇలాకలో జరుగుతున్న అధికారులు ఎవ్వరు కూడా పట్టించుకోవడం లేదని పుట్ట మధు అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పోతుపెద్ది కిషన్ రెడ్డి,మాజీ ఎంపీపీ జక్కుల ముత్తయ్య, సింగిల్ విండో మాజీ చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి, సర్పంచుల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు నూనె కుమార్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ నాంసాని సమ్మయ్య, మాజీ సర్పంచ్ గాదం స్రవంతి శ్రీనివాస్ తదితరులు



# బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి

జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహ నిర్మూలన అధికారులతో బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో సమావేశం నిర్వహించి మాట్లాడారు. బాల్య వివాహాలు చేస్తే కుటుంబ సభ్యులపై, వివాహాలు జరిపించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో ఈ సంవత్సరం అధికారులు నిలిపివేసిన 15 బాల్య వివాహాలకు సంబంధించి ప్రస్తుత పరిస్థితిపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిపించినా, ప్రోత్సహించినా వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాల్య వివాహ నిర్మూలన అధికారులుగా ఉన్న ఆర్‌డిఓలు, ఎంఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు తమ పరిధిలో బాల్య వివాహాలు జరగకుండా చూడాలని ఆదేశించారు. బాల్య వివాహ రహిత భారతదేశం కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకోవడం హర్షణీయమన్నారు. బాలల హక్కులు కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, ప్రజలు భాగస్వామ్యం కావాలని సూచించారు. బాల్ వివాహ్ ముక్త్ భారత్ కోసం క్షేత్ర స్థాయిలో ప్రచారం చాలా ముఖ్యమన్నారు. స్వచ్ఛంద సంస్థలు, అధికార యంత్రాంగం కలసి పనిచేస్తే బాల్య వివాహాలు పూర్తిగా నిర్మూలించవచ్చని తెలిపారు. చైతన్యంతోనే ఈ బాల్య వివాహాల నిర్మూలన సాధ్యమన్నారు. బాల్య వివాహాల విషయంలో బాలికలు బలి అవుతున్నారని అభిప్రాయపడ్డారు. బాల్య వివాహాల నిర్మూలనకు ఇది వరకే ఉన్న విలేజ్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ (విసిపిసి)లను బలోపేతం చేయాలని మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. వివిధ కమ్యూనిటీల పెద్దలతో సమావేశం ఏర్పాటు చేసి బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. బాల్య వివాహాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి అక్కడ చట్ట ప్రకారం తీసుకునే చర్యలను గుర్తించిన సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, జిల్లా సంక్షేమ అధికారి సబితా, డిసిపిఓ పర్వీన్, సిడబ్ల్యూసి చైర్మన్ ధనలక్ష్మి, ఆర్డీవోలు, ఎమ్మార్వోలు పాల్గొన్నారు.

### పోషకాహార లోపం లేని జిల్లాగా రూపొందాలి

కరీంనగర్ జిల్లాను పోషకాహార లోపం లేని జిల్లాగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో బుధవారం పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా పోషణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖల సమన్వయంతో పనిచేస్తూ పోషణ లోపం లేని జిల్లాగా మార్చాలని ఆదేశించారు. జిల్లాలో తీవ్ర లోప పోషణతో ఉన్న పిల్లలను గుర్తించి వారిని వైద్యశాఖ సహకారంతో ఎన్ఆర్‌సికి పంపించాలన్నారు. ఎన్ఆర్‌సిలో ప్రత్యేక ఆహారం, చికిత్స ద్వారా పిల్లలు పరిపూర్ణ ఆరోగ్యవంతులుగా తయారవుతారన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాల ద్వారా పోషణ వాటిక ప్రాముఖ్యతను గురించి పిల్లలకు వివరించాలన్నారు. మునగ, కరివేప, నిమ్మ వంటివి ఆహారంలో బాగంగా తీసుకోవాలని చెప్పారు. దీనివల్ల రోగనిరోధక శక్తి పెరగడంతో పాటు ఐరన్ వంటి పోషకాలు అందుతాయన్నారు. ప్రతి శుక్రవారం నిర్వహించే సభలో అన్ని శాఖలకు సంబంధించిన అధికారులు పాల్గొనాలని సూచించారు. పోషకాహారం పట్ల గ్రామాల్లో, వార్డుల్లో ప్రజలందరికీ అవగాహన కల్పించాలని తెలిపారు. తాగునీరు కలుషితం కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, జిల్లా సంక్షేమ అధికారి సబితా, వైద్య అధికారి వెంకటరమణ, డిఇఓ జనార్ధన్ రావు, డిపిఓ రవీందర్, సిడిపిఓలు, పోషణ అభియాన్ సిబ్బంది పాల్గొన్నారు.

## అభ్యర్థనలు, విన్నపాలపై ప్రభుత్వానికి పూర్తిస్థాయి నివేదిక

ఎస్‌సి ఏకసభ్య కమిషన్ డా.జస్టిస్ షమీమ్ అక్తర్



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** ఎస్‌సి కులాల ఉపవర్గీకరణ కోసం నిర్వహించిన బహిరంగ విచారణలో తమ దృష్టికి వచ్చిన అభ్యర్థనలు, విన్నపాలపై పూర్తిస్థాయి నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి అందజేస్తామని ఎస్‌సి ఏకసభ్య కమిషన్ డా.జస్టిస్ షమీమ్ అక్తర్ వెల్లడించారు. ఈ నేపథ్యంలో వివిధ ఎస్‌సి కులాల నుంచి వినతి పత్రాలు స్వీకరిస్తున్నామని తెలిపారు. కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల విచారణ కమిషన్ ఆధ్వర్యంలో బుధవారం షెడ్యూల్డ్ కులాల్లో ఉప వర్గీకరణపై వివరణాత్మక అధ్యయనం కోసం కరీంనగర్ ఉమ్మడి జిల్లా పరిధిలో బహిరంగ విచారణ నిర్వహించారు. వర్గీకరణపై ఉమ్మడి జిల్లా పరిధిలోని వివిధ కుల సంఘాలు ఇచ్చిన దరఖాస్తులను ఏకసభ్య కమిషన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఏకసభ్య కమిషన్ డా.జస్టిస్ షమీమ్ అక్తర్ మాట్లాడుతూ షెడ్యూల్డ్ వివిధ ఎస్‌సి కుల సంఘాల నుంచి 128 వినతులు, అభ్యర్థనలు అందాయని తెలిపారు. ఎస్‌సి వర్గీకరణకు సంబంధించిన న్యాయపరమైన అంశాలు, ఉద్యోగ, సామాజిక పరిస్థితులు, చరిత్రాత్మక వ్యవహారాలను అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం కమిషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల కుల సంఘాల అభ్యర్థనలు, వినతులు సేకరించి ప్రభుత్వానికి పూర్తిస్థాయి నివేదిక అందిస్తామని పేర్కొన్నారు. బహిరంగ విచారణ జరగక ముందు కలెక్టర్ పమేలా సత్పతి ఏకసభ్య కమిషణ్ డా.జస్టిస్ షమీమ్ అక్తర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూల మొక్కను అందజేశారు. పలు అంశాలను చర్చించారు. అనంతరం సోషల్ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో డా.జస్టిస్ షమీమ్ అక్తర్‌ను ఘనంగా సన్మానించారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లా పరిధిలో కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల నుంచి ఎస్‌సి కుల సంఘాల నాయకులు, ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగులేశ్వర రావు, ఆర్‌డిఒ కె.మహేశ్వర్, జగిత్యాల డిఎస్‌పి డిఒ రాజకుమార్, సిరిసిల్ల డిఎస్‌సిడిఒ విజయలక్ష్మి, ఎస్‌డబ్ల్యుఒలు తిరుపతి, విజయపాల్ రెడ్డి, పలువురు అధికారులు, వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

### మల్కాపూర్‌లో ఎస్‌సి కాలనీ సందర్శన

కొత్తపల్లి మండలం మల్కాపూర్ గ్రామంలోని ఎస్‌సి కాలనీని ఏకసభ్య కమిషన్ డా.జస్టిస్ షమీమ్ అక్తర్ అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్‌సిలతో ప్రత్యేకంగా మాట్లాడారు. వసతుల కల్పన, మౌలిక సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఏమైనా ఉన్నాయా? అని తెలుసుకున్నారు. ఏమైనా ఇబ్బందులు, సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని కాలనీ వాసులకు సూచించారు.

## కాంట్రాక్టు కార్మికులకు హై పవర్ కమిటీ వేతనాలు అమలు

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న పటేల్ డిమాండ్

**ప్రజాపక్షం/ రామగిరి :** సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు హై పవర్ కమిటీ వేతనాలు అమలుకు అసెంబ్లీ సమావేశాల్లో నిర్ణయాలు చేయాలని ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న పటేల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం రామగుండం ఆర్జీ 3 ఒసిపి1 గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా ఈనెల 19, 20, 21, తేదీలలో డిమాండ్స్ డేగా నిర్వ హించాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎస్‌సిసిడబ్ల్యుయుఐఎఫ్‌టియు) రాష్ట్ర కమిటీ నిర్ణయించడం జరిగిందని రాష్ట్ర కమిటీ నిర్ణయాల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సింగరేణిలో పనిచేస్తున్నటువంటి కాంట్రాక్టు కార్మికులకు 100 రోజుల వేతనాలు పెంచుతామని గెలిచిన ఎమ్మెల్యేలు, మంత్రులు కార్మిక వర్గానికి మాట ఇచ్చి సంవత్సరం గడిచిపోయిందనీ ఇప్పటివరకు రెండు సార్లు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించడం జరిగిందని కానీ ఈ సమావేశాల్లో కోల్బెల్ట్ ఎమ్మెల్యేలు ప్రభుత్వం దృష్టికి సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల సమస్యను అసెంబ్లీలో మాట్లాడి తీసుకు వెళ్లినప్పటికీ ప్రభుత్వము నుండి ఎలాంటి స్పందన లేదనీ అదేవిధంగా డిప్యూటీ సిఎం ఈ యొక్క కాంట్రాక్ట్ కార్మికుల జీవన విధానం వేతనాలపై ప్రత్యేక అనుభవాన్ని ఎన్నో దపాల మీటింగ్‌లో చెప్పడం జరిగిందనీ అయినా కార్మికుల వేతనాల పెంపుదల విషయంలో ప్రభుత్వం జాప్యం చేయడం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వాలు సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులను పట్టించుకోకపోవడంతో కార్మిక వర్గం కోల్ బెల్ట్ ఏరియా మొత్తం కాంగ్రెస్ పార్టీని గెలిపించడం జరిగిందనీ కాబట్టి ఇప్పటికైనా ఈ ప్రభుత్వం కార్మిక వర్గానికి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని గత ప్రభుత్వాలు అనుసరించిన విధానాలను తిరిగి పునరావృతం కాకుండా చూసుకోవాలని, అదే విధంగా సింగరేణి వ్యాప్తంగా కాంట్రాక్ట్ కార్మికులు మూడు రోజులు డిమాండ్స్ ప్లే కార్డ్స్‌తో తమ నిరసనను తెలియజేయాలని ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే హై పవర్ కమిటీ వేతనాలు అమలుకు చర్యలు తీసుకోవాలని కార్మిక వర్గం నుండి మరో మారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో రాజనర్సు, నరసయ్య, రమేష్, శ్రీనివాసు, సురేష్ ,సంపత్, తదితరులు పాల్గొన్నారు.



## బోనాలతో ఎస్ఎస్ఎ ఉద్యోగుల నిరసన



**ప్రజాపక్షం/కరీంనగర్ :** సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులు కలెక్టరేట్ వద్ద చేపట్టిన సమ్మె బుధవారానికి 9వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పోచమ్మ బోనాలతో, పోతరాజు వేషాలతో వినూత్న నిరసన తెలియజేశారు. తమను రెగ్యులరైజ్ చేయాలని పోచమ్మ తల్లిని వేడుకున్నారు. అనంతరం బోనం సమర్పించారు. 9వ రోజు నిరవధిక సమ్మెకు తీన్మార్ మల్లన్న టీం జిల్లా అధ్యక్షుడు అఖిల్ పాషా, తెలంగాణ మెడికల కౌన్సిల్ ఇసి మెంబర్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి డా.బండారి రాజ్‌కుమార్‌లు బుధవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతేడాది సెప్టెంబర్ 13న పిసిసి అధ్యక్షుని హోదాలో ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగులు హన్మకొండలో ఏకశిల పార్కు వద్ద చేస్తున్న దీక్ష శిబిరాన్ని సందర్శించి కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే వంద రోజుల్లో సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చార్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల ప్రధాన డిమాండ్లు మినిమం టైమ్ స్కేల్, జీవిత బీమా, హెల్త్ కార్డులు, సమగ్ర శిక్ష మహిళా ఉద్యోగులకు 108 రోజులు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు, 61 సంవత్సరాలు నిండిన ఉద్యోగులకు 20 లక్షల రిటైర్మెంట్ బెనిఫెట్స్, మరణించిన ఉద్యోగ కుటుంబాలకు 15 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు చాలీచాలని వేతనంతో అత్యంత దుర్భర పరిస్థితులలో జీవనం గడుపుతున్నారని, వారికి కనీస వేతనాలు ప్రకటించి అందిస్తే వారు ఆనందంగా వారి వృత్తి నిర్వహణలో ప్రభుత్వానికి, ఇటు ఉపాధ్యాయులకు మధ్య వారధిగా ఉంటూ కార్యనిర్వహణలో అంకితభావంతో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు బెజ్జంకి ఆంజనేయులు, జిల్లా అధ్యక్షుడు గుండా రాజిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్, జిల్లా ఉపాధ్యక్షులు రమేష్, రవిచంద్ర, బి.శ్రీకాంత్, కెజిబివి ప్రత్యేక అధికారులు తదితరులున్నారు.

## రూ.224 కోట్ల సిఆర్ఐఎఫ్ నిధులు మంజూరు చేయండి

కేంద్ర మంత్రి గడ్కరీకి బండి సంజయ్ వినతి

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గంలోని గ్రామాలకు రవాణా సదుపాయాలను మెరుగపర్చేందుకు రూ.224 కోట్ల మేరకు సెంట్రల్ రోడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (సిఆర్ఐఎఫ్) నిధులు మంజూరు చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ బుధవారం కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఢిల్లీలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కరీంనగర్ పార్లమెంటరీ నియోజకవర్గంలోని గ్రామీణ రోడ్లు, వంతెనల అభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై గడ్కరీ దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా సింగిల్ లేన్ నుంచి డబుల్ లేన్ రోడ్ల విస్తరణ పనులకు సంబంధించిన ప్రతిపాదనను ఆయన ముందుంచారు.హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం సహా మొత్తం 90 కిలోమీట్ల మేరకు రోడ్డు విస్తరణ పనులకు గాను రూ.224 కోట్ల నిధులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రి గడ్కరీకి బండి సంజయ్ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సానుకూలంగా కేంద్ర మంత్రి గడ్కరీ త్వరలోనే తగిన నిర్ణయం తీసుకుంటామని బండి సంజయ్‌కు హామీ ఇచ్చారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఇప్పటికే సిఆర్ఐఎఫ్ నిధులతో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనుల పురోగతిపై గడ్కరీ ఆరా తీశారు.




## సిపిఆర్‌పై ప్రతీ ఒక్కరికీ అవగాహన

అదనపు కలెక్టర్ డి. వేణు




**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** ప్రజల ప్రాణాలు సంరక్షించేందుకు ఉపయోగపడే సిపిఆర్ ప్రక్రియపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అదనపు కలెక్టర్ డి. వేణు అన్నారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్‌డిఆర్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ బబ్లు విశ్వాస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని వివిధ శాఖల ఉద్యోగులకు నిర్వహించిన సిపిఆర్ శిక్షణా కార్యక్రమంలో పాల్గొని అనంతరం మాట్లాడుతూ సిపిఆర్ ప్రక్రియపై ప్రతి ఉద్యోగి అవగాహన కలిగి ఉండాలని, ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది విపత్కర పరిస్థితుల్లో సేవలు అందిస్తారని, ఇటీవల కాలంలోఆకస్మికంగా గుండెపోటు వచ్చి చాలామంది మరణిస్తున్నారని, యువకులు కూడా గుండెపోటుతో మరణించడం విషాదకరమని, ఆకస్మిక గుండెపోటు సమయంలో సిపిఆర్ చేయడం వల్ల ప్రాణాలు సంరక్షించే అవకాశాలు 50 శాతం మెరుగవుతాయన్నారు. సిపిఆర్ చేసే విధానంపై కార్యక్రమంలో విపులంగా ఎన్‌డిఆ రెఫ్ ఇన్‌స్పెక్టర్ బబ్లూ విశ్వాస్ వివరించారు. అపస్మారక దశలో ఉన్న వ్యక్తి ని ముందుగా సమతులంగా ఉన్న నేలపై వెల్లకిలా పడుకో బెట్టాలని, తర్వాత ఆ వ్యక్తి గడ్డాన్ని కొద్దిగా ఎత్తి పట్టుకోవాలని, దీనివల్ల శ్వాసక్రియ సాఫీగా సాగే వీలుందని, ఆ పై తల దగ్గరబెట్టి ఊపిరి తీసుకుంటున్నది లేనిది నిర్ధారణ చేసుకోవాలని, ఊపిరి తీసుకోవడం లేదని తెలిసిన తర్వాత ముక్కు రెండు రంధ్రాలను మూసివేసి నోట్లో నోరు ఉంచి గాలి ఊదాలనీ, ప్రాణం ఉన్నట్లు కదలిక కానీ, ఊపిరి తీసుకోవడం లే ని సందర్భంలో ఛాతీపై ఒత్తిడి కలిగించేందుకు సిద్ధం కావాలని, ఛాతీ ఎముక కిందుగా మధ్యలో రెండు చేతులను ఉంచి క్రిందికి నొక్కడం, పైకి వదలడం చేయాలనీ, ఒకవైపు సిపిఆర్ చేస్తూనే మరో ప్రక్క అంబులెన్స్ వాహనం తెప్పించాలని, సిపిఆర్‌లో చేతితో కంప్రెషన్ మొదలు పెట్టిన తర్వాత 100 నుండి 120 వరకు ప్రతి నిమిషానికి చేయాలనీ, ఇలా అంబులెన్స్ వచ్చే వరకు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అవినీతికి కేరాఫ్.. జగిత్యాల ఆర్‌టిఓ ఆఫీస్?



**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ :** జగిత్యాల ఆర్‌టిఓ కార్యాలయంలో అవినీతి రాజ్యమేలుతొంది...! అక్కడ ఏ పని కావాలన్నా చేయాల్సింది బ్రోకరే, అధికారులు ప్రజలకు ఏ పనీ నేరుగా చేయారు. డ్రైవింగ్ లైసెన్స్, లైసెన్స్ రెన్యువల్, వాహన రిజస్ట్రేషన్ కోసం వెళ్ళగానే సిబ్బంది అడిగే మొదటి ప్రశ్న ఎవరి తరుపున అని బ్రోకర్ ఉంటే ఫైల్ ఎలా ఉన్నా ఒకే, బ్రోకర్ లేకుంటే ఫైల్ పక్కకే....! అక్కడ లంచం తీసుకుంటున్నామనే అపవాదం ఆర్‌టిఓ కార్యాలయ అధికార సిబ్బందికి రావొద్దనీ కావచ్చు బ్రోకర్ దగ్గర నుంచి వస్తె ఏ సమస్యా ఉండదు. ఈ తతాంగం అంతా ఆర్‌టిఓ కార్యాలయంలో నిరంతరం కొనుసాగుతున్నా ప్రక్రియే కానీ పట్టించుకునే నాథుడు ఉండడు. జగిత్యాల జిల్లా గత ఉన్నధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం వలన లేక ఏమో తెలియదు కానీ ఎవరేం చేస్తారనే ధైర్యంతో రవాణా శాఖ ఉన్నతాధికారులు రూట్ మార్చి వారీ రేటు సపరేటు అనే విధంగా బ్రోకర్లు అధికారులు మూడు ఫిట్నెస్లులు ఆరు రిజిస్ట్రేషన్లతో జగిత్యాల ఆర్‌టిఓ కార్యాలయాన్ని అవినీతి సామ్రాజ్యంగా చేసి వసూళ్ల పర్వాన్ని కొనసాగిస్తున్నారు అని తెలిసింది. ఆర్‌టిఓ కార్యాలయంలో డ్రైవింగ్ లైసెన్సు కోసం వెళ్లినా, రెన్యూవల్ చేయించాలన్నా, వాహనం ఫిట్‌నెస్ కోసం వెళ్లినా నేరుగా ఏ పనీ కాదు కాకూడదు అని మనకు చెప్పకుండానే చెప్తారటా ఆర్‌టిఓ కార్యాలయ సిబ్బంది అనే విమర్శలు ఉన్నాయి. ఆర్‌టిఓ కార్యాలయంలో నేరుగా ఏ పని చేసుకోవాలాన్నా దానికి సవాలక్ష కారణాలను చూపి అధికారులు ఫైల్‌ను మూలకేస్తారు. కార్యాలయం చుట్టూ తిరిగి విసుగేసిన ప్రజలు గత్యంతరం లేక బ్రోకర్లను ఆశ్రయిస్తున్నారు. సామాన్యులు నేరుగా వెళ్తే రాని అడ్డంకులు బ్రోకర్ల కోడ్‌తో వెళ్లగానే చిటుక్కున పని అయిపోతున్న పరిస్థితే జగిత్యాల ఆర్‌టిఓ కార్యాలయంలో నిత్యం కన్పిస్తోందని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఇక్కడ బ్రోకర్ల హావతోనే అధికారులు నడుచుకుంటున్నారు అని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేవలం1,000 చలానాకు రూ. 3,000 వరకు వసూలు చేస్తూ అందులో కొంత కార్యాలయంలోని కింది స్థాయి నుంచి పైస్థాయి వరకు ఉన్న సిబ్బందికి సర్వీసు టాక్స్‌గా అందజేస్తున్నారు అని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. జగిత్యాల ఆర్‌టిఓ కార్యాలయంలో ఒక్క రోజు ఒక్కో బ్రోకర్ల ఆదాయం కనీసం ముప్పై వేల నుంచి నలభై వేల వరకు అంచనా ఉంటుంది అంటే నమ్ముతారా కానీ నమ్మాలి. ఇప్పటికైనా జగిత్యాల జిల్లా ఉన్నతాధికారులు జగిత్యాల ఆర్‌టిఓ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసి జగిత్యాల ఆర్‌టిఓ కార్యాలయ అధికార, సిబ్బంది బ్రోకర్ల అవినీతి సామ్రాజ్య విధి విధానాలను పూకట్టివేళ్ళతో పీకేసి సామాన్య ప్రజలకు అవినీతి లేని జగిత్యాల ఆర్‌టిఓ కార్యాలయంగా మార్చలని కోరుతున్నారు. మిగిలిన అవినీతి మరొకసారి మీ ముందుకు మా ప్రజాపక్షం దినపత్రికలో తీసుకువస్తాం.



### అందరికీ రూల్... సార్‌కు కాదు....!

ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని, లేకపోతే జరిమానాలు తప్పవనీ, ప్రతి వాహనంకు ముందు, వెనక తప్పనిసరిగా నెంబర్ ప్లేట్లు అమర్చుకోవాలనీ, నంబర్ ప్లేట్స్ లేకుండా వాహనాలు నడపడం వంటివి చేయడం చట్టరీత్యా నేరమనీ రవాణా శాఖ అధికారులు వాహనదారులకు చెప్తారు. కానీ జగిత్యాల వాహనాలను తనిఖీ చేసే జగిత్యాల ఆర్‌టిఓ అధికారి కారుకే నెంబర్ ప్లేట్ లేకపోవడం జగిత్యాలలో చర్చనీయాంశంగా మారిందనీ పలువురు తెలిపారు. అందరికీ రూల్ సర్ కు కాదు....! అంటు జగిత్యాల ఆర్‌టిఓ అధికారి వాహనానికి నెంబర్ ప్లేట్ లేకపోవడంతో దీనిపై సామాన్య ప్రజలు విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికైనా జగిత్యాల ఆర్‌టిఓ అధికారి వాహనానికి నెంబర్ ప్లేట్ అమర్చాలని సామాన్య ప్రజలు కోరుతున్నారు.




# అంబేద్కర్‌ను అవమానిస్తే దేశం సహించదు

## పార్లమెంట్ ఆవరణలో ఇండియా కూటమి ఎంపిలు నిరసన ప్రదర్శన



**న్యూఢిల్లీ :** బాబా సాహెబ్ అంబేద్కర్‌ను అవమానిస్తే దేశం సహించదని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. రాజ్యసభలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలపై భేషరతుగా ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బిజెపి అంబేద్కర్, ఆయన సిద్ధాంతాలకు వ్యతిరేకమని రాహుల్ విమర్శించారు. బుధవారం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ సహా ఇండియా కూటమికి చెందిన పలువురు ఎంపిలు పార్లమెంట్ మకరద్వారం మెట్ల ముందు అంబేద్కర్ ఫొటోలతో కూడిన ప్లకార్డులను చేబూని లైన్ నిలబడి నిరసన తెలిపారు. 'జై బీమ్, సంఘ్ కా విధాన్ నహి చలేగా, అమిత్ షా మాఫియా మాంగో' అంటూ నినదించారు. ఈ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్, డిఎంకె, ఆర్‌జెడి, వామపక్షాలు, ఆప్ సహా ఇతర ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఎంపిలు పాల్గొన్నారు. నిరసనకు సంబంధించిన ఫొటోలను రాహుల్‌గాంధీ ఫేస్‌బుక్‌లో పోస్టు చేశారు. 'భారత్ రాజ్యాంగ నిర్మాత, దేశానికి దిశానిర్దేశం చేసిన మహనీయుడు అంబేద్కర్. ఆయనను, ఆయన రూపొందించిన రాజ్యాంగాన్ని అవమానించడాన్ని దేశం సహించదు' అని రాహుల్‌గాంధీ హిందీలో పోస్టు చేశారు. తక్షణమే అమిత్ షా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కాగా, పార్లమెంట్ ఆవరణలో రాహుల్‌గాంధీ మాట్లాడుతూ బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ రాజ్యాంగానికి వ్యతిరేకమని, గతంలో కూడా వారు రాజ్యాంగాన్ని మారుస్తామని చెప్పారని, అదే విధంగా అంబేద్కర్‌కు, ఆయన సిద్ధాంతాలకు వ్యతిరేకమన్నారు. రాజ్యాంగాన్ని, అంబేద్కర్ చేసిన సేవలను అంతం చేసేందుకు వారు పనిచేస్తున్నారని, ఇది యావత్ దేశానికి కూడా తెలుసునన్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ కూడా నిరసనకు సంబంధించిన చిత్రాలను ఎక్స్‌లో పోస్టు చేశారు. అంబేద్కర్ పేరు పెట్టుకోవడం ద్వారా హక్కులు లభిస్తాయని, అంబేద్కర్ పేరు పెట్టుకోవడం మానవ గౌరవానికి ప్రతీక, కోట్లాది దళితులు, అణగారిన ప్రజల ఆత్మ గౌరవానికి ప్రతీక అని ప్రియాంక గాంధీ ఎక్స్‌లో హిందీ పోస్ట్‌లో పేర్కొన్నారు. రాజ్యాంగంపై చర్చ సందర్భంగా రాజ్యసభలో షా చేసిన వ్యాఖ్యలను చూస్తే అంబేద్కర్‌పై బిజెపి ఆర్‌ఎస్‌ఎస్ నాయకులకు చాలా 'ద్వేషం' ఉన్నట్లుగా కనిపిస్తుంది, ఆయన క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. ఇక రాజ్యసభలో షా చేసిన ప్రసంగాన్ని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ ఎక్స్ వీడియో స్నిప్పెట్‌ను పంచుకున్నారు. 'అంబేద్కర్, అంబేద్కర్, అంబేద్కర్, అంబేద్కర్, అంబేద్కర్, అంబేద్కర్, అంబేద్కర్, అంబేద్కర్ , అంబేద్కర్' అని జపం చేయడం ఫ్యాషన్‌గా మారింది. దానికి బదులు దేవుడి పేరును అనేకసార్లు జపం చేస్తే వారికి స్థానం లభించి ఉండేది' అని అమిత్ షా వ్యాఖ్యానించారు. దీనిపై ప్రతిపక్షాలు తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నాయి.

# పంజాబ్‌లో రైతుల రైల్‌రోకో



**చండీగఢ్ :** పంజాబ్‌లో రైతులు మరోసారి రోడ్డెక్కారు. పంటలకు కనీస మద్దతు ధర చట్టం సహా పలు డిమాండ్లను నెరవేర్చాలని కేంద్రపై ఒత్తిడి తేస్తూ బుధవారం మూడు గంటల పాటు రైల్‌రోకో నిర్వహించారు. రైతులంతా పట్టాలపై బైఠాయించడంతో పంజాబ్‌లోని పలు రైలు సర్వీసులపై ప్రభావం పడింది. సంయుక్త కిసాన్ మోర్చా (రాజకీయేతర), కిసాన్ మజ్దూర్ మోర్చాలు రైల్‌రోకోకుకు పిలుపునిచ్చాయి. కిసాన్ మజ్దూర్ మోర్చా నేత సర్వన్ సింగ్ పంధేర్ మాట్లాడుతూ మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటలకు రైతులు అనేక చోట్ల రైలు పట్టాలపై బైఠాయించారన్నారు. మోగా, ఫరిద్‌కోట్, కడియన్, గురుదాస్‌పూర్‌లోని బాటల, జలంధర్‌లోని ఫిల్లౌర్, హోషియార్‌పూర్‌లోని టండా, దసుయ, ఫెరోజ్‌పూర్‌లోని టల్వ్‌డి భాయి, లూధియానలోని సహనేవల్, పాటియాలలోని శంభు, మొహలి, సునమ్, సంగ్రూర్‌లోని లెహ్రా, బథిండలోని రాంపూరా ఫౌల్ అమృత్‌సర్‌లోని దేవిదాస్‌పురా సహా పలు చోట్ల రైతులు రైలు పట్టాలను దిగ్బందించారు. జమ్ము నుంచి సీల్దా వెళ్లే హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్, అమృత్‌సర్ నుంచి ముంబయి వెళ్లే దాదర్ ఎక్స్‌ప్రెస్, న్యూఢిల్లీ నుంచి అమృత్‌సర్ వెళ్లే షాన్‌ఏ—పంజాబ్ ఎక్స్‌ప్రెస్ లుధియానా రైల్వే స్టేషన్‌లోని వివిధ ప్లాట్‌ఫారమ్‌లలో నిలిచిపోయాయి. న్యూఢిల్లీ నుంచి అమృత్‌సర్‌కు వస్తున్న శతాబ్ది ఎక్స్‌ప్రెస్ ఖన్నా రైల్వే స్టేషన్‌లో నిలిచిపోయింది. నిరసన తెలిపిన రైతు మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి ఎంఎస్‌పికి చట్టబద్ధమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. చలో ఢిల్లీని భద్రతా బలగాలు ఆపడంతో సంయుక్త కిసాన్ మోర్చా (నాన్ పొలిటికల్), కిసాన్ మజ్దూర్ మోర్చా బ్యానర్ క్రింద రైతులు ఫిబ్రవరి 13 నుండి పంజాబ్, హర్యానా మధ్య శంభు, ఖనౌరీ సరిహద్దు పాయింట్ల వద్ద రైతులు ఆందోళన చేస్తున్నారు. పంటలపై ఎమ్ఎస్‌పికి చట్టపరమైన హామీతో సహా ఆందోళన చేస్తున్న రైతుల డిమాండ్‌లను ఆమోదించాలని కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు గత మూడు వారాలుగా, పంజాబ్ రైతు నాయకుడు జగ్జిత్ సింగ్ డల్లేవాల్ పంజాబ్, హర్యానా మధ్య ఖనౌరీ సరిహద్దు పాయింట్ వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నాడు. 101 మంది రైతులతో కూడిన 'జాతా' (సమూహం) డిసెంబరు 6, డిసెంబర్ 8, మళ్లీ డిసెంబర్ 14న పాదయాత్రగా ఢిల్లీలోకి ప్రవేశించడానికి మూడుసార్లు ప్రయత్నాలు చేసింది. అయితే హర్యానా భద్రతా సిబ్బంది వారిని ముందుకు సాగనివ్వలేదు. పంటలకు ఎంఎస్‌పిపై చట్టపరమైన హామీతో పాటు, రైతులు రుణమాఫీ, రైతులకు, రైతు కూలీలకు పెన్షన్, విద్యుత్ ఛార్జీల పెంపుదల, పోలీసు కేసుల ఉపసంహరణ, 2021 లఖింపూర్ ఖేరీ హింసాకాండ బాధితులకు చేయాలని వారు 'న్యాయం' డిమాండ్ చేస్తున్నారు. 2013 భూసేకరణ చట్టం పునరుద్ధరణ, 2020—21లో గతంలో జరిగిన ఆందోళనలో మరణించిన రైతుల కుటుంబాలకు నష్టపరిహారం అందించడం కూడా రైతులు చాలా రోజుల డిమాండ్ చేస్తున్నారు.

# ఆశ్రిత పెట్టుబడిదారీ విధానానికి కేంద్రం అధిక ప్రాధాన్యం

## ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ విమర్శ



**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. కేంద్రప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించకుండా, చట్ట ప్రకారం జరిగే వ్యాపారాలను పట్టించుకోకుండా, ఆశ్రిత పెట్టుబడిదారీ విధానానికి (క్రోనీ క్యాపిటలిజం) అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ అవలంభించే ఇటువంటి చర్యల ఫలితంగా దేశంలో తయారీ రంగం బలహీనపడుతోందని, కరెన్సీ విలువ పడిపోతుందని ఆందోళన వ్యక్తంచేశారు. రికార్డు స్థాయిలో గరిష్ఠ వాణిజ్య లోటు, అధిక వడ్డీ రేట్లు పెరుగుతాయని తెలిపారు. ఈకారణంగా వస్తువుల వినియోగం తగ్గి ద్రవ్యోల్బణం పెరుగుదల వంటివన్నీ చూస్తామని సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. దేశంలో వాణిజ్య లోటు, దిగుమతులు గతంలో ఎన్నడూ లేనంతగా ఉన్నాయని వస్తున్న వార్తా కథనాలను ఉటంకిస్తూ కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. ప్రభుత్వాలు ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాలకు ప్రాధాన్యమిస్తే ఇలాకాక ఇంకేం జరుగుతుందని ఆయన ప్రశ్నించారు. వాణిజ్య మంత్రిత్వశాఖ డేటా ప్రకారం.. నవంబరులో దేశీయ వాణిజ్య ఎగుమతులు ఏడాదిక్రితం ఇదే నెలతో పోలిస్తే 4.85% తగ్గి 32.11 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. ఇదే సమయంలో దిగుమతులు 27% పెరిగి రికార్డు స్థాయి 69.95 బిలియన్ డాలర్లకు చేరాయి. దీంతో వాణిజ్యలోటు 37.84 బిలియన్ డాలర్లకు పెరిగింది. ఇది జీవనకాల గరిష్ఠ స్థాయి. ప్రధానంగా పసిడి దిగుమతులు గణనీయంగా పెరగడం వల్లే, వాణిజ్యలోటు ఇంతగా నమోదైందని వాణిజ్యశాఖ గణాంకాలు వెల్లడించాయి. పసిడి దిగుమతులు గత నెలలో రికార్డు గరిష్ఠమైన 14.86 బిలియన్ డాలర్లకు చేరాయి. 2023 నవంబరులో పసిడి దిగుమతులు 3.44 బిలియన్ డాలర్లతో పోలిస్తే, ఇవి 4 రెట్లు అధికం. విలువ పరంగా చూస్తే ఏడాది వ్యవధిలో 331% పెరగడం గమనార్హం. ఏప్రిల్ నవంబరులో పసిడి దిగుమతులు 49 బిలియన్ డాలర్లకు చేరాయి. 2023లో దిగుమతులు 32.93 బిలియన్ డాలర్లతో పోలిస్తే, ఇవి అధికం. వంట నూనె, ఎరువులు, వెండి అధిక ఇన్‌బౌండ్ షిప్‌మెంట్ల కారణంగా దిగుమతులు సంవత్సరానికి 27శాతం పెరిగి రికార్డు స్థాయిలో 69.95 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి.

# వృద్ధులకు ఉచిత వైద్యం

## మరోసారి అధికారంలోకి వస్తే 'సంజీవని యోజన' అమలు చేస్తామని హామీ



**న్యూఢిల్లీ :** వచ్చే ఏడాది ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ అధికార ఆమ్ అద్మీ పార్టీ (ఆప్) కీలక హామీ ప్రకటించింది. ఢిల్లీలోని సీనియర్ సిటిజన్లు అందరికి అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం అందిస్తామని హామీ ఇచ్చింది. మరోసారి ఆప్ అధికారంలోకి వస్తే 60 ఏళ్లు దాటిన వృద్ధులందరికీ ఉచిత వైద్యం అందించేలా 'సంజీవని యోజన' అమలు చేస్తామని ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ తెలిపారు. 'వయో వృద్ధుల సంరక్షణ మా బాధ్యత. మీరెంతో కష్టపడి పనిచేసి దేశాన్ని ముందుకు తీసుకొచ్చారు' అని అన్నారు. సీనియర్ సిటిజన్లు అనారోగ్యానికి గురైతే వారి చికిత్సకు అయ్యే ఖర్చుకు గరిష్ఠ పరిమితి ఏమీ ఉండదని కేజ్రీవాల్ తెలిపారు. దీనిపై ఒకట్రెండు రోజుల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలవుతుందని.. ఆప్ కార్యకర్తలే ఇళ్లకు వచ్చి రిజిస్ట్రేషన్ చేస్తారన్నారు. వారు ఇచ్చే కార్డును జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు. వచ్చే ఏడాది జరిగే ఎన్నికల్లో తాము అధికారంలోకి రాగానే.. ఈ ఉచిత చికిత్స విధానాన్ని అమలు చేస్తామన్నారు.

# రైతుల కోసం కోర్టు తలుపులు ఎల్లప్పుడూ తెరిచే ఉంటాయి

## అత్యున్నతస్థాయి కమిటీతో చర్చలకు నిరాకరిస్తున్నారని పంజాబ్ ప్రభుత్వం నివేదించడంతో స్పందించిన సుప్రీంకోర్టు

### రైతులు కోర్టుకు సూచనలు, డిమాండ్లను విన్నవించుకోవచ్చని స్పష్టీకరణ



**న్యూఢిల్లీ :** పంజాబ్‌హర్యానా రాష్ట్రాల మధ్య ఖనౌరీ సరిహద్దు కేంద్రం వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న రైతు నాయకుడు జగ్‌జిత్‌సింగ్ డల్లేవాల్, ఇతర రైతులతో పంజాబ్ ప్రభుత్వం నిరంతరం, విస్తృతమైన చర్చలు జరిగాయని , కానీ సుప్రీంకోర్టు ఏర్పాటుచేసిన అత్యున్నతస్థాయి కమిటీతో వారు సంభాషించడానికి నిరాకరించారని బుధవారం పంజాబ్ ప్రభుత్వం తెలియజేసింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనానికి పంజాబ్ అడ్వకేట్ జనరల్ గుర్మిందర్ సింగ్ ఈ విషయాన్ని తెలిపారు. డిసెంబరు 17న అత్యున్నత కమిటీని వారు ఆహ్వానించారని చెప్పారు. కానీ నిరసన తెలుపుతున్న రైతులు మాత్రం అత్యున్నతస్థాయి కమిటీతో పాలు పంచుకోలేదని చెప్పారు. డల్లేవాల్‌ను రాష్ట్ర అధికారులు, కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి కలిసి ఆయన ఆరోగ్యం గురించి వాకబు చేసి వైద్య సహాయం అందిస్తామని చెబితే ఆయన తిరస్కరించారని అడ్వకేట్ జనరల్ ధర్మాసనానికి వివరించారు. స్పందించిన ధర్మాసనం'డల్లేవాల్ ఆరోగ్యాన్ని చూసుకోవడంలో ఎలాంటి అలసత్వం వహించకూడదని, ఎందుకంటే అతడు ఆరోగ్యంగా ఉండాలని హృదయపూర్వకంగా కోరాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పేర్కొంది. ఏమాత్రం ఆలస్యం చేయొద్దు. ఆయన జనం మనిషి. రాజకీయాలకు అతీతుడుగా ఉన్నటువంటి అట్టడుగువర్గాల మనిషి. ఆయన రైతుల ప్రయోజనాల కోసం ప్రాతినిథ్యం వహిస్తున్నారు. ఎన్నికైన ప్రభుత్వం,రాజ్యాంగ సంస్థగా ఆయనపై నింద మోపరాదు. ఒక వేళ ఏదైనా జరిగితే పరిస్థితి ఏంది?' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతీరోజూ రైతులను ఒప్పించేందుకు ప్రయత్నిస్తున్నదని, వారి డిమాండ్లను నేరుగా కోర్టుకు సమర్పించేందుకు అనుమతించవచ్చని గుర్మిందర్‌సింగ్ సూచించారు. దీనిపై స్పందించిన సుప్రీంకోర్టు రైతులు నేరుగా లేదా వారి అధీకృత ప్రతినిధి ద్వారా ఏదైనా సూచన లేదా డిమాండ్లు తెలియజేసేందుకు కోర్టు తలుపులు ఎల్లవేళలా తెరిచే ఉంటాయని స్పష్టం చేసింది. విచారణను డిసెంబరు 19కు వాయిదా వేసింది. డల్లేవాల్ ఆరోగ్యాన్ని గమనించిన సర్వోన్నత న్యాయస్థానం డల్లేవాల్‌కు తక్షణమే వైద్యసహాయం అందించాలని పంజాబ్ ప్రభుత్వాన్ని కోరిన విషయం తెలిసిందే.

# బీజింగ్‌లో ప్రత్యేక ప్రతినిధుల చర్చ పునఃప్రారంభం

## చైనీస్ విదేశాంగ మంత్రితో అజిత్ దోవల్ సమావేశం



**బీజింగ్ :** గడిచిన నాలుగేళ్ళుగా తూర్పు లద్ధాక్‌లో సైనిక ప్రతిష్టంభన కారణంగా నిలిచిపోయిన ద్వైపాక్షిక సంబంధాలను పునరుద్ధరించాలని ప్రత్యేక ప్రతినిధులు భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ , చైనా విదే శాంగ మంత్రి వాంగ్ యి మధ్య చర్చల్లో కోరా రు. ఐదు సంవత్సరాల విరామం తర్వాత జరుగుతున్న ప్రత్యేక ప్రతినిధుల 23వ దఫా చర్చల్లో పాల్గొనేందుకు భారత ప్రతినిధి బృందానికి నాయకత్వం వహిస్తున్న దోవల్ మంగళవారం బీజింగ్‌కు వెళ్ళారు.2019లో చివరి సమావేశం ఢిల్లీలో జరి గింది. చైనా సమయం ప్రకారం ఉదయం 10 గంటలకు చర్చ లు ప్రారంభమయ్యాయి. వాస్తవ నియంత్రణ రేఖ (ఎల్‌ఏసి) వెంబడి శాంతి , ప్రశాంతతను నెలకొల్పడం, తూర్పు లద్ధాక్ లో ఘర్షణ తర్వాత నాలుగు సంవత్సరాలకు పైగా నిలిచిపోయిన సంబంధాలను సాధారణీకరించడం వంటి అనేక అంశాలపై ఇరువురు నాయకులు చర్చించనున్నారు. తూర్పు లద్ధాక్‌లో సైన్యం ఉపసంహరణ, పెట్రోలింగ్‌పై అక్టోబర్ 21న చేసుకున్న ఒప్పందం ప్రకారం ఇరువైపుల అధికారులు చర్చింస్తారని భావిస్తునానరు. రష్యాలోని కజాన్‌లో అక్టోబర్ 24న జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ మధ్య కుదిరిన ఉమ్మడి అవగాహనల ఆధారంగా హామీలను అమలు చేయడానికి భారతదేశంతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని మంగళవారంనాడు చైనా ఆశాభావం వ్యక్తం చేసింది. ప్రత్యేక ప్రతినిధుల చర్చల గురించి ప్రస్తావించగా చైనా నిజాయితీతో విభేదాలను పరిష్కరించడానికి సిద్ధంగా ఉందని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి లిన్ జియాన్ బీజింగ్‌లో మీడియా సమావేశంలో వెల్లడించారు. చైనా— భారతదేశ నాయకుల మధ్య ముఖ్యమైన ఉమ్మడి అవగాహనలను అమ లు చేయడానికి, పరస్పర ఉమ్మడి ప్రయోజనాలను , ప్రధాన ఆందోళనలను గౌరవించడం, సంభాషణ , సమాచారం ద్వా రా పరస్పర విశ్వాసాన్ని బలోపేతం చేయడానికి, నిజాయితీ, మంచి విశ్వాసంతో విభేదాలను సరిగ్గా పరిష్కరించడానికి, ద్వైపాక్షిక సంబంధాలను వీలైనంత త్వరగా స్థిరమైన ఆరోగ్యకరమైన అభివృద్ధి దిశగా తీసుకురావడానికి చైనా భారతదేశంతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉందని ఆయన వివరించారు. సరిహద్దు ప్రాంతాల్లో శాంతి , ప్రశాంతతను నిర్వహించడం గురించి ఇద్దరు ప్రత్యేక ప్రతినిధులు చర్చించి, కజాన్‌లో ఇద్దరు నాయకుల సమావేశంలో అంగీకరించిన విధంగా సరిహద్దు సమస్యకు న్యాయమైన, సహేతుకమైన, పరస్పరం ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని అన్వేషిస్తారని విదేశాంగ మంత్రిత్వ శాఖ సోమవారం తెలిపింది. ఐదు సంవత్సరాల త ర్వాత జీ జిన్‌పింగ్ మోదీ భేటీ తర్వాత, విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ , చైనా విదేశాంగ మంత్రి బ్రెజిల్‌లో జరిగిన జి20 శిఖరాగ్ర సమావేశంలో పాల్గొన్నారు. తూర్పు లద్ధాఖ్ లోని ఎల్‌ఏసి వెంబడి సైనిక ప్రతిష్టంభన మే 2020లో ప్రారంభమైంది , అదే ఏడాది జూన్‌లో గల్వాన్ లోయలో తీవ్ర ఘర్షణ జరిగింది, దీని ఫలితంగా రెండు పొరుగు దేశాల మధ్య సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వాణిజ్యం మినహాయించి, రెండు దేశాల మధ్య సంబంధాలు దాదాపుగా నిలిచిపోయాయి. అక్టోబర్ 21న ఖరారు చేయబడిన ఒప్పందం ప్రకారం దెమ్చోక్ ,డెప్సాంగ్‌లోని చివరి రెండు ఘర్షణ పాయింట్ల నుండి బలగాల ఉపసంహరణ ప్రక్రియ సమర్థవంతంగా పూర్తయింది. సంబంధాలను పునరుద్ధరించడానికి రెండు దేశాల మధ్య ప్రత్యేక ప్రతినిధుల మొదటి నిర్మాణాత్మక చర్చలు కీలకంగా భావిస్తున్నారు. 3,488 కి.మీ.ల విస్తీర్ణంలో ఉన్న భారతదేశం—చైనా సరిహద్దు వివాదాన్ని సమగ్రంగా పరిష్కరించడానికి 2003లో ఏర్పాటు చేయబడిన ప్రత్యేక ప్రతినిధుల యంత్రాంగం అనేక సంవత్సరాలుగా 22 సార్లు సమావేశమైంది.సరిహద్దు వివాదాన్ని పరిష్కరించడంలో విజయం సాధించలేకపోయినప్పటికీ, రెండు దేశాల మధ్య పునరావృతమయ్యే ఉద్రిక్తతలను పరిష్కరించడంలో ఇరు వైపులా అధికారులు దీనిని చాలా ఆశాజనకంగా, ఉపయోగకరంగా ,అనుకూలమైన సాధనంగా భావిస్తారు.

# ఎస్‌సిలపై దాడుల కేసులో రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

## పార్లమెంటరీ స్థాయి సంఘం నివేదిక



**న్యూఢిల్లీ :** షెడ్యూల్ కులాల (ఎస్‌సిల)పై జరిగే దాడుల కేసులను సమర్థవంతంగా పరిష్కరించడానికి అవసరమైన యంత్రాంగాలను ఏర్పాటు చే యడంలో అనేక రాష్ట్రాలు విఫలమవడంపై పార్లమెంటరీ కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. పౌర హక్కుల రక్షణ చట్టం 1955 , 1989 షెడ్యూల్డ్ కులాలు షెడ్యూల్డ్ తెగల (దాడుల నిరోధక) చ ట్టం కింద అవసరమైన యంత్రాంగాన్ని బలోపే తం చేయడం, చట్టాలను అమలు చేయడానికి రా ష్ట ప్రభుత్వాలు చురుకుగా వ్యవహరించేందుకు కేంద్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని సామాజిక న్యాయం, సాధికారతపై స్థాయీ సంఘం సిఫార్సు చేసింది. లోక్‌సభలో బుధవారం ప్రవేశపెట్టిన స్థాయీ సంఘం నివేదికలో, కేంద్ర స్థాయిలో ఆర్థిక పరిమితులు లేనప్పటికీ, అనేక రాష్ట్రాలు అందుబాటులో ఉన్న నిధులను ఉపయోగించడం లేదా ఈ సమస్యలను పరిష్కరించడానికి అవసరమైన చర్యలు తీసుకోవడం లేదని పేర్కొంది. ఎస్‌సిలపై జరిగే దాడులను ఎదుర్కోవడానికి కేంద్ర వనరుల మద్దతుతో రాష్ట్ర ప్రభుత్వాల 'నిజాయితీతో — సమన్వయ' ప్రయత్నాలు అవసరమని క మిటీ నొక్కి చెప్పింది. సామాజిక న్యాయం, సాధికారత శాఖ కింద సంక్షేమ పథకాల అమలులో విస్తృత సవాళ్లను కూడా నివేదిక నొక్కి చెప్పింది. ఎస్‌సిల కోసం పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్ పథకం ,నే షనల్ యాక్షన్ ప్లాన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకోసిస్టమ్ వంటి కీలక కార్యక్రమాల కింద గణనీయమైన కేటాయింపులు నిరుపయోగంగానే ఉన్నాయని, అసంపూర్ణ డాక్యుమెంటేషన్, ఆధార్ సీ డింగ్‌లో లోపాలు , రాష్ట్రాలు తమ వాటా నిధుల ను విడుదల చేయడంలో జాప్యం వంటి అడ్డంకు లు ఉన్నాయి.కార్యాచరణ లోపాలను పరిష్కరించడానికి సీనియర్ అధికారుల క్రమం తప్పకుం డా సమీక్షలు, రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్‌లను నిర్వహించడం వంటి మరింత కఠినమైన పర్యవేక్షణ విధానాలను అమలు చేయాలని ప్యానెల్ కోరింది. నిధుల వినియోగంలో ,అమలు లక్ష్యాలను సాధించడంలో మధ్యప్రదేశ్, రాజస్థాన్, బీహార్ , ఒడిశా వంటి రాష్ట్రాలు నిరంతరం వెనుకబడి ఉన్నాయని ప్రత్యేకంగా గుర్తించారు. జవాబుదారీతనం నిర్ధారించడానికి, పనితీరు లేని రాష్ట్రాలపై కఠినమైన షరతులు విధించాలని, కేంద్ర నిధులను విడుదల చేయడానికి ఖచ్చితమైన ,సకాలంలో ప్రతిపాదనలను సమర్పించాలని కేంద్ర ప్రభుత్వానికి పార్లమెంటరీ కమిటీ కోరింది. తగినంత ప్రచారం లేకపోవడం వల్ల చాలా మంది అర్హత కలిగిన లబ్ధిదారులకు వారి హక్కుల గురించి తెలియదని కమిటీ పరిశీలనలో తేలింది. సమాచారం, అవగాహన, కమ్యూనికేషన్ ప్రచారాలను విస్తృతం చేయాలని , మెరుగైన అమలు ను నిర్ధారించడానికి సీనియర్ అధికారుల క్షేత్ర సందర్శనలను సిఫార్సు చేయాలని కమిటీ ప్రతిపాదించింది.

# ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లపై అధికార విపక్షాల మధ్య వాదోపవాదాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** శాసనసభ సమావేశాల్లో ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌ల విషయంలో అధికార విపక్షాల మధ్య వాదోపవాదాలు చోటు చేసుకున్నాయి. గురువారం ఉదయం సభ ప్రారంభమైన వెంటనే స్పీకర్ గడ్డం ప్రసాద్ ప్రశ్నోత్తరాలను చేపట్టారు. ఓవర్సీస్ స్కాలర్ షిప్‌లపై అసెంబ్లీలో కాంగ్రెస్, బిఆర్‌ఎస్‌ల మధ్య మాటల తూటాలు పేలాయి. బిఆర్‌ఎస్ సభ్యులు కె.పి.వివేకానంద, కౌశిక్ రెడ్డి తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేయడంలో శాసనసభ వ్యవహారాల శాఖమంత్రి శ్రీధర్ బాబు అభ్యంతరం వ్యక్తం చేశారు. వారి వ్యాఖ్యలను రికార్డులను తొలగించాలని స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను కోరగా, స్పీకర్ వివేకానంద వ్యాఖ్యలు రికార్డుల నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించారు. అలాగే బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎ హరీశ్ రావు కోరిన మేరకు కాంగ్రెస్ ఎంఎల్‌ఎ నాయిని రాజేందర్ రెడ్డి వ్యాఖ్యలను కూడా రికార్డుల నుంచి తొలగించామని స్పీకర్ తెలిపారు. ఈ సందర్భంగా కౌశిక్ రెడ్డి తన వాదన కొనసాగించడంపై స్పీకర్ కూర్చోవాలని ఆయనకు పలుమార్లు సూచించారు. స్పీకర్ మాటలు వినకుండా కౌశిక్ రెడ్డి మాట్లాడటంపై సభ మర్యాదలు పాట్టించుకోకుండా, ఇలాగే మాట్లాడితే సభ నుంచి సస్పెండ్ చేస్తా అని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ హెచ్చరించారు. సస్పెండ్ చేయాలని కౌశిక్ రెడ్డి మొండిగా ప్రతిస్పందించారు. కొత్తగా వచ్చిన సభ్యులు ఇలాంటి సంప్రదాయం ప్రవర్తన సరికాదంటూ స్పీకర్ ప్రతిస్పందించారు.

**ఇష్టారాజ్యంగా ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం తగదు : శ్రీధర్ బాబు**

అంతకు ముందు శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఇష్టారాజ్యంగా అడ్డగోలుగా ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం తగదన్నారు. ఇక్కడ కూర్చున్నప్పుడు ఒక వేషం, అక్కడ కూర్చున్నప్పుడు మరొక వేషం వేస్తున్నారని అన్నారు. నిన్న(మంగళవారం) అయ్యప్ప డ్రెస్సులు వేసుకొని వచ్చి భక్తితో ఉంటారని అనుకున్నామని, అయ్యప్ప డ్రెస్సులు ధరించి కూడా లొల్లి లొల్లి చేశారన్నారు. బిఆర్‌ఎస్ అధికారంలో ఉండగా ఆటోలకు పన్నులు పెంచారని, బిఆర్‌ఎస్ ఆటోవాళ్ల గురించి మాట్లాడటం హాస్యాస్పదమని శ్రీధర్ బాబు ఎద్దేవా చేశారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి వాగ్దానం నెరవేర్చుతామని, ఒక్కొక్కటి నేరవేర్చుతామని స్పష్టం చేశారు. ఓవర్సీస్ స్కాలర్షిప్స్ తా ము ఆపలేదని, అది ప్రాసెస్‌లో ఉందన్నారు. అది తెలుసుకోకుండా ప్రభుత్వంపై నిందలు మోపడం మంచిది కాదన్నారు.

**మీరు పెట్టిన పెండింగ్ బిల్లులు మేము ఇస్తున్నాం : మంత్రి సీతక్క**

అంతకు ముందు మంత్రి సీతక్క మాట్లాడుతూ మీరు(బిఆర్‌ఎస్) పెట్టిన పెండింగ్ బిల్లులు చెల్లిస్తున్నామన్నారు. రూ.4500 కోట్ల స్కాలర్షిప్‌లు మీరు పెండింగ్ పెట్టి వెళ్లారన్నారు. దానికి తమను నిందిస్తే ఎలా అని ప్రశ్నించారు. రూ.140.74 కోట్ల ఓవర్సీస్ స్కాలర్షిప్‌లు తాము చెల్లించామన్నారు. ఇంకా రూ.104 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. ఓవర్సీస్ స్కాలర్షిప్‌ల కోసం 3480 దరఖాస్తులు వచ్చాయని, 1310మంది విద్యార్థులను ఎంపిక చేయాల్సి ఉందన్నారు. వచ్చే మార్చ్ వరకు గడువు ఉందన్నారు. డిసెంబర్ నెల ఆఖరి వరకే ఎంపిక పూర్తి చేసి చెల్లింపులు చేస్తామని చెప్పారు. ఈ స్కీంను మరింత పకడ్బందీగా అమలు చేస్తామన్నారు. మీ పాలనలో మహబూబ్ నగర్‌లో లావణ్య అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకుందన్నారు. ఫీజు చెల్లించలేక మరణించినట్లు లేఖ రాసిందని తెలిపారు. మీరు గొప్పగా చేశామని చెబితే ఎలా అని మంత్రి సీతక్క ప్రశ్నించారు. ఆటో వాళ్లకు పదేళ్లలో మీరు ఏం చేశారని, వారిని ఆర్థికంగా బలవంతం చేయడం కోసం మీరేం చేశారు, మహిళలకు తాము ఉచిత బస్ సౌకర్యం కల్పించడం తప్పా అని బిఆర్‌ఎస్ సభ్యులను మంత్రి ప్రశ్నించారు.

# శాసనసభలో వాయిదా తీర్మానాల తిరస్కరణ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** శాసనసభలో వివిధ అంశాలపై ఇచ్చిన వాయిదా తీర్మానాలను స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తిరస్కరించారు. రాష్ట్ర వ్యాప్తంగా జెన్‌కో, ట్రాన్స్‌కో డిస్కామ్‌లలో పనిచేస్తున్న వేలాదిమంది ఆర్టిజన్‌లకు కనీసవేతన చట్టం అమలు చేయాలని, శాశ్వత ఉద్యోగులకు కల్పించే సౌకర్యాలు అమలు చేయాలని, వారి సర్వీసులను క్రమబద్ధీకరించే చర్యలపై సిపిఐ శాసనసభ పక్షనేత కూనంనేని సాంబశివ రావు ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని, ఆటో కార్మికుల సమస్యలపై చర్చించేందుకు బిఆర్‌ఎస్ ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని, రైతుల హామీల అమలుపై వాయిదా బిజెపి పక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని స్పీకర్ తీరస్కరించారు.

**డాక్యుమెంట్స్ పోయినది**

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా... నేను అనగా **PABBA VENKATESWARLU,** S/O. BIKSHAMAIAH, C/O. KODADలో బైక్ మీద వెళుతుండగా నాయొక్క **Original Documents No. 8223/88** పోయినవి కావునా ఎవరికైన దొరికినచో ఈ సెల్ ఫోన్ నెం. **9848273115** కు తెలియజేయగలరు.
ఇట్లు - పి. వెంకటేశ్వర్లు, కోదాడ.

**CHANGE OF NAME**

I, **YADAGIRI DEVUNOORI** (Old Name), H. No. 2-4-919, Gokul Nagar, Near Old Bus Depo, Hanumkonda Dist, Pin-506001, Telangana State, India. here by declare that I have changed my name **YADAGIRI DEVUNURI** (New Name) for all purpose.

## క్రీడ

# అంతర్జాతీయ క్రికెట్‌కు అశ్విన్ గుడ్‌బై!



టీమిండియా స్టార్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలుకుతున్నట్లు ప్రకటించాడు. ఐదు టెస్టుల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియాతో గబ్బా వేదికగా జరిగిన మూడో టెస్ట్ అనంతరం అశ్విన్ తన నిర్ణయాన్ని వెల్లడించాడు. వర్షం కారణంగా ఈ మ్యాచ్ డ్రాగా ముగిసిన విషయం తెలిసిందే. ఈ మ్యాచ్ అనంతరం కెప్టెన్ రోహిత్ శర్మతో కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్న అశ్విన్.. తన 14 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌కు వీడ్కోలు పలుకుతున్నట్లు తెలిపాడు. ఈ సమయంలో అశ్విన్ కాస్త భావోద్వేగానికి గురయ్యాడు. 'నా గురించి చెప్పుకోవడం నాకు కష్టం ఉంది. అంతర్జాతీయ క్రికెటర్‌గా నాకు ఇదే చివరి రోజు. ఆటగాడిగా నేను ఎన్నో మధుర జ్ఞాపకాలను సృష్టించాను. డ్రెస్సింగ్ రూమ్‌లో ఉన్న సీనియర్ ఆటగాళ్లలో మాదే చివరి గ్రూప్. నేను చాలా మందికి కృతజ్ఞతలు చెప్పాలి. బీసీసీఐతో పాటు నా సహచర ఆటగాళ్లకు, కోచ్‌లకు స్పెషల్ థ్యాంక్స్. భారత అంతర్జాతీయ క్రికెటర్‌గా ఇదే నా చివరి రోజు. నేను క్లబ్ క్రికెట్ ఆడుతాను. భారత డ్రెస్సింగ్ రూమ్‌లో నేను చాలా సరదాగా ఉండేవాడిని. భారత్ తరఫున ఆడినందుకు గర్వంగా భావిస్తున్నా. రిటైర్మెంట్‌కు ఇదే సరైన సమయం అనుకుంటున్నా. భారత క్రికెట్‌లో నా భాగస్వామ్యం ఉండటం సంతోషంగా ఉంది.' అని అశ్విన్ చెప్పుకొచ్చాడు.

పెర్త్ టెస్ట్ విజయం తర్వాతే అశ్విన్ రిటైర్మెంట్ ప్రకటించాలనుకున్నాడని, కానీ తానే పింక్ బాల్ టెస్ట్ ఆడేలా కన్విన్స్ చేసానని కెప్టెన్ రోహిత్ శర్మ తెలిపాడు. అశ్విన్ నిర్ణయాన్ని గౌరవిస్తున్నామని, తదుపరి రెండు టెస్ట్‌ల్లో అతను ఆడడని వెల్లడించాడు. గురువారమే అశ్విన్ స్వదేశానికి వెళ్లిపోతాడని స్పష్టం చేశాడు. 2010 శ్రీలంక పర్యటనలో హరారే వేదికగా జరిగిన వన్డే మ్యాచ్‌తో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేసిన అశ్విన్.. అడిలైడ్ వేదికగా జరిగిన పింక్ బాల్ టెస్ట్‌తో చివరి మ్యాచ్ ఆడాడు.

మూడు ఫార్మాట్లలో కలిపి అశ్విన్ 765 వికెట్లు తీశాడు. టెస్ట్‌ల్లో 106 మ్యాచ్‌ల్లో 2.83 ఎకానమీతో 537 వికెట్లు పడగొట్టాడు. ఇందులో 5 వికెట్ల ఘనతను 37 సార్లు అందుకున్నాడు. 116 వన్డేల్లో 4.93 ఎకానమీతో 156 వికెట్లను తీశాడు. 65 టీ20ల్లో 6.90 ఎకానమీతో 72 వికెట్లు పడగొట్టాడు. బ్యాటింగ్‌లో మూడు ఫార్మాట్లలో కలిపి 4, 400 పరుగులు చేశాడు. 106 టెస్ట్‌ల్లో 25.75 సగటుతో 3503 పరుగులు చేసిన అశ్విన్.. 6 సెంచరీలతో పాటు 14 హాఫ్ సెంచరీలు నమోదు చేశాడు. అంతకు ముందు డ్రెస్సింగ్ రూమ్‌లో విరాట్ కోహ్లీతో అశ్విన్ భావోద్వేగానికి గురైన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది.




# 'గబ్బా టెస్ట్'లో గట్టెక్కిన టీమిండియా!

ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ గమనాన్ని తేల్చే గబ్బా టెస్ట్‌లో టీమిండియా ఓటమి నుంచి గట్టెక్కింది. టెయిలెండర్ల అసాధారణ ప్రదర్శనకు వర్షం తోడవ్వడంతో ఈ మ్యాచ్ ఫలితం లేకుండా ముగిసింది. 275 పరుగుల లక్ష్యంతో భారత్ రెండో ఇన్నింగ్స్ ప్రారంభించగా.. వర్షం అంతరాయం కలిగించింది. వర్షం తీవ్రత పెరగడంతో అంపైర్లు మ్యాచ్‌ను డ్రాగా ప్రకటించారు. దాంతో ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో ఇరు జట్లు 1-1తో సమంగా నిలిచాయి. అంతకుముందు 252/9 ఓవర్‌నైట్ స్కోర్‌తో ఐదో రోజు ఆటను ప్రారంభించిన భారత్.. మరో 8 పరుగులను జోడించి 260 పరుగులకు ఆలౌటైంది. ట్రావిస్ హెడ్ బౌలింగ్‌లో ఆకాశ్ దీప్(44 బంతుల్లో 2 ఫోర్లు, సిక్స్‌తో 31)ఆఖరి వికెట్‌గా పెవిలియన్ చేరాడు. జస్‌ప్రీత్ బుమ్రా(10 నాటౌట్) అజేయంగా నిలిచాడు. దాంతో ఆసీస్‌కు 185 పరుగుల ఆధిక్యం లభించింది. భారీ లీడ్‌తో రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన ఆసీస్.. 89/7 స్కోర్ వద్ద డిక్లేర్ చేసింది. జస్‌ప్రీత్ బుమ్రా(3/18), ఆకాశ్ దీప్(2/28), మహమ్మద్ సిరాజ్(2/38) నిప్పులు చెరగడంతో ఆసీస్ 85 పరుగులకే ఏడు వికెట్లు కోల్పోయింది. ఆస్ట్రేలియా బ్యాటర్లలో నాథన్ మెక్‌స్వీనీ(4), ఉస్మాన్ ఖవాజా(8), మార్నస్ లబుషేన్(1), మిచెల్ మార్ష్(2), స్టీవ్ స్మిత్(4) సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. ట్రావిస్ హెడ్17), అలెక్స్ క్యారీ(19 నాటౌట్), ప్యాట్ కమిన్స్ (22)లు డబుల్ డిజిట్ స్కోర్ చేశారు.



ఈ మ్యాచ్‌లో ఎలాగైన ఫలితం రాబట్టాలనే ఉద్దేశంతో ఆసీస్.. భారత్ ముందు 275 పరుగుల ఊరించే లక్ష్యాన్ని ఉంచింది. కానీ ఆసీస్ ఆశలపై వరణుడు నీళ్లు చల్లాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ 445 పరుగుల భారీ స్కోర్ చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో శతకంతో చెలరేగిన ట్రావిస్ హెడ్160 బంతుల్లో 18 ఫోర్లతో 152)కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డ్ దక్కింది. ఈ మ్యాచ్‌లో ఆసీస్ పూర్తి ఆధిపత్యం చెలాయించింది. విజయం దిశగా సాగిన ఆ జట్టు ఆశలపై వరణుడు నీళ్లు చల్లాడు. ఆకాశ్ దీప్, జస్‌ప్రీత్ బుమ్రా అసాధారణ బ్యాటింగ్‌తో ఈ మ్యాచ్‌లో టీమిండియా ఫాలో ఆన్ తప్పించుకుంది. ఈ ఇద్దరూ ఆఖరి వికెట్‌కు 47 పరుగులు జోడించారు. టీమిండియా ఫాలో ఆన్ గండం గట్టెక్కకుంటే ఈ మ్యాచ్‌లో ఆసీస్ విజయం సాధించేది.

## రీల్



# పుష్ప 2 సెన్సేషనల్ .. హిందీలో రూ.600 కోట్ల క్లబ్ లోచోటు


ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా రష్మిక మందన్నా హీరోయిన్ గా దర్శకుడు సుకుమార్ తెరకెక్కించిన అవైటెడ్ సీక్వెల్ చిత్రం పుష్ప 2 ది రూల్ కోసం అందరికీ తెలిసిందే. మరి ఎన్నో అంచనాలు సెట్ చేసుకున్న ఈ చిత్రం ఇండియా వైడ ఫా రికార్డు ఓపెనింగ్స్ సాధించింది. అయితే వీటిలో హిందీ మార్కెట్ కీలక పాత్ర పోషించాయి అని చెప్పాలి. ఇలా ఒక్క ఇండియన్ సినిమా దగ్గరే కేవలం హిందీ వెర్షన్ లో పుష్ప 2 సంచలన రికార్డులు సెట్ చేస్తుంది. ఇలా లేటెస్ట్ గా హిందీ వెర్షన్ లో ఏకంగా 600 కోట్ల క్లబ్ లోకి పుష్ప 2 చేరిపోయి సెన్సేషనల్ ఫీట్ సెట్ చేసింది. మరి నిన్న మంగళవారం 19 కోట్లకి పైగా నెట్‌వసూళ్లు అందుకున్న ఈ చిత్రం నిన్నటితో అఫీషియల్ గా 600 కోట్ల క్లబ్ లో జాయిన్ అయ్యినట్టుగా ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. దీనితో పుష్ప 2 ఇక అక్కడ ఆల్ టైం హైయెస్ట్ వసూళ్లు అందుకోబోతుంది అని చెప్పాలి. ఇక ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించగా మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణం వహించారు.




## 'గేమ్ ఛేంజర్' నుండి 'ధోప్' సాంగ్ ప్రోమో..

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్'గేమ్ ఛేంజర్' మూవీ సంక్రాంతి కానుకగా రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఇక ఈ సినిమా నుంచి ఇప్పటికే మూడు పాటలు రిలీజ్ కాగా, వాటికి ప్రేక్షకుల నుంచి అదిరిపోయే రెస్పాన్స్ లభించింది. ఇప్పుడు ఈ సినిమాలోని 'ధోప్' అనే పాటను రిలీజ్ చేసేందుకు మేకర్స్ రెడీ అయ్యారు. ఈ 'ధోప్' పాటపై ఇప్పటికే చిత్ర యూనిట్ అదిరిపోయే అంచనాలు క్రియేట్ చేసింది. అయితే, ఈ పాటకు సంబంధించిన ప్రోమోను మేకర్స్ తాజాగా రిలీజ్ చేశారు. ఈ ప్రోమోతోనే సాంగ్‌పై నెలకొన్న అంచనాలు రెట్టింపు అయ్యాయి. 'ధోప్' సాంగ్‌ను డిసెంబర్ 21న అమెరికాలోని డల్లాస్‌లో రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ వెల్లడించారు. ఈ సినిమాలో అందాల భామ కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తోండగా.. అంజలి, శ్రీకాంత్, ఎస్.జె.సూర్య తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. థమన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు అత్యంత భారీ బడ్జెట్‌తో ప్రొడ్యూస్ చేస్తున్నారు.

# 'ఓజి' లో నేహాశెట్టి



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అప్ కమింగ్ మూవీస్ లిస్ట్ లో ఓజి(og)కూడా ఒకటి.సెప్టెంబర్ 27 న రిలీజ్ కావాల్సిన ఈ మూవీ,పవన్ పొలిటికల్ కి సంబంధించిన పనుల్లో బిజీగా ఉండటం వలన లేట్ అయ్యింది. ఇప్పుడు 'ఓజి' కి సంబంధించిన తాజా న్యూస్ ఒకటి బయటకి వచ్చింది. ఓ జి లో ఒక స్పెషల్ సాంగ్ ఉందని, ఆ సాంగ్ లో డి జె టిల్లు ఫేమ్ నేహాశెట్టి చెయ్యబోతుందనే వార్తలు ఫిలిం సర్కిల్స్ లో చక్కర్లు కొడుతున్నాయి. దీంతో పవన్ తో ఆమె సాంగ్ చేయడం ఖాయమైతే ఆ సాంగ్ ఒక సంచలనం సృష్టిస్తుందని చెప్పవచ్చు. ఇక నేహా శెట్టి న్యూస్ తో పాటు ఓజి కి సంబం ధించిన మరో న్యూస్ కూడా వైరల్ అవుతుంది. ప్రభాస్ తో 'సాహో' ని తెరకెక్కించిన సుజిత్ దర్శకత్వంలో ఓజి తెరకెక్కనుండగా ఆర్ఆర్ఆర్ ని నిర్మించిన దానయ్య అత్యంత భారీ వ్యయంతో నిర్మిస్తున్నాడు.పవన్ సరసన ప్రియాంక మోహన్ చేస్తుండగా ఇమ్రాన్ హాష్మీ,శ్రేయారెడ్డి, తదితరులు ముఖ్య పాత్రలో కనిపించనున్నారు.

# రాష్ట్రంలో కొత్తగా 30వేల ఐటి ఉద్యోగాలు

### -ఐటిసర్వ్ అలియన్స్‌తో ప్రభుత్వం ఒప్పందం

ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలో ఐటిని మరింత అభివృద్ధి చేసే దిశగా తెలంగాణ ప్రభుత్వం అడుగులు వేస్తుంది. ఇందులో భాగంగా రాష్ట్రంలో మరో 30 వేల ఐటి ఉద్యోగాలు సృష్టించేందుకు ఐటిసర్వ్‌తో ప్రభుత్వం బుధవారం ఒప్పందం చేసుకుంది. ఈ మేరకు రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు సమక్షంలో ఐటిసర్వ్ అలయన్స్ జాతీయ అధ్యక్షుడు జగదీష్ మోసాలి, తెలంగాణ ప్రభుత్వ పరిశ్రమలు,ఐటి విభాగాల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ఐటి మంత్రి సలహాదారు సాయి కృష్ణ, ఐటిఇసి విభాగం చీఫ్ స్ట్రాటజీ ఆఫీసర్ శ్రీకాంత్ లంక,ఐటిసర్వ్ అలియన్స్ పాలక మండలి సభ్యుడు రఘు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. రాష్ట్రంలో ఐటి కంపెనీలను అభివృద్ధి చేసే ప్రక్రియలో భాగంగా యునైటెడ్ స్టేట్స్‌లోని ఐటి కంపెనీలలో అతిపెద్దదైన ఐటిసర్వ్ అలియన్స్‌తో ఒప్పందం చేసుకోవడం ద్వారా కొత్తగా 30 వేల ఐటి ఉద్యోగాలు లభిస్తాయి. ప్రభుత్వ సహకారంతో సదరు సంస్థ టైర్–2, టైర్–3 పట్టణాలలో 30,000 కొత్త ఉద్యోగాలను సృష్టించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఇది సమగ్ర వృద్ధి, ప్రాంతీయ అభివృద్ధి, బలమైన ఆవిష్కరణ పర్యావరణ వ్యవస్థను సృష్టించడంలో రాష్ట్ర నిబద్ధతలో ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుందని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ఈ అవగాహన ఒప్పందం వల్ల మహబూబ్‌నగర్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, ఇతర అభివృద్ధి చెందుతున్న పట్టణాలలో ఐటి సంబంధిత పరిశ్రమల స్థాపనను ప్రోత్సహించడంపై దృష్టి పెడుతుందన్నారు. ఈ భాగస్వామ్యం కింద, రాష్ట్ర ప్రభుత్వం చిన్న నగరాల్లో కార్యకలాపాలను ఏర్పాటు చేయడంలో ఐటిసర్వ్ సభ్య కంపెనీలకు మద్దతు



ఇస్తుందన్నారు. చిన్న పట్టణాలలో సైతం ఈ సంస్థ ద్వారా యువకుతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. తద్వారా రాబోయే సంవత్సరాల్లో స్థల పరిమితులను ఎదుర్కొనే అవకాశం ఉన్న హైదరాబాద్ వంటి నగరాలకు వలసలను తగ్గించడంలో సహాయపడుతుందన్నారు. అలాగే హైదరాబాద్ మహా నగరంలో రద్దీని తగ్గించడంలో సహాయపడుతుందన్నారు. ఈ భాగస్వామ్యం కింద, ఐటిసర్వ్ సభ్య సంస్థలకు చిన్న పట్టణాలలో కార్యకలాపాలను స్థాపించడంలో మద్దతు ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందిస్తుందన్నారు.

# ఆర్టిజన్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

### పరిష్కరించేంత వరకు సిపిఐ అండగా ఉంటుంది.

### విద్యుత్తు ఆర్టిజన్ల కన్వర్షన్ జెఎసి ధర్నాలో ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు




ప్రజాపక్షం / హైదరాబాద్ : విద్యుత్తు ఆర్టిజన్ల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు చెప్పారు. హైదరాబాద్ ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద బుధవారం జరిగిన విద్యుత్తు ఆర్టిజన్ల కన్వర్షన్ జెఎసి మహాధర్నాలో కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఆర్టిజన్ల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చేంత వరకు వారి పోరాటంలో సిపిఐ భాగస్వామ్యమవుతుందని తెలిపారు. కార్మికుల నేతగా, ఎంఎల్ఎగా సంబంధిత నేతలకు, ప్రజాప్రతినిధులకు కార్మికుల సమస్యలపై లేఖలు రాసి పంపిస్తున్నానని ఆయన తెలిపారు. విద్యుత్తు కార్మికుల సమస్యలపై గత అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో మాట్లాడానని, వచ్చే బడ్జెట్ సమావేశాల్లో కూడా తనవంతుగా కార్మికుల పక్షాన మాట్లాడుతానని కూనంనేని తెలిపారు. కార్మికులు, కర్షకులకు సిపిఐ అండగా ఉంటుందని సాంబశివరావు ఉద్ఘాటించారు. పేదలు కష్టాల్లో ఉన్నప్పుడు ఎర్రజెండా పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. ఆర్టిజన్ల పోరాటం కూడా విజయవంతం కా వాలన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ఒక ప్రజాప్రతినిధిగా, కార్మిక నాయకుడిగా అందుబాటులో ఉంటానని ఎంఎల్ఎ కూనంనేని హామీనిచ్చారు. ధర్నాలో తెలంగాణ విద్యుత్తు ఆర్టిజన్ కన్వెన్షన్ చైర్మన్ కె.ఈశ్వరరావు, కన్వీనర్ ఎంఎ వజీర్, కో–చైర్మన్ శంకర్ తదితర నేతలు ప్రసంగించారు.

# రాష్ట్రంలో దారుణంగా పడిపోతున్న ఉష్ణోగ్రతలు..

### ఆదిలాబాద్ 6.2 డిగ్రీలు నమోదు



ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో చలి తీవ్రత మరింత పెరిగింది. పలు ప్రాంతాల్లో సింగిల్ డిజిట్‌కే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రానున్న రెండు రోజుల్లో చలి తీవ్రత మరింత అధికంగా ఉండే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. సాయంత్రం 5 గంటల నుంచే చలి మొదలై, ఉదయం 10 గంటల దాకా చలి తగ్గకపోవడంతో ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే జనం గజగజ వణికిపోతున్నారు. మంగళవారం రాత్రి రాష్ట్రవ్యాప్తంగా అన్నిచోట్ల సాధారణం కంటే 3 డిగ్రీలు తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యల్పంగా హైదరాబాద్‌లో 6.2 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోయాయి. పటాన్ చెరులో 7డిగ్రీలు, మెదక్‌లో 7.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. హైదరాబాద్‌లో 11.9 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోయాయి. శీతలగాలుల నేపథ్యంలో ఇప్పటికే ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు సూచించారు.

## జమిలిపై జెపిసి

(3వ పేజీ తరువాయి)

మాజీ మంత్రులు అనురాగ్ ఠాకూర్, పిపి.చౌదరి, కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రియాంకగాంధీ వాద్రా కూడా ఉన్నారు. జెపిసి ప్రతిపాదనకు సంబంధించిన తీర్మానాన్ని కేంద్ర న్యాయశాఖమంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు. తదుపరి సెషన్ చివరివారం మొదటి రోజున కమిటీ తన నివేదికను సమర్పించాలని మేఘ్‌వాల్ ప్రతిపాదించారు. కేంద్ర మాజీ మంత్రి పర్షోత్తమ్‌భాయ్ రూపాలా, భర్తృహరి మహతాబ్, అనిల్ బలూని, సిఎం.రమేష్, బన్సూరి స్వరాజ్, విష్ణుదయాళ్ రామ్, సంబిత్‌పాత్రా బిజెపి లోక్‌సభ సభ్యులు ఈ ప్యానెల్‌లోఉన్నారు. ఈ కమిటీ చైర్‌పర్సన్‌గా మాజీ న్యాయశాఖ మంత్రి చౌదరి ఉండే అవకాశం ఉందని, ఠాకూర్ కూడా పోటీదారు అని వర్గాలు తెలిపాయి.నిబంధనల ప్రకారం..లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా తుది పిలుపును స్వీకరిస్తారని వారు చెప్పారు. కాంగ్రెస్‌పార్టీకి చెందిన మనీష్ తివారీ, సుఖ్‌దేవ్ భగత్, శివసేనకు చెందిన శ్రీకాంత్‌షిండే, సమాజ్‌వాదీపార్టీకి చెందిన ధర్మేంద్రయాదవ్, తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన కళ్యాణ్ బెనర్జీ, డిఎంకెకు చెందిన టిఎం.సెల్వగణపతి, తెలుగుదేశం పార్టీకి చెందిన జిఎం.హరీష్ బాలయోగి, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్‌సిపి)కి చెందిన సుప్రియాసూలే, ఆర్ఎల్‌డికి చెందిన చందన్ చౌహాన్, జనసేన పార్టీకి చెందిన వల్లభనేని, ఇతర లోక్‌సభ సభ్యులు ఉన్నారు. రాజ్యసభ తన 10మంది సభ్యులను కమిటీకి ప్రత్యేక కమ్యూనికేషన్‌లో పేర్కొంది. కమిటీలో ఉండాలని ప్రతిపాదించిన లోక్‌సభ సభ్యులలో 14మంది బిజెపికి చెందిన నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్‌లోని వారు కాగా, వీరిలో 10మంది బిజెపికి చెందిన వారున్నారు.ఈ కమిటీకి ఇప్పటికే పలు ప్రతిపక్ష పార్టీలు రాజ్యసభ నుంచి తమ ప్రతినిధుల పేర్లను సమర్పించాలని సంబంధితవర్గాలు తెలియజేశాయి. కాంగ్రెస్‌పార్టీకి చెందిన రణ్‌దీప్ సూర్జేవాలా,డిఎంకె కు చెందిన పి.విల్సన్, తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి చెందిన సాకేత్ గోఖలే, జెడి(యు)కు చెందిన సంజయ్‌ఝా, బిజెడికిచెందిన మానస్ రంజన్ మాంగరాజ్ కమిటీలో రాజ్యసభ సభ్యులుగా ఉండే అవకాశం ఉంది.రాజ్యాంగసవరణ అవసరమయ్యే ఒకే దేశంఒకే ఎన్నిక (ఒఎన్ఒఇ) బిల్లులు, ఏకకాలంలో ఎన్నికలను నిర్వహించడానికియాంత్రాంగాన్ని నిర్దేశించాయి. గరంగరం చర్చ తర్వాత మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టబడ్డాయి. పార్లమెంట్ ఆవరణలో కాంగ్రెస్ ఎంపి ప్రియాంకగాంధీ విలేకరులతో మాట్లాడుతూ ఈ బిల్లులు రాజ్యాంగ విరుద్ధం అని ఆరోపించారు. ఇది మనదేశ సమాఖ్య విధానానికి విరుద్ధమని, ఈ బిల్లును కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తుందని చెప్పారు.బిజెపి,దాని మిత్రపక్షాలైన టిడిపి, జెడి(యు), శివసేనబిలులను గట్టిగా సమర్థించాయి. తరచూ ఎన్నికలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆటంకాలు కలిగిస్తున్నాయని, ఏకకాల ఎన్నికలు ఎన్నికల వ్యయాన్ని తగ్గించడం ద్వారా తమకు ఊతం ఇస్తాయని ఈ విధానాన్ని సమర్థించారు.

## షా క్షమాపణ చెప్పాలి

(3వ పేజీ తరువాయి)

దూసుకువచ్చారు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ, వయనాడ్ ఎంపి ప్రియాంకాగాంధీ కూడా ఆ సమయంలో సభలోనే ఉన్నారు. కాంగ్రెస్‌కు మద్దతుగా తొలుత టిఎంసి ఎంపీలు లేచి నిలబడి నినాదాలు చేశారు. దాంతో సభ మధ్యాహ్నం రెండు గంటలవరకూ సభ వాయిదా పడింది. న్యాయశాఖామంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ కాంగ్రెస్ పై ఎదురుదాడికి దిగారు. కాంగ్రెస్‌పార్టీ ఎల్లప్పుడూ అంబేద్కర్‌ను అవానిస్తూనే ఉంటుందని, ఈ కారణంగానే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ ఓడిపోయిందని విమర్శించారు. ఆ పార్టీ అంబేద్కర్‌ను గౌరవించకపోయినప్పటికీ బలవంతంగా ఆయన పేరు జపిస్తోందని విమర్శించారు. ఐతే ప్రశ్నోత్తరాల సమయాన్ని కొనసాగించేందుకు సహకరించాలని స్పీకర్ స్థా నంలో ఉన్న ఓం బిర్లా సభ్యులకు విజ్ఞప్తి చేసినాగానీ ఫలితం లేకపోయింది. రెండు నిమిషాలు కూడా గడవకుండానే సభ తొలుత వాయిదా పడింది.

**స్తంభించిన రాజ్యసభ**

రాజ్యాంగ రూపశిల్పి అంబేద్కర్‌ను అవమానిస్తూ అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు తీవ్ర నిరసన వ్యక్తం చేయడంతో బుధవారంనాడు రాజ్యసభ కార్యకలాపాలు స్తంభించాయి. ప్రతిపక్షాల నిరసనలు రాజ్యసభను కుదిపేశాయి. కేంద్రమంత్రి అమిత్ షా వెంటనే క్షమాపణలు చెప్పాలని రాజ్యసభలో ప్రతిపక్ష ఎంపీలు డిమాండ్ చేశారు. ఐతే పార్లమెంటరీ వ్యవహారాలమంత్రి కిరెన్ రిజిజు కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. దేశాన్ని కాంగ్రెస్ పార్టీ తప్పుతోవ పట్టిస్తోందని, అమిత్ షా చేసిన ప్రసంగంలో ఒక భాగాన్ని మాత్రమే చూపించి కాంగ్రెస్‌పార్టీ దేశాన్ని తప్పుతోవ పట్టిస్తోందన్నారు. హోంమంత్రి మంగళవారంనాడు రాజ్యసభలో మాట్లాడిన మాటలు చాలా స్పష్టంగా ఉన్నాయనీ, అవన్నీ రికార్డుల్లో నిక్షిప్తమై ఉన్నాయని చెప్పారు. ''మీరు (కాంగ్రెస్) అమిత్ ప్రసంగం రెండో భాగంలో 11 లేదా 12 సెకన్లపాటు ఉన్న మాటలను మాత్రమే తీసుకుని దేశాన్ని తప్పుతోవ పట్టిస్తున్నారు, మొత్తం ప్రసంగాన్ని మీరు వినిపించడంలేదు'' అని రిజిజు విమర్శించారు. బిజెపి దృష్టిలో అంబేద్కర్ దేవుడుతో సమానమని అన్నారు. రిజిజు అలా చెప్పినప్పటికీ ప్రతిపక్షాలు శాంతించలేదు. తమ నిరసనను కొనసాగించాయి. భోజన విరామం తర్వాత సభ సమావేశమైన తర్వాత కూడా సభలో గందరగోళం, నిరసనలు కొనసాగడంతో ఇక బుధవారంనాటికి సభా కార్యకలాపాలు పూర్తిగా వాయిదాపడ్డాయి. అంతకుముందు ఉదయం శూన్య గంటలో కాంగ్రెస్ ఎంపి జైరామ్ రమేశ్ లేచి అమిత్ షా మంగళవారంనాడు రాజ్యసభలో అంబేద్కర్‌ను అగౌరవించారని, ఆయన క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేయడంతో నిరసనలు ప్రారంభమయ్యాయి. అనేకమంది కాంగ్రెస్ ఎంపీలు లేచి నిలబడి నినాదాలు చేశారు. ''అంబేద్కర్‌ను అవమానిస్తే భారతదేశం సహించదు'' అని నినాదాలు చేశారు. దీంతో మంత్రి రిజిజు లేచి, అంబేద్కర్ అంటే కాంగ్రెస్‌పార్టీకి ఏ మాత్రం గౌరవం లేదని, అందువల్లనే అంబేద్కర్‌కు భారత్ రత్నను కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వం ఏనాడూ ఇచ్చే ప్రయత్నం చేయలేదని విమర్శించారు. ఈ గందరగోళంమధ్య రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జునఖర్గే లేచి అంబేద్కర్ పోస్టర్‌ను ప్రదర్శించారు. తర్వాత కొద్దిసేపటికే రాజ్యసభాపతి జగదీప్ ధన్‌కర్ సభను మధ్యాహ్నం రెండు గంటలవరకూ వాయిదా వేశారు. భోజన విరామం తర్వాత సభ సమావేశమయ్యాక ఈ రోజు షెడ్యూలులో అప్రాప్రియేషన్ బిల్లు, బ్యాంకింగ్ బిల్లు ఉన్నాయని రిజిజు చెప్పారు. బ్యాంకింగ్ నియంత్రణ బిల్లుపై చర్చ జరిపేందుకు సభను కొనసాగనివ్వాలని ప్రతిపక్షాలకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఐనప్పటికీ కూడా ప్రతిపక్ష ఎంపీలు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. అంబేద్కర్‌ను అమిత్ షా అవమానించారని, ఆయన జాతికి క్షమాపణ చెప్పాలని కోరారు. పదే పదే అంబేద్కర్ పేరు జపిస్తున్నారనీ, అందుకు బదులుగా దేవుడిపేరు జపించి ఉంటే కనీసం స్వర్గలోకప్రాప్తి కలిగి ఉండేదని, ఏడు మానవజన్మలకూ మోక్షం లభించి ఉండేదని అమిత్ షా మంగళవారంనాడు రాజ్యసభలో వ్యాఖ్యానించారు.

**అమిత్ షా రాజీనామాకు కాంగ్రెస్ డిమాండ్**

అంబేద్కర్‌ను అవమానిస్తూ రాజ్యసభలో వ్యాఖ్యలు చేసిన కేంద్రహోం మంత్రి అమిత్ షా తన పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్‌పార్టీ డిమాండ్ చేసింది. ఆయన చేసిన విమర్శలకుగాను బహిరంగ క్షమాపణ చెప్పాలని కోరింది. రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్‌పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బుధవారంనాడు పార్లమెంటు ప్రాంగణంలో పాత్రికేయులతో మాట్లాడుతూ, బాబాసాహెబ్ అంబేద్కర్‌కు అవమానం జరిగిందనీ, అమిత్ షా తప్పు చేశారనీ, అందువల్ల ఆయన రాజీనామా చేయాలని తాను డిమాండ్ చేస్తున్నాననీ అన్నారు. మనుస్మృతి సిద్ధాంతం, ఆర్ఎస్ఎస్ చెప్పినట్లు అంబేద్కర్‌కుగానీ, రాజ్యాంగానికిగానీ గౌరవం ఇవ్వడంలేదని, అందువల్లనే అన్నిపార్టీలూ అమిత్ షా రాజీనామాకు డిమాండ్ చేస్తున్నాయని, ఆయన క్షమాపణలను కోరుతున్నాయని అన్నారు. అంబేద్కర్ గురించి వందసార్లు మాట్లాడుతున్నారని హోంమంత్రి తమపై ఆరోపణలు చేశారనీ, దానిబదులు దేవుడి పేరు జపించి ఉంటే ఏడు మానవ జన్మలలో ఏడుసార్లు స్వర్గలోక ప్రాప్తి కలిగి ఉండేదని అన్నారని ఖర్గే గుర్తుచేశారు. ఆయన ఇదేవిధంగా గనుక మాట్లాడటంకొనసాగిస్తే, ఇదేవిధంగా ఎవరైనా అంబేద్కర్‌ను అవమానిస్తే దేశవ్యాప్తంగా ఆగ్రహం చెలరేగుతుందని అన్నారు. మనుస్మృతిని నమ్మేవారు అంబేద్కర్‌ను ఇదేవిధంగా వ్యతిరేకిస్తారని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ అన్నారు. కాంగ్రెస్‌పార్టీ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ మాట్లాడుతూ, అంబేద్కర్‌పై వ్యాఖ్యలకు వ్యతిరేకంగా, అదానీ వివాదంపై నిరసనగా దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో రాజ్‌భవన్‌లకు పిసిసి అధ్యక్షుడు నిరసన ప్రదర్శనలు జరపాలని పిలుపు ఇచ్చారు. అంతకుమందు కాంగ్రెస్‌ఎంపి నీరజ్ దంగీ మాట్లాడుతూ, అమిత్‌షా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. బిజెపి ఆలోచనావిధానం ఏ విధంగా ఉంటుందో అమిత్ షా యావత్ దేశానికి కళ్ళకు కట్టినట్టు చూపించారన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State,
Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com